

డిప్యూటీ మేయర్ ఎన్నికకు వైసీపీ దూరం!

విశాఖపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19న జరగనున్న జీవీఎంసీ డిప్యూటీ మేయర్ ఎన్నికకు వైసీపీ కార్పొరేటర్లు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. డిప్యూటీ మేయర్ పదవిలో ఉండగా జియ్యాని శ్రీధర్‌పై కూటమి కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంతో ఆయన పదవిని కోల్పోయిన సంగతి తెలిసిందే. ఖాళీ అయిన ఈ పదవి కోసం ఈ నెల 19వ తేదీ ఉదయం 11 గంటలకు కౌన్సిల్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన విషయం ... మిగతా 6వ పేజీలో

ప్రాజెక్టుల పరుగు..


రూ.400 కోట్ల విలువైన పనుల ప్రారంభోత్సవాలకు సన్నాహాలు

- కొత్తవి చేపట్టేందుకు త్వరలో శంకుస్థాపనలు
- నూతనంగా ఐదు లేఅవుట్లు
- కైలాసగిరిపై రూ.1.5 కోట్లతో 55 అడుగుల శివుడి త్రిశూలం ఏర్పాటు
- మాస్టర్ ప్లాన్ రహదారులకు టీడీఆర్‌లు
- కాకాని నగర్‌లో రూ.12 కోట్లతో సబ్‌వే
- అనకాపల్లిలో కొత్తగా జోనల్ కార్యాలయం

'ఆంధ్రజ్యోతి'తో వీఎంఆర్డీఏ కమిషనర్ కె.విశ్వనాథన్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్డీఏ) రూ.400 కోట్లతో నిర్మించిన పలు ప్రాజెక్టులు, చేపట్టేబోయే కొత్త ప్రాజెక్టులకు త్వరలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్టు కమిషనర్ కె.విశ్వనాథన్ తెలిపారు. అలాగే కొత్తగా ఐదు లేఅవుట్లను వేయనున్నామన్నారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి'తో మాట్లాడుతూ అనేక అంశాలను వివరించారు. ఆయా వివరాలు ఆయన మాటల్లోనే..



కైలాసగిరిపై ఏర్పాటు చేయనున్న 55 అడుగుల త్రిశూలం నమూనా

- విశాఖ నగరంలోని కాపులుప్పాడలో 20 ఎకరాలు, నిడిగట్టులో 12 ఎకరాలు, గిడిజాలలో 7.5, చిన ముషిడివాడలో నాలుగు ఎకరాలు, అనకాపల్లి పక్కనున్న తుమ్మపాలలో 15 ఎకరాల విస్తీర్ణంలో కొత్త లేఅవుట్లు వస్తాయి.
- మొత్తం మూడు మాస్టర్ ప్లాన్ పనులను ఏకకాలంలో చేపడుతున్నాం. గతంలో ఖరారు చేసిన మాస్టర్ ప్లాన్-2041పై అభ్యంతరాలను ఆహ్వానించి మార్పులు, చేర్పులతో కొత్తది తయారుచేస్తాం. అలాగే విశాఖపట్నం-కాకినాడ పెట్రో కెమికల్ పెట్రో ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్‌కు కూడా కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నాం. ఇది పెదగంట్యాడ, నడుపూరు నుంచి నక్కపల్లి వరకు 640 కి.మీ.ల విస్తీర్ణంలో ఉంటుంది. వీఎంఆర్డీఏలో అదనంగా చేరిన 13 మండలాలకు వేరే మాస్టర్ ప్లాన్ తయారవుతున్నది. ఈ మూడు మాస్టర్ ప్లాన్‌లు ఒకదానితో ఒకటి ఇంటిగ్రేట్ అయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.
- నగరంలోని సిరిపురంలో నిర్మించిన మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం, బీచ్ రోడ్డులోని యూహెచ్3హెచ్ హెలికాప్టర్ మ్యూజియం, ఎండాడ, చీమలాపల్లిల్లో నిర్మించిన కల్యాణ మండపాలను ప్రారంభోత్సవాలకు సిద్ధం చేశాం. ఇవికాకుండా కొత్తగా మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నాం. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తవుతున్న సందర్భంగా ఇవన్నీ సీఎం చంద్రబాబునాయుడు చేతులమీదుగా చేపట్టే అవకాశం ఉంది.
- కైలాసగిరిపై కొత్తగా శివుడికి సింబాలిక్‌గా త్రిశూలాన్ని ఏర్పాటు చేయబోతున్నాం. ఇది 55 అడుగుల ఎత్తు, 12 అడుగుల వెడల్పున ఉంటుంది. దీనికి రూ.1.5 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశాం. ఆరు నెలల్లోనే దీనిని ... మిగతా 6వ పేజీలో

ఎట్టకేలకు వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్-2041కు సవరణలు

- 22 నుంచి అభ్యంతరాలు, సలహాల స్వీకరణ
- వెబ్ అప్లికేషన్, ఫోన్ ద్వారా కూడా అభిప్రాయాలు చెప్పవచ్చు
- సంస్థ కమిషనర్ విశ్వనాథన్



వీఎంఆర్డీఏ కమిషనర్ కె.విశ్వనాథన్

విశాఖపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఖరారు చేసిన వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్-2041కు ఎట్టకేలకు సవరణ చేయాలని నిర్ణయించారు. వీఎంఆర్డీఏ పరిధిలో వైసీపీ నేతలకు చెందిన భూముల విలువ పెరిగేలా, పార్టీకి చెందిన బిల్డర్లకు లబ్ధి చేకూరేలా, నగర శివార్లలో పెద్దసంఖ్యలో లేఅవుట్లు వేసుకున్న వారికి ప్రయోజనం కలిగేలా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి, ఖరారు చేశారు. ఇతరుల నుంచి హస్తగతం చేసుకోవాలని ప్రణాళిక రూపొందించుకున్న భూములకు అనుగుణంగా జోన్లను మార్చేశారు. స్వప్రయోజనాల కోసం మాస్టర్ ప్లాన్‌లో రహదారులను మళ్లించారు. దీంతో ఇతర రైతులు, ప్రజలు నష్టపోయారు. అవసరం లేకున్నా కొన్ని రహదారులను 200 అడుగుల నుంచి 250 అడుగుల వెడల్పునకు విస్తరించాలని నిర్ణయించారు. ఆ పేరుతో వైసీపీ నేతలు జీవీఎంసీ నుంచి కోట్ల రూపాయల విలువైన టీడీఆర్‌లను కొట్టేశారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ మాస్టర్ ప్లాన్‌ను సవరించాలని అనేక వర్గాలు కోరుతున్నాయి. ఈ విషయాన్ని వీఎంఆర్డీఏ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా... అన్ని వర్గాల నుంచి సలహాలు, సూచనలు తీసుకుని ముందుకు వెళ్లాలని సూచించింది. ఈ నేపథ్యంలో వీఎంఆర్డీఏ దీనిపై ఈ నెల 19న ప్రకటన జారీ చేయాలని నిర్ణయించింది. 22 నుంచి జూన్ 21 వరకు మాస్టర్ ప్లాన్-2041పై అభ్యంతరాలు, సూచనలను నేరుగా లేదా పోస్టులో వీఎంఆర్డీఏ కార్యాలయానికి పంపవచ్చు. దీనికి వెబ్ అప్లికేషన్‌ను కూడా రూపొందించామని, మొబైల్ ఫోన్ ద్వారా కూడా అభిప్రాయాలను తెలియజేయవచ్చునని వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్ తెలిపారు. ప్రభుత్వ శాఖలు కూడా తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.

ఏఐ ట్రాఫిక్ సిగ్నల్స్ ఏవీ?



నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సీపీ యోచన

- 110 కూడళ్లలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదన
- పైలట్ ప్రాజెక్టుగా తొలుత పదిచోట్ల ఏర్పాటు చేస్తామని ప్రకటన
- ఆరు నెలలైనా ఆచరణకు నోచుకోని వైనం



రైల్వే స్టేషన్ నుంచి కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గంలో నిలిచిన వాహనాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో నానాటికీ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)సీసీ కెమెరాలను ఏర్పాటుచేసే ప్రతిపాదనను నగర పోలీస్‌కమిషనర్ శంఖబ్రత బాగ్చి రూపొందించారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యల పరిష్కారంతో పాటు రోడ్డు ప్రమాదాలు, నేరాల నియంత్రణకు అవకాశం కలుగుతుందని సీపీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి గత ఏడాది నవంబరులోనే ప్రతిపాదనలు తయారుచేశామని ఆయన ప్రకటించారు. అయితే ఇది జరిగి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఆచరణలోకి రాకపోవడంతో ఏఐ ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నగరంలో రోడ్డు ప్రమాదాల కారణంగా ఏటా సగటున 350 మంది వరకు ప్రాణాలు కోల్పోతున్నారు. కూడళ్ల వద్ద రెడ్ సిగ్నల్స్ ఉన్నప్పటికీ అక్కడున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ తమను చూడడం లేదనే భావనతో నిబంధనలను ఉల్లంఘించి చాలామంది ముందుకు వెళుతూ ప్రమాదాలకు కారణంగా మారుతున్నారు. కొంతమంది వాహనచోదకులు అయితే ఎన్నిసార్లు జరిమానా విధించినా సరే హెల్మెట్ ధరించకుండా వాహనాలను నడపడం, ట్రిపుల్ రైడింగ్ చేయడం, రాంగ్ రూట్‌లో వాహనాలను నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటి ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. దీనివల్ల కూడా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మరికొందరైతే పోలీసులు జరిమానా విధిస్తారనే భయంతో వారున్నచోట హెల్మెట్ పెట్టుకుని, ఆ కూడలి దాటాక హెల్మెట్ తీసి పక్కన పెట్టేస్తున్నారు. దీనివల్ల రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీసులు ఎంత కృషి చేసినా ఆశించిన ఫలితాలు మాత్రం రావడం లేదు. దీంతో ట్రాఫిక్ నిబంధనలను ప్రతిఒక్కరూ పక్కాగా పాటించేలా చేయాలంటే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాల్సిందేనని సీపీ భావించారు. ఈ మేరకు కొంతమంది ఐటీ నిపుణులతో సమావేశమై నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్‌తోపాటు నిబంధనలను ఉల్లంఘించే వారిని గుర్తించి వారికి జరిమానాలు విధించేలా చేసే అవకాశాలపై చర్చించారు. అత్యాధునిక సీసీ కెమెరాలను కూడళ్ల వద్ద అమర్చి వాటికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను అనుసంధానం చేస్తే మెరుగైన ఫలితాలను రాబట్టవచ్చునని ఐటీ నిపుణులు సీపీకి వివరించారు. ఏఐ ట్రాఫిక్ సిగ్నల్స్ అందుబాటులోకి వస్తే ముందు కూడలిలో గ్రీన్‌సిగ్నల్ పడినప్పుడు తర్వాత జంక్షన్‌కు వాహనం వచ్చినపుడు కూడా గ్రీన్ సిగ్నల్ పడేలా సింక్రనైజ్ చేసేందుకు అవకాశం ... మిగతా 6వ పేజీలో

ఏపీఈసెట్ ఫలితాల్లో సత్తా చూపిన విశాఖ విద్యార్థులు

- పలు కేటగిరీల్లో ప్రథమ ర్యాంకులు
- కెమికల్ ఇంజనీరింగ్ టాప్ టెన్ ర్యాంకులన్నీ కంచరపాలెంలోని ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలవే..



శశాంత్, ఫస్ట్ ర్యాంక్ (కెమికల్ ఇంజనీరింగ్)



ఎస్.అభిషేక్, ఫస్ట్ ర్యాంక్ (మెటలర్జీ విభాగం)

విశాఖపట్నం/కంచరపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సు రెండో సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీఈసెట్‌లో విశాఖ విద్యార్థులు తమ సత్తా చూపారు. కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో 128 మార్కులతో అగనంపూడి సమీపంలోని పెదమడకకు చెందిన గొలగాని శశాంత్ రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడు. వడ్లపూడికి చెందిన దొడ్డి యశ్వంత్ 121 మార్కులతో మూడో ర్యాంకు, శ్రీహరిపురానికి చెందిన తాడి ప్రనూశ్ 118 మార్కులతో నాలుగో ర్యాంకు, కూర్మన్నపాలెంలో ఉంటున్న ఎస్.తేజశిరాజ్ 117 మార్కులతో ఐదో ర్యాంకు, మర్రిపాలేనికి చెందిన నాయుడు జయశ్రీ 116 మార్కులతో 7, గోపాలపట్నానికి చెందిన ఎ.మాధవి శ్రీలేఖ 115 మార్కులతో 8, మధురవాడకు చెందిన మీసాల సాయివర్షిణి 113 మార్కులతో 9, పెందుర్తి దొగ్గవానిపాలేనికి చెందిన బి.ప్రశాంతి 111 మార్కులతో 10వ ర్యాంకును సాధించారు.

అలాగే కెమికల్ ఇంజనీరింగ్ కోర్సులో టాప్ టెన్ ర్యాంకులు సాధించిన అభ్యర్థుందరూ కంచరపాలెంలోని ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కాలేజీలో పాలిటెక్నిక్ కోర్సు చదివినవారే కావడం విశేషం. వీరిలో ఏడుగురు కెమికల్ ఇంజనీరింగ్, ఒకరు ప్లాస్టిక్ పాలిమర్స్, మరొకరు పెట్రోలియం ఇంజనీరింగ్, ఇంకొకరు ఆయిల్ టెక్నాలజీ కోర్సును పూర్తి చేశారు. అలాగే కంచరపాలెంలోని ప్రభుత్వ పాలటెక్నిక్ కళాశాలలో మెటలర్జీ విభాగంలో ఎన్.అభిషేక్ ఫస్ట్ ర్యాంకు, ఎస్.భువనేశ్వరి 4వ ర్యాంకు, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో కె.సత్య సాయికృష్ణ కౌశిక్ 3వ సాధించారు, ఎస్.మేఘన 4, కె.యతేంద్ర 6, వి.గీతిక 9వ ర్యాంకులను సాధించారు. కాగా మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఎం.హసీన్‌హుద్దీన్ 9వ ర్యాంకు, సివిల్ ఇంజనీరింగ్‌లో ఎ.కేశవరావు 11వ ర్యాంకు సాధించారు. ఇదిలావుండగా జిల్లాలో అన్ని కోర్సులకు కలిపి 4,855 మంది పరీక్షకు హాజరవ్వగా 4,506 మంది అర్హత సాధించారు. వీరిలో పురుషులు 3,198 మందికి 2,930, మహిళలు 1,657 మందికి 1,576 మంది అర్హత సాధించారు.

ఐఐటీలో ఎంటెక్ చేస్తా..

ఈసెట్ కెమికల్ ఇంజనీరింగ్ బ్రాంచిలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. ఇంజనీరింగ్‌లో రెండో ఏడాదిలో ప్రవేశించి బీటెక్ పూర్తి చేశాక గేట్ రాసి ఐఐటీలో సీటు సంపాదించడమే లక్ష్యం. ఆ తరువాత ప్రభుత్వ రంగ సంస్థలో జాబ్‌లో చేరాలి. మా తండ్రి గొలగాని శ్రీనివాసరావు కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు.

\- శశాంత్, ఫస్ట్ ర్యాంకర్

అగనంపూడి హౌసింగ్ కాలనీపై విచారణ

-6లో

- గాజువాక ఎమ్మెల్యే ఫిర్యాదుతో విచారణకు 11 బృందాలు

2.5 లక్షల మందితో అంతర్జాతీయ యోగా దినోత్సవం

- ప్రధాన వేదిక ఆర్కే బీచ్ లేదా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానం
- కలెక్టర్ హరేంధిరప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా వచ్చే నెల 21వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు.ఈ వేడుకల్లో సుమారు 2.5 లక్షల మంది పాల్గొనేందుకు వీలుగా చర్యలు చేపట్టాలన్నారు. 'యోగా ఫర్ వన్ ఎర్త్-వన్ హెల్త్ ' అనే నినాదంతో నిర్వహించే ఈ కార్యక్రమ నిర్వహణ, మైదానాల గుర్తింపు, మౌలిక వసతుల కల్పన, టీవీ స్క్రీన్ల ఏర్పాటు, రవాణా, తాగునీరు, తదితర సదుపాయాలపై గురువారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21వ తేదీ ఉదయం 6 నుంచి 8 గంటల మధ్యలో సుమారు 45 నిమిషాలపాటు యోగా దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. నగరంతోపాటు పరిసరాల్లో ఉన్న పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, యోగా అభ్యాసకులు, ఉద్యోగులు, పౌరులు, రక్షణ సిబ్బంది, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, క్రీడాకారులు, ఇతర సంస్థల కార్యకర్తలను ఈ వేడుకల్లో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. మూడు నుంచి నాలుగు వేల మంది పాల్గొనేలా వేదికలను ఖరారు చేయాలని, ప్రతి 24 చదరపు అడుగులకు ఒకరు కూర్చునేలా ఏర్పాట్లు చేయాలని, నోడల్ అధికారులు కీలకంగా వ్యవహరించాలని, కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసుకోవాలని హరేంధిరప్రసాద్ స్పష్టం చేశారు. ప్రతిఒక్కరి క్యూఆర్ కోడ్ స్కాన్ చేశాకే వేదికలపైకి అనుమతించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆర్కే బీచ్ లేదా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరిగే యోగా దినోత్సవంలో జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రముఖులు భాగస్వాములవుతారని, ఇందుకు సంబంధించి ... మిగతా 6వ పేజీలో

బీచ్ రోడ్డులో ఖాకీల వసూళ్లు నిజమే..

- 'ఆంధ్రజ్యోతి' కథనంపై పీఎంపాలెం పోలీసుల దర్యాప్తు
- మద్యం దుకాణాలు, పాన్‌షాప్‌లకు వెళ్లి విచారణ
- ఓ కానిస్టేబుల్ నగదు ఫోన్‌పే చేయించుకున్నట్టు స్క్రీన్ షాట్‌ల సేకరణ!

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

విశాఖపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): బీచ్ రోడ్డులో మందుబాబులు, ప్రేమ జంటల నుంచి కొందరు పోలీసులు బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నట్టు 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం నిజమేనని పోలీస్ అధికారుల విచారణలో నిర్ధారణ అయింది. బీచ్ రోడ్డులోని మద్యం దుకాణాల వద్ద మద్యం సేవించి వాహనాలపై వెళ్లేవారిని, ఈ రోడ్డులో తిరిగే ప్రేమ జంటలను కొంతమంది బీచ్ పెట్రోలింగ్ పోలీసులు బెదిరించి డబ్బులు గుంజేస్తుండడంపై బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'బీచ్ రోడ్డులో ఖాకీల దందా' శీర్షికతో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన సీపీ శంఖబ్రత బాగ్చి సమగ్రంగా విచారణ జరపాలంటూ బీచ్ రోడ్డు పరిధి కలిగిన భీమిలి, పీఎంపాలెం, ఆరిలోవ, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయా స్టేషన్ల అధికారులు బీచ్‌రోడ్డులోని మద్యం దుకాణాలు, పాన్ షాప్‌ల వద్దకు వెళ్లి పోలీసుల బలవంతపు వసూళ్ల గురించి ఆరా తీయడంతో పాటు వారి సెల్ ఫోన్‌లోని ఫోన్‌పే హిస్టరీలో బీచ్ పెట్రోలింగ్ సిబ్బందికి సంబంధించి ఏమైనా లావాదేవీలు ఉన్నాయా? అని పరిశీలించారు. ఈ క్రమంలో పీఎంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం దుకాణం సిబ్బందితోపాటు ఓ పాన్ షాప్ నిర్వాహకుడి నుంచి ఒక కానిస్టేబుల్ ఫోన్‌పే చేయించుకున్నట్టు హిస్టరీలో కనిపించడంతో వాటి స్క్రీన్ షాట్‌లను ఆ స్టేషన్ అధికారి తీసుకున్నట్టు తెలిసింది. సిబ్బంది వసూళ్లకు సంబంధించిన ఆధారాలు లభ్యం కావడంతో పోలీస్ ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

రెండు పంచాయతీలకు స్పెషల్ గ్రేడ్ హోదా


- జిల్లాలోని గంభీరం, వేములవలస ఎంపిక
- గ్రేడ్-1 నుంచి పలు పంచాయతీల తొలగింపు
- రాష్ట్ర ప్రభుత్వ సంస్కరణలతో మార్పులు



గంభీరం పంచాయతీ కార్యాలయం

విశాఖపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ వ్యవస్థను పటిష్ఠపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణల ఫలితంగా గ్రామ పంచాయతీల హోదాలో మార్పులు చేశారు. ఆదాయం, జనాభా ఆధారంగా పంచాయతీల హోదా కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో జిల్లాలోని గంభీరం, వేములవలస గ్రామ పంచాయతీలకు స్పెషల్ గ్రేడ్ హోదా లభించింది. ఈ రెండు గ్రామ పంచాయతీలు ఏడాదికి సొంతంగా రూ.కోటి ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయి. ఇంటి పన్ను, రిజిస్ట్రేషన్లు, సీనరేజ్, వాణిజ్య సంస్థల నుంచి వసూలు చేసే పన్నులు రూ.కోటి దాటాలి. రాష్ట్రంలో పంచాయతీలకు స్పెషల్ గ్రేడ్ హోదా కల్పించడం ఇదే తొలిసారి. గంభీరం, వేములవలస గ్రామ పంచాయతీలు నగరానికి ఆనుకుని ఉండడంతో రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా స్టాంపు డ్యూటీ ఎక్కువగా వసూలవుతుంది. ఇంకా కొత్తగా ఏర్పాటవుతున్న అపార్టుమెంట్లు, వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, కళాశాలలు, పాఠశాలల నుంచి పన్నుల రూపంలో ఆదాయం వస్తోంది. ఆనందపురం జంక్షన్‌లో పూల మార్కెట్ మొత్తం వేములవలస పరిధిలో ఉండడంతో ఏడాదికి రూ. కోటికిపైగా ఆశీలు వసూలవుతుంది. ఇప్పటివరకు ఈ రెండు గ్రామ పంచాయతీలు గ్రేడ్-1 హోదాలో ఉన్నాయి. ఇప్పుడు స్పెషల్ గ్రేడ్ హోదా లభించడంతో పంచాయతీ కార్యదర్శిగా గజిటెడ్ హోదా ఉన్న అధికారిని నియమిస్తారు.

ఇదిలావుండగా జిల్లాలో 23 గ్రామ పంచాయతీలు ఇప్పటివరకు గ్రేడ్-1 హోదాలో ఉండగా, తాజాగా తీసుకున్న నిర్ణయం మేరకు పలు పంచాయతీలు ఆ హోదాను కోల్పోయాయి. గడిచిన మూడేళ్ల నుంచి గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖ నుంచి స్టాంపు డ్యూటీ ... మిగతా 6వ పేజీలో

WANTED
DTP OPERATORS
అనుభవం :
కమర్షియల్ అడ్వర్టయిజ్‌మెంట్స్‌ను, ఫోటోషాప్, క్వార్క్ ఎక్స్‌ప్రెస్‌లో (తెలుగు/ఇంగ్లీషు) ఆకర్షణీయంగా డిజైన్ చేయగలిగిన
డి.టి.పి. ఆపరేటర్లు కావలెను.

విద్యార్హత : Inter / Degree
జీతం : అర్హత, అనుభవాన్ని బట్టి ఉంటుంది.
ఇంటర్వ్యూ తేది: 16-5-2025,
సమయం: ఉ.10 గం.ల నుండి..
పత్రికారంగంలో Ads చేసిన అనుభవం వున్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్
ఆంధ్రజ్యోతి
పోర్ట్ హాస్పటల్ ఎదురుగా, NH5 అక్కయ్యపాలెం, విశాఖపట్నం
ఫోన్ : 9985411641



అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, మే 15 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి అర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన వైభవంగా గురువారం నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మ నిధి నుంచి పసిడి కుసుమాలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండప ప్రదక్షిణ జరిపారు. అనంతరం భక్తుల గోత్ర నామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ అష్టోత్తర శతనామార్చన పఠిస్తూ ప్రతి నామానికి ఒకటి చొప్పున పసిడి కుసుమాలతో పూజలు చేశారు. తరువాత అదే వేదికపై నిత్య కల్యాణం నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

అభివృద్ధి పథంలో వీసీబీ

మధురవాడ, మే 15 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు మధురవాడ శాఖ 2024-25 ఆర్థిక సంవత్సరంలో గణనీయమైన ఆర్థికాభివృద్ధి సాధించిందని బ్యాంకు ఇన్‌చార్జి డైరెక్టర్ జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. మిథిలాపురి వుడాకాలనీ ఆఖరి బస్టాప్ వద్ద గురువారం వీసీబీ మధురవాడ బ్రాంచి సభ్యుల మహాజన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధురవాడ శాఖలో ప్రస్తుతం 1842 మంది సభ్యులు ఉండగా, రూ.11.35 కోట్ల షేరు ధనంతో, రూ.134.35 కోట్ల డిపాజిట్లు, రూ.59.56 కోట్లు రుణాలతో బ్యాంకు ఆర్థికాభివృద్ధి సాధించిందని చెప్పారు. బ్యాంకు సంక్షేమ పథకాల్లో భాగంగా 30 మంది సభ్యులకు రూ. 8.48 లక్షలు వైద్య ఖర్చులకు చెల్లించామని తెలిపారు. 15 మంది సభ్యులు మృతి చెందడంతో వారి కుటుంబాలకు రూ.3.42 లక్షల సంక్షేమ నిధి అందించామన్నారు. ఈ సభలో డైరెక్టర్లు ఎస్. నాగభూషణ చౌదరి, చంద్రశేఖర్, ఈడీ జీవీ రామకృష్ణారావు, సీఈఓ వీబీటీ వరలక్ష్మి, డీసీఈఓ గణేశ్, జడ్ఎం సత్యనారాయణ, మేనేజర్ ఎంవీ అప్పారావు పాల్గొన్నారు.

నేడు ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

భీమునిపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో హనుమంతరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం పది గంటలకు ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, వివిధ బ్యాంకుల సిబ్బంది సమక్షంలో రుణాల మంజూరుకు లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. మండలంలోని 16 పంచాయతీల నుంచి 85 మంది దరఖాస్తు చేసుకున్నారని ఆయన చెప్పారు.

డిప్యూటీ మేయర్ ఎన్నికకు వైసీపీ దూరం!

... 5వ పేజీ తరువాయి

విధితమే. డిప్యూటీ మేయర్ ఎన్నిక కోసం సభ్యులందరికీ ఎన్నికల అధికారి హోదాలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఇప్పటికే నోటీసులు అందజేశారు. డిప్యూటీ మేయర్‌ను ఎన్నుకోవాలంటే కనీసం 56 ఓట్లు అవసరం. అయితే కూటమికి 74 మంది కార్పొరేటర్లు/ఎక్స్‌అఫీషియో సభ్యుల బలం ఉండడంతో కూటమి అభ్యర్థి డిప్యూటీ మేయర్‌గా ఎన్నికవ్వడం లాంఛనమేనని చెప్పుకోవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఎన్నికకు హాజరవ్వకూడదని వైసీపీ నేతలు తమ కార్పొరేటర్లను ఆదేశించినట్టు సమాచారం.

రెండు పంచాయతీలకు స్పెషల్ గ్రేడ్ హోదా

... 5వ పేజీ తరువాయి

విడుదలచేయలేదు. దీంతో పంచాయతీలు ఆదాయం కోల్పోడంతో మామిడిలోవ, గండిగుండం, గిడిజాల, శొంఠ్యాం, తర్లువాడ, కుసులవాడ, పెద్దిపాలెం, రాంపురం, వాలిమెరక, ఎస్ఆర్ పురం పంచాయతీలు గ్రేడ్-1 నుంచి గ్రేడ్-2గా మారాయి. అయితే మామిడిలోవ పంచాయతీలో దబ్బందలో 1,900 టిడ్కో ఇళ్లను నిర్మించారు. దీంతో జనాభా ఐదు వేలకు చేరుకునే అవకాశం ఉన్నందున తిరిగి గ్రేడ్-1 హోదా అధికారులు అంచనా వేస్తున్నారు. స్టాంపు డ్యూటీ విడుదలైతే గిడిజాల, గండిగుండం, పెద్దిపాలెం, వాలిమెరక, ఎస్ఆర్ పురం, రాంపురం పంచాయతీలు గ్రేడ్-1 హోదాను నిలబెట్టుకుంటాయని అంటున్నారు. మండల కేంద్రాలను గ్రేడ్-1 పంచాయతీలుగా పరిగణించాలన్న ఆదేశాలతో పద్మనాభం పంచాయతీకి హోదా గ్రేడ్-1 దక్కనున్నది. కాగా పెందుర్తి కేంద్రం జీవీఎంసీలో ఉన్నందున మండల పరిషత్ కార్యాలయాన్ని సరిపల్లి కేంద్రంగా నిర్వహించాలని ప్రతిపాదించడంతో సరిపల్లి కూడా గ్రేడ్-1గా కొనసాగే అవకాశం ఉంది. కొత్తగా పెదనాగమయ్యపాలెం పంచాయతీ గ్రేడ్-1 హోదాకు అప్‌గ్రేడ్ అయింది. పలు పంచాయతీల ఆదాయం పెరిగే అవకాశం ఉన్నందున గ్రేడింగ్‌ను తిరిగి పునరుద్ధరించాలన్న దానిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కాల గర్భంలోకి బ్యాంక్ బంగ్లా

- నేలమట్టం అయిన చారిత్రక కట్టడం
- ఓషన్ వ్యూ గెస్ట్ హౌస్‌గా స్థానికంగా ప్రసిద్ధి
- బ్రిటీష్ హయాంలో ఏర్పాటు
- ప్రైవేటు సంస్థ కొనుగోలుతో నేలకూలిన భవనం



భీమిలిలోని ఓషన్ వ్యూ గెస్ట్ హౌస్ (ఫైల్‌ఫొటో)

భీమునిపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మరో చారిత్రాత్మక కట్టడం కాల గర్భంలో కలిసిపోయింది. ఎంతో సుందర భవంతిగా సందర్శకులు, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునే బ్యాంక్ రోడ్‌లోని ఓషన్ వ్యూ బంగ్లా నేలమట్టమైంది. బ్రిటీష్ వారి హయాంలో భీమిలి



భవనం కూల్చివేత పనులు

పోర్టు ట్రేడింగ్‌లో దినదినాభివృద్ధి చెందడంతో ఇక్కడ బ్యాంక్ ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత ఏర్పడింది. ఆ సమయంలో మద్రాస్ రిజర్వ్ బ్యాంక్ బ్రాంచ్‌ను భీమిలిలో ఏర్పాటు చేశారు. 1867లో లక్ష్మీనృసింహస్వామి కొండ ఏటవాలు ప్రదేశంలో ఈ భవంతిని నిర్మించి అందులో మద్రాస్ బ్యాంక్ బ్రాంచ్ ఏర్పాటు చేశారు. బ్యాంక్ ఆఫ్ మద్రాస్‌కు కేవలం భీమిలిలో తప్ప మరెక్కడా బ్రాంచ్‌లు లేకపోవడం, ఈపట్నంలో పోర్టు ద్వారా జరిగిన ట్రేడింగ్ విశిష్టతను అర్థం చేసుకోవచ్చు. అంతేకాకుండా లండన్ నుంచి గోల్డ్ బార్స్ ఇక్కడికి దిగుమతి అయ్యేవి. ఎన్నో విదేశీ కంపెనీల బ్రాంచ్‌లు ఇక్కడ వ్యాపార లావాదేవీలు కొనసాగించేవి. 1939లో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమవడంతో ముందు జాగ్రత్తగా భారత ప్రభుత్వం దేశంలో ఉన్న ఓపెన్ పోర్టులను శత్రు దేశాల ఎయిర్ రైడ్స్‌ను రక్షణలో భాగంగా మూసివేసింది. దీంతో అదే ఏడాది ఈ బంగ్లాను అప్పట్లో పట్టణంలో వున్న యూరోపియన్ షిప్పింగ్ కంపెనీ జార్జ్ రిప్లై యాజమాన్యం సంబంధిత బ్యాంక్ బంగ్లాను కొనుగోలు చేసింది. స్వాతంత్ర్యానంతరం 1958 వరకూ ఈ బంగ్లాలో యూరోపియన్ ఆఫీషియల్స్ వుండేవారు. అప్పట్లో బిలియర్డ్స్ గేమ్ ఈ బంగ్లాలో యూరోపియన్స్ ఆడుతుండేవారు. తర్వాత ఈ బంగ్లాను చిట్టివలస జ్యూట్‌మిల్లు యాజమాన్యం కొనుగోలు చేసి ఓషన్ వ్యూ బంగ్లాగా నామకరణం చేశారు.

పలు సినిమా షూటింగ్‌లు

ఈ బంగ్లాలో కోకిలమ్మ, ముద్ద మందారం, రావోయి చందమామ, నాలుగు స్తంభాలాట, చామంతి ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో సినిమాలు చిత్రీకరించారు. ఈ బంగ్లాను చిట్టివలస మిల్లు 2009లో మూసివేసిన తర్వాత అయిదేళ్ల క్రితం విశాఖ పోర్టులో షిప్పింగ్ కంపెనీ బోత్రా వారు కొనుగోలు చేశారు. రెండు రోజులుగా ఈ బంగ్లాను మిషన్లు, కట్టర్స్‌తో వెనుక నుంచి కూలగొడుతూ పూర్తిగా నేలమట్టం చేసేశారు. చారిత్రక కట్టడాలు ఒక్కొక్కటిగా కనుమరుగు కావడంతో పలువురు ఆవేదన చెందుతున్నారు.

సెమ్స్‌తో గీతం ఎంఓయూ

సాగర్‌నగర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : నౌకా నిర్మాణ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనల కోసం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశాఖలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైమ్ అండ్ షిప్ బిల్డింగ్ (సెమ్స్)తో గురువారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్, సెమ్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కమాండర్ ఎస్. గోపీ కృష్ణ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ మాట్లాడుతూ గీతం విద్యార్థులు సాఫ్ట్‌వేర్ రంగంలోనే కాకుండా నౌకాయాన రంగాల్లో కూడా మంచి అవకాశాలు పొందాలని చెప్పారు. సెమ్స్ సీఈఓ గోపీ కృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నౌకా నిర్మాణ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాయన్నారు. నైపుణ్యం ఉన్న వారికి ఈ రంగంలో అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీఆర్ శర్మ, గీతం ఈఈసీఈ విభాగం ప్రొఫెసర్ జీవీఎస్ రాజశేఖర్, బి. సూరజ్ అరవింద్, సెమ్స్ జనరల్ మేనేజర్ ఎస్. మజుందార్, సెమ్స్ మేనేజర్ లివింగ్ స్టన్ ఫ్రాన్సిస్, తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్ష నాయకులతో జడ్సీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్సీ కనక మహాలక్ష్మి

కొమ్మాది, మే 15 (ఆంధ్రజ్యోతి) : పరిపాలనా సౌలభ్యం కోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఒక జోనల్ వ్యవస్థగా ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వం ప్రతిపాదనలపై జోన్-2 కార్యాలయంలో కమిషనర్ కనక మహాలక్ష్మి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జోన్-2 పరిధిలోని పలు రంగాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి ఒక జోనల్ కార్యాలయం ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందని అఖిలపక్ష నాయకులు, నివాసిత సంఘాలు, ఇతర రంగాల ప్రముఖులు, సీనియర్ సిటిజన్‌ల సలహాలు స్వీకరించారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ.2 లక్షల విరాళం

సింహాచలం, మే 15 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి విజయవాడలోని రామచంద్రాపురం ప్రాంతానికి చెందిన బులుసు తనూశ్రీ, భారతీదేవి వేర్వేరుగా రూ. లక్ష చొప్పున విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాలను నగదు రూపంలో దేవాలయ ప్రజా సంబంధాల విభాగం పర్యవేక్షణాధికారి సివి పద్మనాభరాజు (విక్రమ్)కు గురువారం వారు అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాతల కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయంలో మూలవిరాట్ దర్శనం కల్పించి శేషవస్త్రంతో సత్కరించి వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు

'సమ్మెను విజయవంతం చేయండి'

మధురవాడ, మే 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల గొంతు నొక్కే విధానాలను విడనాడాలని మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి అన్నారు.ఏడో వార్డులో ఉన్న ద్రోణంరాజు కల్యాణ మండపంలో గురువారం ఆయన పలు కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మిక చట్టాలు, ప్రజల హక్కులను కాపాడుకోవడానికి ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని చెప్పారు. ఈ సమ్మెను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ మధురవాడ జోన్ నాయకుడు డి. అప్పలరాజు, జీవీఎంసీ కార్మిక సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



కాటన్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న గీతం అధికారులు, ప్రొఫెసర్లు

ఘనంగా కాటన్ జయంతి

సాగర్‌నగర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ ఇంజినీరింగ్ నిపుణుడు, గోదావరి ఆనకట్ట రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్ జయంతి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ ముకుంద్, సీనియర్ ప్రొఫెసర్లు కాటన్ విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గౌతమ్‌రావు మాట్లాడుతూ కాటన్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

జనసేన కార్యాలయాన్ని సందర్శించిన నాగబాబు



పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నాగబాబు

ఎండాడ, మే 15 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని ఎండాడ దసపల్లా లేఅవుట్ ప్రాంతంలో ఉన్న భీమిలి నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ నాయకుడు, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖకు వ్యక్తిగత పనుల మీద వచ్చానని, పార్టీ వ్యవహారాలకు సంబంధించి వచ్చినప్పుడు రాజకీయాలు మాట్లాడతానని తెలిపారు. తొలుత ఆయనకు భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త పంచకర్ల సందీప్, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, 8వ వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్ స్వాగతం పలికారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన



మైదానం అభివృద్ధి విషయమై స్థానికులతో మాట్లాడుతున్న రవితేజ

భీమునిపట్నం/ఆనందపురం మే 15 (ఆంధ్రజ్యోతి) : భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు, టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ అన్నారు. గురువారం ఆయన రెండు ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆనందపురం హైస్కూల్ ప్రహరీ గోడ పునర్నిర్మాణానికి, జూనియరు కళాశాలలో ఫర్నిచర్ సమకూర్చడం, వసతుల కల్పనకు ప్రతిపాదనలు తయారు చేస్తామన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

సింహాచలం, మే 15 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎల్‌జీ పాలిమర్స్ రిటైర్డ్ అధికారి పి. త్రినాధరావు అన్నారు. అడివివరం శాఖా గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహం సారధ్యంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆయన విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలను వివరించారు.

ఘనంగా ముత్యాలమ్మ పండగ

పద్మనాభం, మే 15 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో ముత్యాలమ్మ అమ్మవారి వారాల పండగను గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో ప్రధాన దేవత అయిన బంగారమ్మ తల్లి పండగ చాటింపునకు ముందు ఈ వారాల పండగ చేయడం ఆనవాయితీ. ముందుగా అమ్మవారి చదురు గుడిలో పూజారి బుగత గురునాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్దకు భక్తులు ఊరేగింపుగా బయలుదేరారు. ముందు సతకం పట్టు వద్దకు అక్కడి నుంచి ఆలయానికి చేరుకున్నారు. మార్గం మధ్యలో యువకులు చేసిన సాము గరిడీ విశేషంగా అలరించింది. అనంతరం అమ్మవారికి జలాభిషేకం చేసి, పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు టి. పద్దు, కె. ఎర్నాయుడు, టి. గురునాయుడు, బి.రాము, ఏ. రమణ, ఎస్. రాము, వై. నరసింగరావు, పైడినాయుడు పాల్గొన్నారు.

గొల్లల తిమ్మాపురంలో పోలమాంబ ఉత్సవాలు

భీమునిపట్నం : పట్టణంలోని నాలుగో వార్డు గొల్లల తిమ్మాపురంలో పోలమాంబ అమ్మవారి ఉత్సవాలు గురు వారం నుంచి ప్రారంభమయ్యాయి. వార్డు టీడీపీ అధ్యక్షుడు పాసి నరసింగరావు, నాయకుడు గరికిన యల్లయ్య (కింగ్) తదితరులు, అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. గ్రామ ఆచారం ప్రకారం, ఉత్సవ కమిటీ, గ్రామ నాయకుడు బుద్దల పోలయ్య అతిథులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పాసి త్రినాథ్ కుమార్, కారి అప్పారావు, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు సూరాడ రవికుమార్, ఐటీడీపీ అధ్యక్షుడు మరుపిళ్ళ రాజేంద్రప్రసాద్, బుద్దల పోలయ్య తదతరులు పాల్గొన్నారు.



చిన్నాపురం రోడ్డులో జంగిల్ క్లియరెన్సు

పద్మనాభం, మే 15 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభం - చిన్నాపురం జంక్షన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలు, డొంకలను ఆర్అండ్‌బీ అధికారులు తొలగిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా చాలాకాలంగా తుప్పలు పేరుకుపోయాయి. దీంతో వాహనాల రాకపోకల సమయంలో ఇబ్బందులు కలిగేవి. ఎదురెదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించేవి కావు.దీంతో మలుపుల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో వార్షిక నిర్వహణ పనుల్లో భాగంగా ఆ శాఖాధికారులు జంగిల్ క్లియరెన్సు చేపట్టారు.

అగనంపూడి హౌసింగ్ కాలనీపై విచారణ

విశాఖపట్నం/గాజువాక, మే 15 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి శివారు ప్రాంతం కొండకు ఆనుకుని పుష్కరకాలం క్రితం నిర్మించిన ఇళ్లను అనధికార వ్యక్తులు ఆక్రమించుకున్న వ్యవహారంపై సమగ్ర విచారణకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. మొత్తం 113 బ్లాకుల్లో ఉన్న 3,616 ఇళ్లలో చాలావరకు అనధికార వ్యక్తులు ఆధీనంలో ఉన్నాయని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఇటీవల కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో అన్ని బ్లాకుల్లోని ప్రతి ఇంటిని తనిఖీ చేసి అసలైన లబ్ధిదారులే ఉన్నారా? లేదా అనధికార వ్యక్తులు ఉంటున్నా రా? అనే అంశంపై విచారణ జరపాలని కలెక్టర్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ నిమిత్తం మొత్తం 11 బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి బృందంలో రెవెన్యూ, జీవీఎంసీ యూసీడీ, గృహనిర్మాణ సంస్థ నుంచి ఒక్కొక్కరు ఉంటారు. రాష్ట్ర విభజనకు ముందు నిర్మాణాలు ప్రారంభించిన ఈ కాలనీ పనులను పూర్తి చేయడంలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. ఇళ్లు నిర్మించిన తరువాత మౌలిక వసతులు లేకపోవడం, హైవే నుంచి సరైన రహదారి లేకపోవడంతో అప్పట్లో లబ్ధిదారులు చాలామంది అక్కడకు వెళ్లలేదు. దీంతో ఇళ్లలో లేని లబ్ధిదారులకు హౌసింగ్ అధికారులు నోటీసులు కూడా ఇచ్చారు. చాలామంది నగరంలో అంతకుముందు ఉండే అద్దె ఇళ్ల నుంచి మరోచోటకు వెళ్లిపోవడంతో వారికి ఆ నోటీసుల సంగతే తెలియదు. గడువు ముగిశాక లబ్ధిదారుల నుంచి స్పందన లేకపోవడంతో కొన్ని ఇళ్లను అధికారులు రద్దు చేసి కొత్తగా లబ్ధిదారులకు కేటాయించారు. అదే సమయంలో ముఠా ఒకటి.. కాలనీలో ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి వాటిని ఆక్రమించుకుని తరువాత విక్రయించారు. ఆ తరువాత ఒరిజినల్ లబ్ధిదారులు తమ ఇళ్ల వద్దకు వెళితే కొత్త వ్యక్తులు ఉండడంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తూ తొలుత హౌసింగ్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. ఈ దందా వెనక హౌసింగ్ అధికారులు, సిబ్బంది పాత్ర ఉందనే ఆరోపణలున్నాయి. కొందరు జిల్లా హౌసింగ్ కార్యాలయానికి వచ్చి సిబ్బందితో గొడవ పడిన సందర్భాలున్నాయి. అయినా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఈలోగా గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి ఈ సమస్యను పలువురు తీసుకువచ్చారు. ఆయన స్పందించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడంతో తాజాగా విచారణకు ఆదేశించారు. విచారణ తరువాత వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పలువురు ఒరిజినల్ లబ్ధిదారులు అభిప్రాయ పడుతున్నారు.

2.5 లక్షల మందితో అంతర్జాతీయ యోగా దినోత్సవం

... 5వ పేజీ తరువాయి

ఏర్పాట్లు పక్కాగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఒకవేళ వర్షం కురిస్తే ఆర్కే బీచ్ నుంచి తీరంలోని ఏయూ కన్వెన్షన్ హాల్, ఏయూ ఇంజనీరింగ్ మైదానం నుంచి మద్దిలపాలెంలో కాకతీయ కన్వెన్షన్ హాల్ లేదా స్వర్ణభారతి స్టేడియంను ప్రత్యామ్నాయ వేదికగా గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అంతేకాక వేడుకలకు గుర్తించిన ప్రాంతాల్లో పార్కింగ్, తాగునీటి వసతి, విద్యుత్ సదుపాయం ఉండేలా చూసుకోవాలని, అందరూ వీక్షించేందుకు అనుగుణంగా స్క్రీన్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి వేదిక వద్ద శిక్షకుడు అందరికీ కనిపించేలా చిన్నపాటి స్టేజీలు, మైకులను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు సమన్వయంతో వ్యవహరించి కార్యక్రమానికి సంబంధించి విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. సమావేశంలో జేసీ కె.మయూర్ అశోక్, డీసీపీ మేరి ప్రశాంతి, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, ఏడీసీపీ రాజ్‌కమల్, ప్రత్యేకాధికారులు దయానిధి, శేష శైలజ, మాధవి, సత్తిబాబు, సుధాసాగర్, మధుసూదనరావు, డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, ఇంటర్ ఆర్ఐవో మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ రహదారులు పరిశీలన



రహదారి పనులపై చర్చిస్తున్న అధికారులు

కొమ్మాది, మే 15 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ జాతీయ రహదారి నుంచి బక్కన్నపాలెం నవోదయ విద్యాలయం వరకు జరుగుతున్న మాస్టర్ ప్లాన్ రహదారి పనులను అధికారులు గురువారం పరిశీలించారు.మధురవాడ బ్రిడ్జి వద్ద వైసీపీ మాజీ కార్పొరేటర్ భవన సముదాయం ఉండడంతో అక్కడ పనులు నిలిచిపోయాయి. భవన సముదాయంలో కొంతభాగం రహదారి విస్తరణలో కోల్పోవడంతో గతంలో వారికి టీడీఆర్ మంజూరు చేశారు. దీంతో భవన సముదాయంలో రహదారికి అవసరమైన స్థలాన్ని స్వాధీనం చేసుకుని కాలువలు నిర్మించాలని వీఎంఆర్‌డీఏ అధికారులకు జీవీఎంసీ అధికారులు సూచించారు. రహదారి విస్తరణకు అవసరమైన మార్కింగ్‌ను జీవీఎంసీ డీసీపీ హరిదాసు, ఏసీపీ తిరుమలరావు, టీపీఓ బాలరాజు, సర్వేయర్ ప్రభాకర్ వేశారు. శుక్రవారం నుంచి రహదారి విస్తరణ పనులు పునఃప్రారంభించనున్నట్టు వారు తెలిపారు.

ఏఐ ట్రాఫిక్ సిగ్నల్స్ ఏవీ?

... 5వ పేజీ తరువాయి

ఉంటుందని, తద్వారా వాహనచోదకులు సిగ్నల్స్ వద్ద ఆగాల్సిన పని ఉండదని తెలియజేశారు. దీనివల్ల రోడ్లపై ట్రాఫిక్ సమస్య తగ్గడంతో పాటు సిగ్నల్స్ జంపింగ్ చేయాల్సిన అవసరం వాహనచోదకులకు ఉండదు. అలాగే ఎవరైనా వాహనం నడుపుతున్నప్పుడు సెల్ ఫోన్ మాట్లాడుతున్నా, హెల్మెట్ ధరించకపోయినా, ట్రిపుల్ రైడింగ్ చేసినా, ప్రమాదకరంగా వాహనాన్ని నడిపినా సరే సీసీ కెమెరాలు ఆటోమెటిక్‌గా ఉల్లంఘనను గుర్తించి సదరు వాహనం నంబర్ ప్లేట్ ఆధారంగా దాని యజమానికి ఈ-చలానా జారీ అయిపోతోంది. ఎక్కడైనా ట్రాఫిక్ జామ్ అయినట్టయితే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు లేదా సిబ్బందికి సమాచారం వెంటనే చేరిపోతుంది. దీనివల్ల వారు అక్కడకు చేరుకుని సమస్యను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుంది. ఎక్కువ పెండింగ్ చలానాలు ఉన్న వాహనం రోడ్డుపై వెళుతున్నా సరే.. ఆ వివరాలను ఆ కూడలిలోని సిబ్బందికి తెలిసిపోతుంది. ఏఐ టెక్నాలజీ కలిగిన సీసీ కెమెరాలు అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ పోలీసులకు పెద్దగా పని ఉండదు. ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి ఉల్లంఘనలను ఏఐ టెక్నాలజీ కలిగిన సీసీ కెమెరాలే పసిగట్టి ఆటోమెటిక్‌గా చలానాలను జారీ చేస్తుంది. పోలీసులు కేవలం డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు చేయడం, పెండింగ్ చలానాలను వసూలు చేయడం వంటి పనులు చేయాల్సి ఉంటుంది. అలాంటప్పుడు ట్రాఫిక్‌లో పనిచేసే సిబ్బందిని తగ్గించి ఇతర విధులకు కేటాయించేందుకు అవకాశం ఉంటుంది.

మరోవైపు ఏఐ టెక్నాలజీ కలిగిన సీసీ కెమెరాలు పాత నేరస్థులు, రౌడీషీటర్లు, ఎక్కడైనా నేరం చేసి పరారైపోయేవారిని గుర్తించడం పోలీసులకు సులభతరమవుతుంది. పాత నేరస్థులు, రౌడీషీటర్ల వివరాలు, చిరునామా, ఫొటోలను ఆన్‌లైన్ చేసి ఏఐ టెక్నాలజీ కలిగిన సీసీ కెమెరాలకు అనుసంధానం చేసినట్టయితే అలాంటివారు ఎక్కడైనా సీసీ కెమెరాకు చిక్కితే వారి వివరాలను తక్షణమే సమీపంలోని పోలీసులకు తెలియజేస్తుంది. అప్పుడు పోలీసులు అప్రమత్తమై అలాంటివారిని అదుపులోకి తీసుకోవడం ద్వారా నేరం జరగకుండా చూసేందుకు అవకాశం ఉంటుంది.

ఈ నేపథ్యంలో నగరంలో 110 కూడళ్లలో ఏఐతో కూడిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సీపీ శంఖబ్రత బాగ్చి ప్రతిపాదనలు తయారుచేశారు. ఒక్కో జంక్షన్‌లో ఎన్ని కెమెరాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది, ఇందుకోసం ఎంత ఖర్చు అవుతుందనే దానిపై అంచనాలను తయారుచేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు పలు ప్రైవేటు సంస్థలు ఆసక్తి చూపడంతో వారిలో మెరుగైన ప్రతిపాదనతో వచ్చే వారిని ఎంపిక చేసి వారితో పనులు చేయించేలా జీవీఎంసీని సిఫారసు చేస్తామని గత ఏడాది నవంబరులో సీపీ తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా పదిచోట్ల వీటిని ఏర్పాటు చేయాలని జీవీఎంసీని కోరగా, సంబంధిత అధికారులు కౌన్సిల్‌లో ఈ అంశాన్ని చర్చించి ఆమోదించారు. అయితే ఆ తరువాత దీనిపై అతీగతీ లేకపోవడంతో ఆ ప్రతిపాదనలు అక్కడితోనే నిలిచిపోయాయి. దీంతో సీపీ ప్రతిపాదనలు ఆగిపోయినట్టేనా? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ప్రాజెక్టుల పరుగు..

... 5వ పేజీ తరువాయి

పూర్తి చేస్తాం. చీకటి పడ్డాక వెలుగులు విరజిమ్మడం దీని ప్రత్యేకత.

- మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం (ది డెక్)లో 4, 5 అంతస్థులు ఐటీ కార్యాలయాలకు ఇచ్చేశాం. మూడో అంతస్థులో రెస్టారెంట్, ఫైన్ డైనింగ్ పెడుతున్నాం. అలాగే టెర్రస్‌పై కెఫే ఏర్పాటు చేస్తున్నాం. ఈ భవనంలో స్పేస్ కోసం చాలా సంస్థలు పోటీ పడుతున్నాయి.
- కొత్తగా చేపట్టబోయే ఐదు మాస్టర్ ప్లాన్ రహదారులకు టెండర్లు పిలుస్తున్నాం. వీటిని వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నాం. ఈ రహదారులకు భూములు ఇచ్చే రైతులు, గృహస్థులకు వీఎంఆర్డీఏ పరిధి అయితే మేము టీడీఆర్‌లు ఇస్తాం. జీవీఎంసీ పరిధి అయితే వారు ఇస్తారు. ముందు టీడీఆర్‌లు ఇచ్చాకే పనులను ప్రారంభించాలనుకుంటున్నాం.
- విశాఖపట్నం విమానాశ్రయం సమీపాన కాకాని నగర్ వద్ద రూ.12 కోట్ల వ్యయంతో సబ్‌వే నిర్మాణం చేపడుతున్నాం.
- ఎన్ఏడీ వద్ద రైలు ఓవర్ బ్రిడ్జి పనులను మరో రెండు నెలల్లో పూర్తి చేస్తాం.
- అనకాపల్లిలో కొత్తగా వీఎంఆర్డీఏ జోనల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నాం. విజయనగరంలోని జోనల్ కార్యాలయాన్ని ఆధునీకరిస్తున్నాం.
- మధ్యతరగతి ప్రజల కోసం అపార్ట్‌మెంట్లు నిర్మించాలని చేసిన ప్రతిపాదనకు మంచి స్పందన వస్తోంది. మిథిలాపురి వుడా కాలనీ, మధురవాడ, వేపగుంట ప్రాంతాల్లో అనువైన భూములు ఉన్నాయి. అన్ని రకాల సదుపాయాలతో వీటిని నిర్మించి, మార్కెట్ రేటు కంటే తక్కువకు ఇవ్వాలని యోచిస్తున్నాం.
- వీఎంఆర్డీఏ సిటీ సెంట్రల్ పార్కులో గ్లో గార్డెన్‌కు కొన్ని మార్పులు చేసి పనులు చేపట్టాలని అనుకుంటున్నాం. అదేవిధంగా చైర్మన్ ప్రణవ్‌గోపాల్ సూచన మేరకు మాదక ద్రవ్యాలకు బానిసలైన వారికి కోసం ఓ కేంద్రాన్ని నిర్మించి కౌన్సెలింగ్ నిర్వహించే ఏర్పాటు కూడా చేస్తాం.
- కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జి పనులు కొంచెం నెమ్మదిగా జరుగుతున్నాయి. దానిని వేగవంతం చేస్తాం.


సీఎం చంద్రబాబుతో రతన్‌కాంత్

చంద్రబాబును కలిసిన టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు

గాజువాక, మే 15 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్. రతన్ కాంత్ గురువారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పలు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వడం ఆనందంగా ఉందని తెలిపారు. నామినేటెడ్ పోస్టుల్లో యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎంను కోరారు.

గెడ్డలో పూడికలు తీయించాలని వినతి

పెదగంట్యాడ, మే 15 (ఆంధ్రజ్యోతి) : గంగవరం పోర్టు రోడ్డును ఆనుకుని ఉన్న ప్రధాన గెడ్డలో పూడిక తీయించాలని జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను కోరారు. గురువారం ఆయన కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గెడ్డ పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయిందని, ఏమాత్రం వర్షం పడినా.. ఇరువైపులా ఉన్న కాలనీలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని చెప్పారు.అలాగే రామచంద్రానగర్ పక్కనున్న డంపింగ్ యార్డు నుంచి విపరీతమైన దుర్వాసన వస్తుండడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. డంపింగ్ యార్డును ఆధునికీకరించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

డీపీఎస్‌లో శత శాతం ఉత్తీర్ణత

ఉక్కుటౌన్‌షిప్, మే 15 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో పదో తరగతి సీబీఎస్ఈ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించామని ప్రిన్సిపాల్ సమీర్‌కుమార్ పాండే తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్షలకు 167 మంది విద్యార్థులు హాజరుకాగా అందరూ పాసయ్యారని, 12వ తరగతిలో కూడా నూరు శాతం ఉత్తీర్ణత సాధించామని చెప్పారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



ద్వారకాబస్‌స్టేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ద్వారకాబస్‌స్టేషన్‌లో భారత్ వికాస్ పరిషత్ ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి. అప్పలనాయుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)

● **శుభం**: శారద, శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

● **హిట్** : జగదాంబ, సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 14, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 18, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 42, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 38 దొండకాయలు 22, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)50, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 44, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 94, కీరదోస 34, కాప్సికమ్ 44, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 34, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45 ,నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర 3, పాలకూర 3, తోటకూర (3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

తుప్పలతో నిండిన ఖాళీ ప్రదేశాలు

పాముల సంచారంతో నివాసితుల్లో భయం

కూర్మన్నపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న స్థలాలు ప్రజలకు తీవ్ర అసౌకర్యానికి, ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఖాళీ స్థలాల్లో తుప్పలు, చెత్త, వ్యర్థాలు గుట్ట గుట్టలుగా పేరుకుపోతున్నాయి. ఏపుగా బలిసిన తుప్పల్లో పాములు, క్రిమి కీటకాలు కాలనీల్లోని ఇళ్లల్లోకి వస్తుండడంతో ప్రజలు భయపడుతున్నారు. 86వ వార్డులో పలుచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఉడా కాలనీలోని పలు ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి మురుగు నీరు ఏరులై పారుతోంది. పందులకు ఇవి ఆవాసాలుగా మారుతుండడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వ్యాప్తి చెందుతోంది. అలాగే ఖాళీ స్థలాల్లో వర్షం నీరు, మురుగు చేరి దోమలు, దుర్గంధం వ్యాప్తి చెందుతుండడంతో దీర్ఘకాల వ్యాధులు ప్రబలుతున్నాయని ఆయా కాలనీల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై జీవీఎంసీ పారిశుధ్యం సిబ్బందికి స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా... ఎవరూ పట్టించుకోవడం లేదు.


ఉడా నగర్ కాలనీలో ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోయిన తుప్పలు

పాతకర్నవానిపాలెంలో దుర్గమ్మ పండగ


పుష్పాలంకరణలో అమ్మవారు

గాజువాక, మే 15 (ఆంధ్రజ్యోతి) : పాతకర్నవానిపాలెం గ్రామ దేవత దుర్గమాంబ పండుగ గురువారం వైభవంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. మధ్యాహ్నం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు అప్పారావు, కనకారావు, మణి, వరహాలరావు పాల్గొన్నారు.

అగనంపూడి : జీవీఎంసీ 85వ వార్డు ఏడుమెట్ల మర్రిపాలెం, పరిసర గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ జాతర వైభవంగా జరిగింది. తెల్లవారుజామున 5 గంటల నుంచి భక్తులకు దర్శనాలు ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిక్కిరిసింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపు, కుంకుమ, పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను గ్రామంలో ఊరేగించి, అనంతరం ఆలయం వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

'బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి'

పెదగంట్యాడ, మే 15 (ఆంధ్రజ్యోతి) : బడిఈడు పిల్లలను విధిగా పాఠశాలల్లో చేర్పించాలని సమగ్ర శిక్ష అభి యాన్ అధికారి జి. శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన పెదగంట్యాడ, నెల్లిముక్కు, గొడ్డువానిపాలెంలోని అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నెల్లిముక్కు కేంద్రంలో మాట్లాడుతూ 3 నుంచి 5 ఏళ్లలోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లోను, 6 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోను చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూ, బెల్ట్, బ్యాగ్ తదితర సామగ్రి అందజేయడంతో పాటు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఈ. శ్రీనివాసరావు, కె. రమణాజీ, అంగన్వాడీ కార్యకర్త వేణుశ్రీ, సీఆర్‌పీలు రామలక్ష్మి, ఝాన్సీరాణి, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


మ్యాప్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ విశ్వనాథన్

పెదగంట్యాడ, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు ప్రాంతాల్లో వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అభివృద్ధి పనులను పరిశీలించారు. తొలుత పెదగంట్యాడ రహదారి పరిధిలో చేపడుతున్న క్రీడా సంబంధిత పనులను జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీతో కలిసి పరిశీలించారు. ఏయే స్పోర్ట్స్‌కు సంబంధించిన కోర్టులు ఏర్పాటు చేయాలో చర్చించారు. అనంతరం ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో జరుగుతున్న పనులను సాంకేతిక విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు.నెల రోజుల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అనకాపల్లి జిల్లా కోడూరు -2, నంగినారపాడు, కుంచంగి 1,1ఎలో జరుగుతున్న బీటీ రహదారులు, సీసీ కాలువల నిర్మాణాలను చూశారు. తుమ్మపాల కన్వెన్షన్ సెంటర్, రావు గోపాలరావు ఆడిటోరియంలో చేపట్టిన జోనల్ కార్యాలయం నిర్మాణాలు కూడా పరిశీలించారు.

లైమ్‌స్టోన్ దిగుమతిలో కొత్త రికార్డు

విశాఖపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టుకు నౌకలో వచ్చిన లైమ్‌స్టోన్‌ను రికార్డు సమయంలో దిగుమతి చేసి ఇంటిగ్రల్ ట్రేడింగ్ అండ్ లాజిస్టిక్స్ సంస్థ కొత్త రికార్డును నెలకొల్పింది. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్)కు చెందిన 28,353 టన్నుల లైమ్‌స్టోన్‌ను ఈ నెల 14న మధ్యాహ్నం 3.30 గంటలకు దిగుమతి ప్రారంభించి 15వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు పూర్తి చేసింది. డబ్ల్యూక్యూ-3 బెర్త్‌పై ఎంవీ విశ్వదక్ష నౌక ద్వారా వచ్చిన ఈ లైమ్‌స్టోన్‌ను అతి తక్కువ సమయంలో దిగుమతి చేశామని సంస్థ ఎండీ గ్రంధి రాజేశ్ పేర్కొన్నారు. ఈ రికార్డుకు సహకరించిన సెయిల్, పోర్టు ట్రాఫిక్ విభాగానికి కృతజ్ఞతలు తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా ఈ రంగంలో ఉన్న తమ సంస్థ ఏడాదికి రెండు మిలియన్ టన్నుల కార్గోను హ్యాండ్లింగ్ చేస్తుందన్నారు.

'చేనేత కార్మికులను ఆదుకోండి'

శ్రీనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత పరిశ్రమకు చేయూతనివ్వాలని 71వ వార్డు శ్రీనగర్‌కు చెందిన రాష్ట్ర చేనేత కులాల ప్రధాన కార్యదర్శి, టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు పప్పు రాజారావు అన్నారు. బుధవారం రాత్రి విజయవాడలో జరిగిన ఏపీ చేనేత ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో కేటాయించిన రూ.200 కోట్లు చాలవని, బడుగు, బలహీన వర్గాలను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్ పెంచాలని కోరారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పార్క్‌లో స్థానిక చేనేత కార్మికులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.జిల్లా పారిశ్రామిక ప్రాంతంలో చేనేత యువతకు కుల వృత్తిలో నూతన టెక్నాలజీతో శిక్షణ, ఉపాధి కల్పించేలా క్లస్టర్లు ఏర్పాటు చేయాలని, వృద్ధాశ్రమం, కల్యాణ మండపాలు, సామాజిక భవనాలు ఏర్పాటుకు సహాయ సహకారాలు అందించాలన్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలో 2,50,000 మంది చేనేత కార్మికులు ఉన్నారని, కులవృత్తి గిట్టుబాటు కాక అంతరించిపోతుందని, ఈ క్రమంలో చేనేత యువతకు వృత్తిలో నూతన టెక్నాలజీతో శిక్షణ ఇప్పించి, ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మంత్రి సవితకు ఆయన వినతిపత్రం ఇచ్చారు.

'పుస్తకాలపై దృష్టిపెట్టండి'

మల్కాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): పిల్లలు సెల్‌ఫోన్లపై కాకుండా పుస్తకాలపై దృష్టి పెట్టాలని 61వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి సోమేశ్ అన్నారు. మల్కాపురం శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో గురువారం ఆయన మాట్లాడుతూ చిన్న వయసు నుంచే పుస్తకాలను చదవడం ద్వారా భవిష్యత్‌లో మేధావులుగా ఎదుగుతారని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయ్ కుమార్ , స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ పండుగ

పెందుర్తి రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 95వ వార్డులో గొల్లవిల్లిపాలెం ప్రజల ఆరాధ్య దేవత బంగారమ్మ అమ్మవారి పండుగ గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే మహిళలు ఆలయానికి చేరుకుని అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్పొరేటర్ ముమ్మన దేవుడు, తదితరులు అమ్మవారికి పూజలు చేశారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి.

సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలు అందజేత

గోపాలపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనగర్‌కు చెందిన ఎన్. సింహాచలంకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1.44 లక్షల చెక్‌ను పశ్చిమ ఎమ్మెల్యే పి. గణబాబు గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పెంటమాంబ అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం

మల్కాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): హిమాచల్‌నగర్‌లో పెంటమాంబ అమ్మవారి ఉత్సవాలు గురువారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు అమ్మవారి పండగను ఆలయ నిర్వహకులు భక్తి శ్రద్ధలతో నిర్వహిచబోతున్నారు. గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ తగిన ఏర్పాట్లు చేసింది.

మహిళలకు కుట్టు శిక్షణ

పెందుర్తి, మే 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్ద పీట వేస్తోంది. 'సెంటర్ ఫర్ రూరల్, అర్బన్ డెవలప్‌మెంట్ సంస్థ' ద్వారా కుట్టు శిక్షణ ఇప్పించి వారి కాళ్లమీద వారే నిలబడేలా ప్రోత్సహిస్తోంది. సరిపల్లి, గుర్రమ్మపాలెం, వేపగుంట ప్రాంతాల్లో సుమారు 150 మంది మహిళలు శిక్షణ తీసుకుంటున్నారు. శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టు మిషన్ అందిస్తామని నిర్వాహకులు చెప్పారు.

చిత్రలేఖన పోటీల్లో మెరిసిన విద్యార్థులు



జీవ వైవిధ్య సంరక్షణ చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గోపాలపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): జీవన వైవిధ్యాన్ని కాపాడటానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ అన్నారు. గురువారం అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం పురస్కరించుకుని ఉత్తరాంధ్ర జిల్లాల విద్యార్థులకు స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన జోనల్ స్థాయి చిత్రలేఖన పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడంతో పాటు జీవవైవిధ్యంపై వారికి అవగాహన కల్పించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఎన్జీసీ జిల్లా కో-ఆర్డినేటర్ బాబూరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్యం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ పోటీల్లో విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఈ నెల 22న అమరావతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలకు బహుమతులు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్జీసి విజయనగరం జిల్లా కో ఆర్డినేటర్ వేణుగోపాల్, అనకాపల్లి జిల్లా కో-ఆర్డినేటర్ ఖగేశ్,ప్రాంతీయ కో-ఆర్డినేటర్ జానకిరావు, జెడ్పీ హెచ్ఎం వైవీఎస్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో తనిఖీలు


క్యాంటీన్‌కు వచ్చినవారితో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ రాము

మల్కాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్ 5 కమిషనర్ రాము శ్రీహరిపురం అన్న క్యాంటీన్‌లో గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఉదయం ఏడుగంటలకే ఆయన క్యాంటీన్‌కు చేరుకుని, క్యాంటీన్ మొత్తాన్ని పరిశీలించారు. 'టిఫిన్, భోజనం రుచిగా ఉన్నాయా? లేదా?' అని క్యాంటీన్‌కు వచ్చినవారిని అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి సంతృప్తికరమైన జవాబు రావడంతో ఆయన సరే అన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఏమన్నా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ తనిఖీలో జీవీఎంసీ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

హెచ్‌పీసీఎల్‌లో మాక్‌డ్రిల్


మాక్‌డ్రిల్‌లో భాగంగా తీవ్రవాదులను అడ్డుకుంటున్న సైనికులు

మల్కాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) విశాఖ రిఫైనరీలో గురువారం సాయంత్రం ఒక్కసారిగా తీవ్రమైన హడావిడి. ఫైర్ అండ్ సేఫ్టీ, సెక్యూరిటీగార్డులు, రక్షణకు సంబంధించిన సూచనలు చేస్తు అటు ఇటు పరుగులు. ఈదృశ్యాలు పలువురు ఏమైందని ఆందోళ చెందారు. ఆ తరువాత సిందూర్ యుద్ధం కారణంగా తీవ్రవాదులు హెచ్‌పీసీఎల్‌లోకి ప్రవేశిస్తే ఎలా ఎదుర్కోవాలో, మనల్ని మనం ఎలా కాపాడుకోవాలనే అంశాలపై ఆక్టోపస్ బృందం మాక్‌డ్రిల్ నిర్వహించిందని హెచ్‌పీసీఎల్ యాజమాన్యం చెప్పింది. ఈ కార్యక్రమంలో హార్బర్ సర్కిల్ ఏసీపీ కాళీదాస్, మల్కాపురం పోలీసులు, రెవెన్యూ అధికారులు, ఫైర్ అండ్ సేఫ్టీ, నేవీ, ఆర్మీ, కోస్టుగార్డులు, బీడీ టీమ్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవన నిర్మాణ పనులు పరిశీలన

ఎన్.ఎ.డి. జంక్షన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్‌లో విమాన్‌నగర్ అసోసియేషన్ సామాజిక భవనం అదనపు అంతస్తు స్లాబ్ నిర్మాణాన్ని వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ గురువారం పరిశరీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో మౌలిక వసతులు కల్పనకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ప్రతఇ కాలనీలో అసోసియేషన్ భవన నిర్మాణానికి జీవీఎంసీ నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ అదనపు అంతస్తు నిర్మాణాన్ని రూ.41.50లక్షతో చేపడతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈ వెంకటలక్ష్మి వర్క్ సూపర్‌వైజర్ రామకృష్ణ, సోమేశ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన

వేపగుంట, మే 15 (ఆంధ్రజ్యోతి) : వేపగుంట జోనల్ కార్యలయంలోని ఏఎమ్‌హెచ్ఓ కార్యాలయంలో గురువారం మలెరియా సిబ్బంది, సూపర్ వైజర్‌కు సీజనల్ వ్యాధులు,పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఏఎమ్‌హెచ్ఓ బండారు అప్పలనాయుడు మాట్లాడుతూ వచ్చేది వర్షాకాలమని, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, దీనిపై సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా విభాగ సిబ్బంది పాల్గొన్నాది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వేపగుంట, మే 15(ఆంధ్రజ్యోతి): అప్పన్నపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో విద్యుత్ ఫీడర్‌పై నిర్వాహణ, చెట్లకొమ్మలు తొలగింపు పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామని జోన్ 3 ఈఈ, పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ పనులు కారణంగా పద్మావతినగర్, షిప్‌యార్డ్ లేఅవుట్, మైత్రినగర్, జంగాలకాలనీ, అప్పన్నపాలెం, శ్రీనివాసనగర్, సింహపురికాలనీ, గొల్లనారాయణపురం ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు.


సీఐ పార్థసారథికి వినతిపత్రం ఇస్తున్న హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు

డీడీ నెక్స్ట్ లెవెల్ సినిమా ప్రదర్శన ఆపాలని వినతి

గాజువాక, మే 15 (ఆంధ్రజ్యోతి) : తమిళ డబ్బింగ్ సినిమా డీడీ నెక్స్ట్ లెవెల్ సినిమాలో కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి గోవింద నామాల పాటను వక్రీకరించి చూపించారని, తక్షణమే ఆ సినిమా ప్రదర్శనలను ఆపాలని హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం వారు గాజువాక సీఐ పార్థసారధికి వినతిపత్రం ఇచ్చారు. అంతకముందు గాజువాకలో ఓ మల్టీప్లెక్స్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఒక పాటను అర్థం మార్చి హేళన చేశారన్నారు. సినిమా ప్రదర్శన తక్షణమే ఆపకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ధార్మిక సెల్ అధ్యక్షుడు విజయశంకర్, ప్రతినిధులు పొలిమేర శ్రీనివాసరావు, నరసింగరావు, అభిరామ్, శేషులత పాల్గొన్నారు.

కళాకారులకు సత్కారం

అగనంపూడి, మే 15 (ఆంధ్రజ్యోతి) : అగనంపూడి కళారంగ సమైక్య ఆధ్వర్యంలో పౌరాణిక కళాకారులను గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం పౌరాణిక నాటకాలు కనుమరుగుతున్నాయన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను పౌరాణిక నాటకాల ద్వారా నేటి తరానికి తెలియజేస్తున్న కళాకారుల సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు చొప్పా నాగరాజు, విందుల వరహాలు, మొటూరి వెంకటరమణ, బి. సత్యనారాయణ, అన్నాజీరావు, పోలారావు తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులపై సస్పెన్షన్లు ఎత్తివేయాలి'

ఉక్కుటౌన్‌షిప్, మే 15 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ కార్మికులపై తప్పుడు సస్పెన్షన్‌లను యాజమాన్యం తక్షణమే ఎత్తివేయాలని, లేకపోతే ప్లాంట్‌ను స్తంభింపజేస్తామని ఉక్కు అఖిలపక్ష కార్మిక నాయకులు హెచ్చరించారు. ప్లాంట్‌లో గురువారం జరిగిన అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అనేక విధాలుగా పోరాటాలు చేస్తున్నా.. ప్లాంట్ ఉత్పత్తికి ఆటంకం లేకుండా చూశామన్నారు. కానీ యాజమాన్యం కార్మికులను భయభ్రాంతులకు గురిచేసే విధంగా ప్రవర్తిస్తుందన్నారు. కార్మిక హక్కులను హరించే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. యాజమాన్యంపై పోరాటాలు చేసే విధంగా యాజమాన్యమే సృష్టిస్తుందని ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పోరాటాలు చేయకపోతే యాజమాన్యం ఇదే అలుసుగా కార్మిక వర్గాన్ని అణిచివేస్తుందని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ వంటి భారీ ఉక్కు పరిశ్రమల్లో కార్మికులను భయపెట్టి పనిచేయించుకోవాని యాజమాన్యం చూస్తుందన్నారు. కార్మికులపై దాడి చేస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామన్నారు. 20న జరిగే సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని కోరారు.

నేటి నుంచి నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు

ఉక్కుటౌన్‌షిప్, మే 15 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్‌లో కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని, కార్మికులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని, సస్పెన్షన్‌లు ఎత్తివేయాలని, కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ఆపాలని తదితర డిమాండ్లతో ఈనెల 20న సమ్మె చేస్తున్నామని నాయకులు తెలిపారు. ఈమేరకు శుక్రవారం నుంచి 19వ తేదీ వరకు కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతారని చెప్పారు. అలాగే 16న బీసీ గేటు వద్ద నిరసన, 17న ప్లాంట్ ప్రధాన గేటు వద్ద నిరసన, 18న ఉక్కునగరం, నిర్వాసిత కాలనీల్లో ప్రచారాలు, ర్యాలీలు, 19న సాయంత్రం అఖిలపక్ష కార్మిక నాయకుల ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించనున్నామని అఖిలపక్ష కార్మిక నాయకులు తెలిపారు.

కార్మిక సమ్మెను విజయవంతం చేయండి

» జిల్లా ఇంటక్ ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం


సమావేశంలో మాట్లాడుతున్న నాగభూషణం

మల్కాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించే చట్టాలను తీసుకొస్తు అన్యాయం చేస్తోందని జిల్లా ఇంటక్ ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం అన్నారు. హెచ్‌పీసీఎల్ పాత గేటు ఎదురుగా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులతో గురువారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలన్నీ కార్పొరేట్‌కు కొమ్ముకాసే విధంగా ఉన్నాయని, కార్మిక చట్టాలను అణగదొక్కడమే ధ్యేయంగా కేంద్రం అడుగులు వేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మే 20న దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు కలిసి సమ్మె నిర్వహిస్తున్నాయని, ఈ సమ్మెలో ద్వారా కార్మికుల సత్తా ఎంటో కేంద్రానికి తెలియజేయాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైఎస్ఆర్‌టీయూసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పైడిరాజు, లక్ష్మణమూర్తి, ఏఐటీయూసీ నాయకుడు కసిరెడ్డి సత్యనారాయణ, ఇంటక్ నాయకుడు ఎస్.తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

'సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

మల్కాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల అందరు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా మలేరియా విభాగంలో పనిచేసే సిబ్బందికి ఈ వ్యాధుల పట్ల అవగాహన ఉండాలని జోన్ 5 ప్రధాన వైద్యాధికారి (ఎంహెచ్‌వో) సునీల్ అన్నారు. డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా తదితర వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై శ్రీహరిపురం జీవీఎంసీ కార్యాలయల ప్రాంగణంలో మలేరియా విభాగ కార్మికులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా విభాగ కార్మికులు విధులు నిర్వహించే సమయంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సతీశ్, పాల్గొన్నారు.

సెమ్స్‌తో గీతం ఎంఓయూ

సాగర్‌నగర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : నౌకా నిర్మాణ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనల కోసం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశాఖలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైమ్ అండ్ షిప్ బిల్డింగ్ (సెమ్స్)తో గురువారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్, సెమ్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కమాండర్ ఎస్. గోపీకృష్ణ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ మాట్లాడుతూ గీతం విద్యార్థులు సాఫ్ట్‌వేర్ రంగంలోనే కాకుండా నౌకాయాన రంగాల్లో కూడా మంచి అవ కా శాలు పొందాలని చెప్పారు. సెమ్స్ సీఈఓ గోపీ కృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నౌకా నిర్మాణ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాయన్నారు. నైపుణ్యం ఉన్న వారికి ఈ రంగంలో అవకా శాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీఆర్ శర్మ, గీతం ఈఈసీఈ విభాగం ప్రొఫెసర్ జీవీఎస్ రాజశేఖర్, బి. సూరజ్ అరవింద్, సెమ్స్ జనరల్ మేనేజర్ ఎస్. మజుందార్, సెమ్స్ మేనేజర్ లివింగ్ స్టన్ ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

ఘనంగా కాటన్ జయంతి

సాగర్‌నగర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ ఇంజినీరింగ్ నిపుణుడు సర్ ఆర్థర్ కాటన్ జయంతి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ ముకుంద్, తదితరులు కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు.

విభిన్న ప్రతిభావంతుల గుర్తింపునకు సర్వే



ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తున్న కో-ఆర్డినేటర్ గీత

అక్కయ్యపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 26వ వార్డు లలితానగర్‌లో విభిన్న ప్రతిభావంతులను గుర్తించే సర్వేను జిల్లా కో-ఆర్డినేటర్ గీత గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతమ్మధార మండలంలోని విభిన్న ప్రతిభావంతులను గుర్తించే సర్వే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గుర్తించిన విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన మౌలిక వసతులు, ఇతర సదుపాయాలు కల్పించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం లలితానగర్‌లో నివసిస్తున్న దివ్యాంగ బాలికను గుర్తించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి అప్పలనాయుడు, ఐఆర్‌టీలు జగదాంబ, శారద తదితరులు పాల్గొన్నారు

పేదలకు ఆహార ప్యాకెట్ల పంపిణీ



ఆహార ప్యాకెట్లు అందిస్తున్న శేషగిరిరావు

అక్కయ్యపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 42వ వార్డు రైల్వే ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయిధ్యాన మందిరం ఆవరణలో గురువారం పేదలకు ఆహార ప్యాకెట్లను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 ఏళ్ళుగా సాయిబాబా నిత్యాన్న ప్రసాదం వితరణ చేస్తున్నట్టు చెప్పారు.

అలాగే ఐవీఎఫ్ సహకారంతో ఇచ్చిన కమ్యూనిటీ ఫ్రిజ్‌లలో గత మూడేళ్ళ నుంచి ఆహారం 24 గంటల పాటు అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. గత నాలుగేళ్ళ నుంచి మాల ధరించిన స్వాములకు కూడా భిక్ష నిర్వహిస్తున్నామన్నారు.

నేడు జోన్-5 కార్యాలయంలో సమావేశం

» పశ్చిమ నియోజకవర్గ పునః రూపకల్పనపై సలహాల స్వీకరణ

జ్ఞానాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి) జీవీఎంసీ ఎనిమిది జోన్ల పరిధిలోని పరిపాలనా సౌలభ్యం కోసం అసెంబ్లీ నియోజకవర్గాల పునఃరూపకల్పన ప్రతిపాదనలో భాగంగా అధికారులు శుక్రవారం సమావేశా ఏర్పాటు చేశారు. ఉదయం పదకొండు గంటలకు జోన్-5 కార్యాలయంలో పశ్చిమ నియోజకవర్గం పునః రూపకల్పన విషయమై ప్రజా ప్రతినిధులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, అనుభవజ్ఞులైన పౌరుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించనున్నట్లు జోనల్ కమిషనర్ బి.రాము తెలిపారు.

తెలుగు ఉపాధ్యాయుడికి సాహితీ రత్న పురస్కారం



ధర్మారావును సత్కరిస్తున్న ప్రముఖులు

అక్కయ్యపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, కవిశ్రేష్ఠ బిరుదాంకితులు ఎంవీ ధర్మారావుకు సాహితీ రత్న జాతీయ పురస్కారం లభించింది. ఈ మేరకు కళావేదిక సాహితీ పట్టాభిషేక మహోత్సవాల్లో భాగంగా ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల పేరిట ఏలూరు పట్టణంలో మహాలక్ష్మి గోపాలస్వామి కల్యాణమండపంలో జరిగిన సాహితీ సమావేశంలో దర్మారావుకు కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు.

28న దుకాణాల బహిరంగ వేలం

మహారాణిపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ జోన్-4 పరిధిలోని పలు వాణిజ్య సముదాయాలు, దుకాణాలు, కల్యాణ మండపం, మార్కెట్‌లకు ఈ నెల 28న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం జరుగుతుందని జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు తెలిపారు. 35వ వార్డు స్ప్రింగ్ రోడ్డులో ధైస్‌ట్యాంక్ వాణిజ్య సముదాయంలో షాపులు, గదులు, జగదాంబ వాణిజ్య సముదాయంలో దుకాణాలు, గదులు, పాత బస్టాండ్, పద్మానగర్ వాణిజ్య సముదాయం, సూర్యాబాగ్ వాణిజ్య సముదాయం, రెల్లివీధి చేపల మార్కెట్, కనకల దిబ్బ వాణిజ్య సముదాయం, టీఎస్ఆర్ వాణిజ్య సముదాయం, లక్ష్మిటాకీస్ వద్ద దుకాణాలు బహిరంగ వేలం వేస్తామన్నారు. ధరావత్తు సొమ్ము చెల్లించడానికి, ఇతర వివరాల కోసం జోన్-4 కార్యా లయంలో పర్యవేక్షకుడ్ని సంప్రదించాలని జోనల్ కమిషనర్ సూచించారు.

రక్షణ గోడ నిర్మాణంతో తీరనున్న కామాక్షినగర్ వాసుల సమస్య



నివాసాలకు సమీపంలో నిర్మిస్తున్న రక్షణ గోడ

మురళీనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 49వ వార్డు రైల్వే సొసైటీ నివాసాల్ని ఆనుకొని ఉన్న కామాక్షినగర్ నివాసాల ఎదుట రోడ్డు ఎత్తుకు సమానంగా ప్రహరీ గోడ నిర్మిస్తుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బర్మా క్యాంపు వెళ్లే ప్రధాన రహదారికి దిగువగా ఉన్న ప్రాంతంలో ఇళ్లకు రక్షణగా రూ.19 లక్షల జీవీఎంసీ నిధులతో ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారు. దిగువ పైప్ లైన్స్ ఉన్న కారణంగా ఆ మేరకు స్థలం విడిచి దాదాపు 100 మీటర్ల మేర ప్రహరీ నిర్మిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా సమస్యాత్మకంగా ఉన్న ఇక్కడి నివాసితులకు ప్రహరీ నిర్మిస్తుండడంతో భరోసా చేకూరుతోంది. దీంతో ఇన్నాళ్లకు తమ సమస్య తీరుతోందని స్థానికులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రహరీ పనులు జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణలో జోరుగా సాగుతున్నాయి. పొడవైన ప్రహరీ మధ్య కాంక్రీట్ పిల్లర్స్ వేసి, వాటి మధ్యగా ఇటుకల గోడ నిర్మాణం చేస్తున్నారు.

వేసవి శిబిరాల్లో క్రీడా సామగ్రి అందజేత



క్రీడా సామగ్రిని పంపిణీ చేసిన తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి

విశాఖపట్నం, స్పోర్ట్సు, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరాల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు క్రీడా సామగ్రి పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా నగరంలోని కొన్ని కేంద్రాల్లో నిర్వహిస్తున్న క్రీడా శిబిరాల్లో పాల్గొంటున్న చిన్నారులకు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు గురువారం తన కార్యాలయం వద్ద క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, జూడో, తైక్వాండో, ఖో-ఖో వంటి పలు క్రీడాంశాలకు చెందిన క్రీడా సామగ్రిని అందజేసి క్రమశిక్షణ, చిత్తశుద్ధితో శిక్షణ పొంది ఉత్తమ క్రీడాకారులుగా రూపొందాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో జూన్ గ్యాలియట్, డీఎస్ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు ఇప్పించండి

» తాతయ్యబాబుకు సత్యాడ అప్పారావు వినతి



తాతయ్యబాబుకు అభినందనలు తెలుపుతున్న అప్పారావు

కంచరపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబును.. జీవీఎంసీ 48వ వార్డు టీడీపీ సీనియర్ నాయకుడు సత్యాడ అప్పారావు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అర్హులైన నిరుపేదలందరికీ చంద్రబాబు హయాంలో పక్కా ఇళ్లు మంజూరుకు కృషి చేయాలని తాతయ్యబాబుకు అప్పారావు విజ్ఞప్తి చేశారు. పేదలకు పక్కా ఇళ్లు అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తాతయ్యబాబు తెలిపారు. ఛైర్మన్‌ను కలిసిన వారిలో టీడీపీ 48 వార్డు కార్యకర్తలు ఉన్నారు.

వరల్డ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో లింగేశ్వరరావుకు స్వర్ణం



మిక్స్‌డ్ డబుల్స్ పార్టనర్‌తో లింగేశ్వరరావు

విశాఖపట్నం, స్పోర్ట్సు, మే 15 (ఆంధ్రజ్యోతి) : వరల్డ్ ఓపెన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన లింగేశ్వరరావు పతకం సాధించారు. చైనా తైవాన్‌లో జరిగిన ఈ టోర్నీలో 55 ప్లస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రాతినిధ్యం వహించిన లింగేశ్వరరావు తన పార్టనర్‌తో అద్భుతంగా రాణించి స్వర్ణ పతకం కైవసం చేసుకున్నారు. ఇప్పటి వరకు అనేక అంతర్జాతీయ, జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీలో పతకాలు సాధించిన లింగేశ్వరరావు...ప్రతిష్టాత్మక వరల్డ్ ఓపెన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో పసిడి పతకం సాధించిన నేపథ్యంలో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఎర్నిమాంబకు వెయ్యి కలశాలతో జలాభిషేకం

» భారీగా తరలి వచ్చిన భక్తజనం » పట్టువస్త్రాలు సమర్పించిన ప్రజాప్రతినిధులు



అమ్మవారిని దర్శించుకుంటున్న సీతంరాజు సుధాకర్ తదితరులు



కలశ బిందెలతో ర్యాలీగా అమ్మవారి ఆలయానికి తరలి వస్తున్న భక్తజనం

జ్ఞానాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి) : కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా గురువారం ఉదయం అమ్మవారికి జలాభిషేకాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జ్ఞానాపురం, అచ్చియ్యమ్మపేట తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు సుమారు వెయ్యి కలశ బిందెలతో విచ్చేశారు. తొలుత అచ్చియ్యమ్మపేట ప్రజలు మనోరమ ప్రాంతం నుంచి, జ్ఞానాపురం ప్రజలు జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ నుంచి బయల్దేరారు. అమ్మవారి ఆలయం వరకు మేళతాళాల నడుమ ఊరేగింపుగా విచ్చేసి ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి అభిషేకం చేశారు. సౌత్ టీడీపీ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.

అనంత రం వారు స్వయంగా పుసుపు నీళ్లతో అభి షేకిం చారు. అలాగే 41వ వార్డు, 34వార్డు టీడీపీ అధ్య క్షులు ఐతి మధుబాబు, వాసుపల్లి రామ్ కుమార్, కార్పొరేటర్లు తోట పద్మావతి, వెంకట స్వాతిదాస్, రెయ్యి వెంకటరమణ ప్రత్యేక పూజలు జరిపారు. వీరందరికీ ఆలయ ఈవో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీతంరాజు సుధాకర్ మట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ ఆలయానికి అవసరమైన ఎకరం రైల్వే భూమి కేటాయింపు జరిగేలా కూటమి ప్రభుత్వం చొరవచూపాలని కోరారు.

కార్పొరేటర్ పూర్ణిమా మాట్లాడుతూ ఆలయం ముందు భక్తుల సౌకర్యార్థం షెడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కోడిగుడ్ల శ్రీధర్, ఆంథోని శేఖర్, ఐతి రవిబాబు, ఆలయ ధర్మకర్తల కమిటీ సభ్యులు లండా రమణ, చుక్కా శ్యామ్,నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పిస్టల్, ఎయిర్ రైఫిల్ పోటీల్లో విజేతలకు సత్కారం



విజేతలను అభినందిస్తున్న మాజీ అధ్యక్షుడు రోలాండ్ విలియమ్స్

డాబాగార్డెన్స్, మే 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించాలని వైఎంసీ జాతీయ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు రోలాండ్ విలియమ్స్ అన్నారు. ఇటీవల ట్రూ షాట్, రైఫిల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఎయిర్‌పిస్టల్, ఎయిర్ రైఫిల్ పోటీల్లో విజేతలను గురువారం సత్కరించారు. జూనియర్ మెన్ విభాగంలో బంగారు పతకం సాధించిన కోనా రోహిత్, సీనియర్ విభాగంలోని కృష్ణప్రసాద్, కె.ఎలీషా, కేవీఎస్ఎన్ మూర్తి, గోవర్ధన్, బి.లినిషాలను సత్కరించి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.కృపాదాస్‌కుమార్, స్టీవెన్, ఇజ్రాయిల్, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెల్లివీధికి చెందిన రౌడీషీటర్ అరెస్టు

» బార్‌లో మద్యం బాటిల్‌తో వ్యక్తిపై దాడి

» తీవ్ర గాయాలు కావడంతో కేజీహెచ్‌కు తరలింపు

మహారాణిపేట, మే 15 (ఆంధ్రజ్యోతి) : బార్‌లో మద్యం బాటిల్‌తో ఓ వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరచిన రౌడీషీటర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. రెల్లివీధి ప్రాంతానికి కంబాల అశోక్‌కుమార్ రౌడీషీటర్ . ఇతడిపై నాలుగు హత్యాయత్నం కేసులు ఉన్నాయి వన్‌టౌన్ ఘోషా ఆసుపత్రి సమీపంలో నివశిస్తున్న తిమ్మిరి బ్రహ్మాజీని కొద్దిరోజులుగా ఇతడు వేధిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి బీచ్‌రోడ్డులో ఉన్న బార్‌లో బ్రహ్మజీ, అతని స్నేహితుడు కలిసి మద్యం సేవిస్తున్నారు. ఇంతలో అశోక్‌కుమార్ అక్కడికు వచ్చి వారితో గొడవపడ్డాడు. ఈ క్రమంలో బీర్‌బాటిల్ బద్దలుగొట్టి బ్రహ్మజీపై కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. చావుబతుకుల మధ్య కొట్టిమిట్టాడుతున్న అతనిని వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనలో అశోక్ కుమార్‌ను పోలీసులు రిమాండ్‌కు తీసుకెళ్లారు.

డీఎస్సీ ఉచిత శిక్షణ ప్రారంభం

సీతమ్మధార, మే 15, (ఆంధ్రజ్యోతి) : రామాటాకీస్ రోడ్డు ప్రాంతీయ ప్రభుత్వ నేత్ర వైద్యశాల ఎదురుగా గల అంబేడ్కర్ భవన్‌లో అంబేడ్కర్ మెమోరియాల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఏఎంసీ అధ్యక్షుడు కల్యాణ్‌రావు, ప్రధాన కార్యదర్శి జేవీ ప్రభాకరరావు, విజ్ఞాన కేంద్రం వైస్ ఛైర్మన్ డి.అచ్చంనాయుడు, డైరెక్టర్ ఆర్.శంకర్ తదితరులు ఈ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ శిక్షణ వారం రోజుల పాటు కొనసాగుతుందని విద్యార్థులు ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జేవీ ప్రభాకర్ కోరారు.

రెండు పంచాయతీలకు స్పెషల్ గ్రేడ్ హోదా

... 5వ పేజీ తరువాయి

విడుదలచేయలేదు. దీంతో పంచాయతీలు ఆదాయం కోల్పోవడంతో మామిడిలోవ, గండిగుండం, గిడిజాల, శొంఠ్యాం, తర్లువాడ, కుసులవాడ, పెద్దిపాలెం, రాంపురం, వాలిమెరక, ఎస్ఆర్ పురం పంచాయతీలు గ్రేడ్-1 నుంంచి గ్రేడ్-2గా మారాయి. అయితే మామిడిలోవ పంచాయతీలో దబ్బందలో 1,900 టిడ్కో ఇళ్లను నిర్మించారు. దీంతో జనాభా ఐదు వేలకు చేరుకునే అవకాశం ఉన్నందున తిరిగి గ్రేడ్-1 హోదా అధికారులు అంచనా వేస్తున్నారు. స్టాంపు డ్యూటీ విడుదలైతే గిడిజాల, గండిగుండం, పెద్దిపాలెం, వాలిమెరక, ఎస్ఆర్ పురం, రాంపురం పంచాయతీలు గ్రేడ్-1 హోదాను నిలబెట్టుకుంటాయని అంటున్నారు. మండల కేంద్రాలను గ్రేడ్-1 పంచాయతీలుగా పరిగణించాలన్న ఆదేశాలతో పద్మనాభం పంచాయతీకి హోదా గ్రేడ్-1 దక్కనున్నది. కాగా పెందుర్తి కేంద్రం జీవీఎంసీలో ఉన్నందున మండల పరిషత్ కార్యాలయాన్ని సరిపల్లి కేంద్రంగా నిర్వహించాలని ప్రతిపాదించడంతో సరిపల్లి కూడా గ్రేడ్-1గా కొనసాగే అవకాశం ఉంది. కొత్తగా పెదనాగమయ్యపాలెం పంచాయతీ గ్రేడ్-1 హోదాకు అప్‌గ్రేడ్ అయింది. పలు పంచాయతీల ఆదాయం పెరిగే అవకాశం ఉన్నందున గ్రేడింగ్‌ను తిరిగి పునరుద్ధరించాలన్న దానిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని జిల్లా పంచాయతీ అధికారి ఎంఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు.

అగనంపూడి హౌసింగ్ కాలనీపై విచారణ

» గాజువాక ఎమ్మెల్యే ఫిర్యాదుతో విచారణకు 11 బృందాలు

విశాఖపట్నం/గాజువాక, మే 15 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి శివారు ప్రాంతం కొండకు ఆనుకుని పుష్కరకాలం క్రితం నిర్మించిన ఇళ్లను అనధికార వ్యక్తులు ఆక్రమించున్న వ్యవహారంపై సమగ్ర విచారణకు జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. మొత్తం 113 బ్లాకుల్లో ఉన్న 3,616 ఇళ్లలో చాలావరకు అనధికార వ్యక్తులు ఆధీనంలో ఉన్నాయని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఇటీవల కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో అన్ని బ్లాకుల్లోని ప్రతి ఇంటిని తనిఖీ చేసి అసలైన లబ్ధిదారులే ఉన్నారా? లేదా అనధికార వ్యక్తులు ఉంటున్నారా? అనే అంశంపై విచారణ జరపాలని కలెక్టర్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ నిమిత్తం మొత్తం 11 బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి బృందంలో రెవెన్యూ, జీవీఎంసీ యూసీడీ, గృహనిర్మాణ సంస్థ నుంచి ఒక్కొక్కరు ఉంటారు.

రాష్ట్ర విభజనకు ముందు నిర్మాణాలు ప్రారంభించిన ఈ కాలనీ పనులను పూర్తి చేయడంలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. ఇళ్లు నిర్మించిన తరువాత మౌలిక వసతులు లేకపోవడం, హైవే నుంచి సరైన రహదారి లేకపోవడంతో అప్పట్లో లబ్ధిదారులు చాలామంది అక్కడకు వెళ్లలేదు. దీంతో ఇళ్లలో లేని లబ్ధిదారులకు హౌసింగ్ అధికారులు నోటీసులు కూడా ఇచ్చారు. చాలామంది నగరంలో అంతుకుముందు ఉండే అద్దె ఇళ్ల నుంచి మరోచోటకు వెళ్లిపోవడంతో వారికి ఆ నోటీసుల సంగతే తెలియదు. గడువు ముగిశాక లబ్ధిదారుల నుంచి స్పందన లేకపోవడంతో కొన్ని ఇళ్లను అధికారులు రద్దు చేసి కొత్తగా లబ్ధిదారులకు కేటాయించారు. అదే సమయంలో ముఠా ఒకటి.. కాలనీలో ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి వాటిని ఆక్రమించుకుని తరువాత విక్రయించారు. ఆ తరువాత ఒరిజినల్ లబ్ధిదారులు తమ ఇళ్ల వద్దకు వెళితే కొత్త వ్యక్తులు ఉండడంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తూ తొలుత హౌసింగ్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. ఈ దందా వెనక హౌసింగ్ అధికారులు, సిబ్బంది పాత్ర ఉందనే ఆరోపణలున్నాయి. కొందరు జిల్లా హౌసింగ్ కార్యాలయానికి వచ్చి సిబ్బందితో గొడవ పడిన సందర్భాలున్నాయి. అయినా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఈలోగా గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి ఈ సమస్యను పలువురు తీసుకువచ్చారు. ఆయన స్పందించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడంతో తాజాగా విచారణకు ఆదేశించారు. విచారణ తరువాత వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పలువురు ఒరిజినల్ లబ్ధిదారులు అభిప్రాయ పడుతున్నారు.

2.5 లక్షల మందితో అంతర్జాతీయ యోగా దినోత్సవం

... 5వ పేజీ తరువాయి

ఏర్పాట్లు పక్కాగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఒకవేళ వర్షం కురిస్తే ఆర్కే బీచ్ నుంచి తీరంలోని ఏయూ కన్వెన్షన్ హాల్, ఏయూ ఇంజనీరింగ్ మైదానం నుంచి మద్దిలపాలెంలో కాకతీయ కన్వెన్షన్ హాల్ లేదా స్వర్ణభారతి స్టేడియంను ప్రత్యామ్నాయ వేదికగా గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అంతేకాక వేడుకలకు గుర్తించిన ప్రాంతాల్లో పార్కింగ్, తాగునీటి వసతి, విద్యుత్ సదుపాయం ఉండేలా చూసుకోవాలని, అందరూ వీక్షించేందుకు అనుగుణంగా స్క్రీన్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి వేదిక వద్ద శిక్షకుడు అందరికీ కనిపించేలా చిన్నపాటి స్టేజీలు, మైకులను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు సమన్వయంతో వ్యవహరించి కార్యక్రమానికి సంబంధించి విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. సమావేశంలో జేసీ కె.మయూర్ అశోక్, డీసీపీ మేరి ప్రశాంతి, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, ఏడీసీపీ రాజ్‌కమల్, ప్రత్యేకాధికారులు దయానిధి, మాధవి, మధుసూదనరావు, డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, ఇంటర్ ఆర్ఐవో మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఏఐ ట్రాఫిక్ సిగ్నల్స్ ఏవీ?

... 5వ పేజీ తరువాయి

ఉంటుందని, తద్వారా వాహనచోదకులు సిగ్నల్స్ వద్ద ఆగాల్సిన పని ఉండదని తెలియజేశారు. దీనివల్ల రోడ్లపై ట్రాఫిక్ సమస్య తగ్గడంతో పాటు సిగ్నల్స్ జంపింగ్ చేయాల్సిన అవసరం వాహనచోదకులకు ఉండదు. అలాగే ఎవరైనా వాహనం నడుపుతున్నప్పుడు సెల్ ఫోన్ మాట్లాడుతున్నా, హెల్మెట్ ధరించకపోయినా, ట్రిపుల్ రైడింగ్ చేసినా, ప్రమాదకరంగా వాహనాన్ని నడిపినా సరే సీసీ కెమెరాలు ఆటోమెటిక్‌గా ఉల్లంఘనను గుర్తించి సదరు వాహనం నంబర్ ప్లేట్ ఆధారంగా దాని యజమానికి ఈ-చలానా జారీ అయిపోతోంది. ఎక్కడైనా ట్రాఫిక్ జామ్ అయినట్టయితే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు లేదా సిబ్బందికి సమాచారం వెంటనే చేరిపోతుంది. దీనివల్ల వారు అక్కడకు చేరుకుని సమస్యను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుంది. ఎక్కువ పెండింగ్ చలానాలు ఉన్న వాహనం రోడ్డుపై వెళుతున్నా సరే.. ఆ వివరాలను ఆ కూడలిలోని సిబ్బందికి తెలిసిపోతుంది. ఏఐ టెక్నాలజీ కలిగిన సీసీ కెమెరాలు అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ పోలీసులకు పెద్దగా పని ఉండదు. ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి ఉల్లంఘనలను ఏఐ టెక్నాలజీ కలిగిన సీసీ కెమెరాలే పసిగట్టి ఆటోమెటిక్‌గా చలానాలను జారీ చేస్తుంది. పోలీసులు కేవలం డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు చేయడం, పెండింగ్ చలానాలను వసూలు చేయడం వంటి పనులు చేయాల్సి ఉంటుంది. అలాంటప్పుడు ట్రాఫిక్‌లో పనిచేసే సిబ్బందిని తగ్గించి ఇతర విధులకు కేటాయించేందుకు అవకాశం ఉంటుంది.మరోవైపు ఏఐ టెక్నాలజీ కలిగిన సీసీ కెమెరాలు పాత నేరస్థులు, రౌడీషీటర్లు, ఎక్కడైనా నేరం చేసి పరారైపోయేవారిని గుర్తించడం పోలీసులకు సులభతరమవుతుంది. పాత నేరస్థులు, రౌడీషీటర్ల వివరాలు, చిరునామా, ఫొటోలను ఆన్‌లైన్ చేసి ఏఐ టెక్నాలజీ కలిగిన సీసీ కెమెరాలకు అనుసంధానం చేసినట్టయితే అలాంటివారు ఎక్కడైనా సీసీ కెమెరాకు చిక్కితే వారి వివరాలను తక్షణమే సమీపంలోని పోలీసులకు తెలియజేస్తుంది. అప్పుడు పోలీసులు అప్రమత్తమై అలాంటివారిని అదుపులోకి తీసుకోవడం ద్వారా నేరం జరగకుండా చూసేందుకు అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో నగరంలో 110 కూడళ్లలో ఏఐతో కూడిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సీపీ శంఖబ్రత బాగ్చి ప్రతిపాదనలు తయారుచేశారు. ఒక్కో జంక్షన్‌లో ఎన్ని కెమెరాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది, ఇందుకోసం ఎంత ఖర్చు అవుతుందనే దానిపై అంచనాలను తయారుచేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు పలు ప్రైవేటు సంస్థలు ఆసక్తి చూపడంతో వారిలో మెరుగైన ప్రతిపాదనతో వచ్చే వారిని ఎంపిక చేసి వారితో పనులు చేయించేలా జీవీఎంసీసి సిఫారసు చేస్తామని గత ఏడాది నవంబరులో సీపీ తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా పదిచోట్ల వీటిని ఏర్పాటు చేయాలని జీవీఎంసీని కోరగా, సంబంధిత అధికారులు కౌన్సిల్‌లో ఈ అంశాన్ని చర్చించి ఆమోదించారు. అయితే ఆ తరువాత దీనిపై అతీగతీ లేకపోవడంతో ఆ ప్రతిపాదనలు అక్కడితోనే నిలిచిపోయాయి. దీంతో సీపీ ప్రతిపాదనలు ఆగిపోయినట్టేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

డిప్యూటీ మేయర్ ఎన్నికకు వైసీపీ దూరం!

... 5వ పేజీ తరువాయి

విధితమే. డిప్యూటీ మేయర్ ఎన్నిక కోసం సభ్యులందరికీ ఎన్నికల అధికారి హోదాలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఇప్పటికే నోటీసులు అందజేశారు. డిప్యూటీ మేయర్‌ను ఎన్నుకోవాలంటే కనీసం 56 ఓట్లు అవసరం. అయితే కూటమికి 74 మంది కార్పొరేటర్లు/ఎక్స్‌అఫీషియో సభ్యుల బలం ఉండడంతో కూటమి అభ్యర్థి డిప్యూటీ మేయర్‌గా ఎన్నికవ్వడం లాంఛనమేనని చెప్పుకోవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఎన్నికకు హాజరవ్వకూడదని వైసీపీ నేతలు తమ కార్పొరేటర్లను ఆదేశించినట్టు సమాచారం.

ప్రాజెక్టుల పరుగు..

... 5వ పేజీ తరువాయి

పూర్తి చేస్తాం. చీకటి పడ్డాక వెలుగులు విరజిమ్మడం దీని ప్రత్యేకత.

- మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం (ది డెక్)లో 4, 5 అంతస్థులు ఐటీ కార్యాలయాలకు ఇచ్చేశాం. మూడో అంతస్థులో రెస్టారెంట్, ఫైన్ డైనింగ్ పెడుతున్నాం. అలాగే టెర్రస్‌పై కెఫే ఏర్పాటు చేస్తున్నాం. ఈ భవనంలో స్పేస్ కోసం చాలా సంస్థలు పోటీ పడుతున్నాయి.
- కొత్తగా చేపట్టబోయే ఐదు మాస్టర్ ప్లాన్ రహదారులకు టెండర్లు పిలుస్తున్నాం. వీటిని వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నాం. ఈ రహదారులకు భూములు ఇచ్చే రైతులు, గృహస్థులకు వీఎంఆర్డీఏ పరిధి అయితే మేము టీడీఆర్‌లు ఇస్తాం. జీవీఎంసీ పరిధి అయితే వారు ఇస్తారు. ముందు టీడీఆర్‌లు ఇచ్చాకే పనులను ప్రారంభించాలనుకుంటున్నాం.
- విశాఖపట్నం విమానాశ్రయం సమీపాన కాకాని నగర్ వద్ద రూ.12 కోట్ల వ్యయంతో సబ్‌వే నిర్మాణం చేపడుతున్నాం.
- ఎన్ఏడీ వద్ద రైలు ఓవర్ బ్రిడ్జి పనులను మరో రెండు నెలల్లో పూర్తి చేస్తాం.
- అనకాపల్లిలో కొత్తగా వీఎంఆర్డీఏ జోనల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నాం. విజయనగరంలోని జోనల్ కార్యాలయాన్ని ఆధునీకరిస్తున్నాం.
- మధ్యతరగతి ప్రజల కోసం అపార్ట్‌మెంట్లు నిర్మించాలని చేసిన ప్రతిపాదనకు మంచి స్పందన వస్తోంది. మిథిలాపురి వుడా కాలనీ, మధురవాడ, వేపగుంట ప్రాంతాల్లో అనువైన భూములు ఉన్నాయి. అన్ని రకాల సదుపాయాలతో వీటిని నిర్మించి, మార్కెట్ రేటు కంటే తక్కువకు ఇవ్వాలని యోచిస్తున్నాం.
- వీఎంఆర్డీఏ సిటీ సెంట్రల్ పార్కులో గ్లో గార్డెన్‌కు కొన్ని మార్పులు చేసి పనులు చేపట్టాలని అనుకుంటున్నాం. అదేవిధంగా ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ సూచన మేరకు మాదక ద్రవ్యాలకు బానిసలైన వారికి కోసం ఓ కేంద్రాన్ని నిర్మించి కౌన్సెలింగ్ నిర్వహించే ఏర్పాటు కూడా చేస్తాం.
- కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జి పనులు కొంచెం నెమ్మదిగా జరుగుతున్నాయి. దానిని వేగవంతం చేస్తాం.

సులభంగా రేషన్ కార్డుల అప్‌డేట్ సేవలు

- చేర్పులు మార్పులకు అవకాశం
- అందుబాటులో ఏడు రకాల సర్వీసెస్
- సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ

మద్దిలపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన పేదలకు కొత్త రేషన్‌కార్డులు మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొత్త కార్డులతో పాటు మరో ఆరు రకాల సేవలు పొందేందుకు అవకాశం కల్పించింది. కొత్త కార్డులు, కార్డులో కొత్తగా సభ్యుల నమోదు, సభ్యుల పేర్ల తొలగింపు, కార్డుల సరెండర్, చిరునామా మార్పు, తప్పుగా నమోదైన ఆధార్ సీడింగ్ దిద్దుబాటు, సభ్యుల విభజన వంటి 7 సేవలను ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభించింది. వీటికి సంబంధించి దరఖాస్తులను సచివాలయాల్లో స్వీకరిస్తున్నారు. 15వ తేదీ నుంచి వాట్సాప్ గవర్నన్స్ ద్వారా కూడా రేషన్ కార్డుల సేవలకు అవకాశమిచ్చింది. దీంతో కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న పేద ప్రజలు సచివాయాలను సంప్రదిస్తున్నారు.

కొత్తకార్డులకు, ఇతర సేవలకు అవసరమైన పత్రాలు గురించి ఆరా తీస్తున్నారు. అయితే చాలా మందికి ప్రభుత్వం కల్పించిన రేషన్‌కార్డుల సేవలకు ఎటువంటి పత్రాలు అవసరమో అన్న విషయమై పెద్దగా అవగాహన లేదు. ముఖ్యంగా చాలా మంది తమ పిల్లల పేర్లు రేషన్‌కార్డులో చేర్చేందుకు దరఖాస్తులు చేస్తున్నారు.

కొత్త రేషన్‌కార్డులకు అవసరమైన పత్రాలు...

కొత్త రేషన్ కార్డు పొందడానికి అర్హత ప్రమాణాలు నిర్ణయించారు.



నెలకు రూ.10 వేలు లోపు ఆదాయం కలిగి వుండాలి. సొంత ఇల్లు ఉంటే వెయ్యి అడుగులలోపు ఉండాలి.

300 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగం ఉండకూడదు. దరఖాస్తు చేసుకున్న సభ్యుల్లో ఎవరు ప్రభుత్వ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగస్తులు ఉండకూడదు. సొంతకారు కలిగి ఉండరాదు(టాక్సీ ఉంటే మినహాయింపు), రైతులకు వెట్ ల్యాండ్ అయితే 3 ఎకరాలు, డ్రై ల్యాండ్ 10 ఎకరాలకు మించకుండా ఉన్న వారు కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు చేయాలి. సభ్యులు ఆధార్ కార్డులు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుటుంబ సభ్యుల ఫోటోతో సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.

సభ్యుల యాడింగ్..

తూర్పు నియోజకవర్గంలో ఎక్కువ మంది లబ్ధిదారులు తమ పిల్లలను రేషన్‌కార్డులో యాడ్ చేయడానికి సచివాలయాలకు సంప్రదిస్తున్నారు. అయితే 15 ఏళ్లలోపు పిల్లలను రేషన్ కార్డుల్లో నమోదు చేస్తున్నారు. అయిదేళ్ల లోపు పిల్లలను యాడ్ చేయడానికి పిల్లల ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, తల్లి లేదా తండ్రి ఆధార్ కార్డుల జిరాక్స్‌లు దరఖాస్తుతో జత చేసి సచివాయాల్లో అందించాలి. అయిదేళ్ల నుంచి పదిహేనేళ్ల పిల్లల నమోదుకు ఆధార్ అప్‌డేట్ చేసి ఉండాలి. బాలాధర్ నుంచి సాధారణ ఆధార్‌కు అప్‌డేట్ చేస్తేనే రేషన్‌కార్డులో నమోదు చేయడం జరుగుతుంది. అందుకే ఏడాది లోపు ఆధార్ పొందిన పిల్లలు అయిదేళ్ల దాటిన అప్‌డేట్ చేయకపోతే తక్షణమే ఆధార్ కేంద్రంలో అప్‌డేట్ చేసుకుని సచివాయాల్లో దరఖాస్తులు చేయాలి.

మార్పులు, చేర్పులిలా..

రేషన్‌కార్డులో చిరునామా మార్పు చేయడానికి మార్పు చేయాలనుకుంటున్న చిరునామాతో కలిగిన ఆధార్‌కార్డు తప్పనిసరి. వివాహం చేసుకున్న వారు పేర్లు నమోదు చేయాలంటే వారి వివాహం రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, పెళ్లి ఫోటోలు, ఆధార్‌కార్డు కలిగి ఉండాలి. మృతిచెందిన వారి పేర్లు తొలిగింపునకు మరణ ధ్రువీకరణ పత్రం, సదరు వ్యక్తి ఆధార్ కార్డు సమర్పించాలి. వీటితో పాటు ఒకే కార్డులో ఉన్న కుటుంబ సభ్యులు వేర్వేరుగా జీవిస్తుంటే స్ప్లిటింగ్ కింద వేర్వేరు రేషన్ కార్డులు పొందే అవకాశం కల్పించారు. అంతేకాకుండా స్వచ్ఛందంగా రేషన్‌కార్డు వదులుకునే అవకాశం కూడా కల్పించారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ద్వారకా బస్‌స్టేషన్, మే 15(ఆంధ్రజ్యోతి) : భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం ద్వారకా బస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భారత వికాస పరిషత్ సభ్యులు, ద్వారకా కాంప్లెక్స్ మేనేజర్, పలువురు సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు జోన్-5 కార్యాలయంలో ప్రత్యేక సమావేశం

- జడ్సీ రాము

వెంకోజీపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో ఉన్న ఎనిమిది జోన్ల పరిధిలో పరిపాలనా సౌలభ్యం నేపథ్యంలో పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పునర్ రూపకల్పన చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసేందుకు శుక్రవారం సమావేశం నిర్వహించనున్నట్టు 5వ జోన్ జోనల్ కమిషనర్ బి.రాము బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా విశాఖ పశ్చిమ నియోజకవర్గం పరిధి పునర్ రూపకల్పనకోసం జ్ఞానాపురం జోన్-5 కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం 5వ జోన్‌కు సంబంధించి ప్రజా ప్రతినిధులు, నివాసిత సంక్షేమ సంగాల ప్రతినిధులు, వివిధ రంగాల్లో అనుభవజ్ఞులైన పౌరుల సూచనలు, సలహాలు స్వీకరించనున్నట్టు తెలిపారు.

ఈ సమావేశానికి అధిక సంఖ్యలో పౌరులు హాజరు కావాలని కోరారు.

సినిమా గైడ్

● **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)

● **శుభం**: శారద, శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

● **హిట్** : జగదాంబ, సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 14, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 18, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 42, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 38 దొండకాయలు 22, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 50, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 44, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 94, కీరదోస 34, కాప్సికమ్ 44, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 34, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న నగర మేయర్



దుర్గమ్మ ఆలయంలో మేయర్ పీలా

వెంకోజీపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆశీస్సులు విశాఖ నగర ప్రజలపై ఉండాలని కోరుకున్నట్టు విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ఏపీ యూఎఫ్ఐడీసీ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణతో కలిసి విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై గల కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ శ్రీదుర్గమ్మ తల్లి ఆశీస్సులు విశాఖ నగర ప్రజలపై ఉండాలని., విశాఖ నగర ప్రజల శ్రేయస్సు, శాంతి, నగరాభివృద్ధి వేగవంతంగా జరిగేలా దుర్గమ్మను వేడుకున్నట్టు తెలిపారు. దుర్గమ్మవారి దర్శనానంతరం వేద పండితుల నుంచి ఆశీర్వచనం పొంది ఆలయ అధికారుల నుంచి తీర్థ ప్రసాదాలను మేయరు స్వీకరించారు.

కాపులకు అండగా కూటమి ప్రభుత్వం

- వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్

వెంకోజీపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కాపులకు ఎల్ల వేళల అండగా ఉంటుందని వీఎంఆర్‌ఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో కాపు సామాజిక వర్గం కోసం కాపు భవనం నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరు కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్తానని పేర్కొన్నారు. గతంలో టీడీపీ హయంలో కాపు భవనం కోసం ఎకరా భూమి కేటాయిస్తే, వైసీపీ హయాంలో 50 సెంటకు కుదించారన్నారు. భవన నిర్మాణానికి ఎలాంటి నిధులు విడుదల చేయకుండా ఎన్నికల సమయంలో నాటి వైసీపీ నేతలు హడావుడిగా భూమి పూజ చేసి వదిలేశారని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం కాపులకు చేసింది ఏమీ లేదని, కూటమి ప్రభుత్వం హయాంలోనే కాపు భవనం నిర్మాణం తథ్యమని ప్రకటన ద్వారా పేర్కొన్నారు.

కార్మిక సమ్మెను విజయవంతం చేయండి

- ఇంటక్ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం



మాట్లాడుతున్న నాగభూషణం

మల్కాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించే చట్టాలను తీసుకొస్తు అన్యాయం చేస్తోందని జిల్లా ఇంటక్ ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం అన్నారు. హెచ్‌పీసీఎల్ పాత గేటు ఎదురుగా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులతో గురువారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలన్ని కార్పొరేట్‌కు కొమ్ముకాసే విధంగా ఉన్నాయని, కార్మిక చట్టాలను అణగదొక్కడమే ధ్యేయంగా కేంద్రం అడుగులు వేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మే 20న దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు కలిసి సమ్మె నిర్వహిస్తున్నాయని, ఈ సమ్మెలో ద్వారా కార్మికుల సత్తా ఎంటో కేంద్రానికి తెలియజేయాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైఎస్ఆర్‌టీయూసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పైడిరాజు, లక్ష్మణమూర్తి, ఏఐటీయూసీ నాయకుడు కసిరెడ్డి సత్యనారాయణ, ఇంటక్ నాయకుడు ఎస్.తాతబాబుపాల్గొన్నారు.



మధ్యాహ్నం వేళ ఆకాశంలో కమ్ముకున్న మబ్బులు

ఎండ .. కారుమబ్బులు!



ఎండ వేడిమి నుంచి గొడుగుతో కాసింత ఉపశమనం

విశాఖపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం భిన్న వాతావరణం నెలకొంది. ఉదయం పది గంటల వరకు మేఘాలు ఆవరించి ఉన్నా ఆ తరువాత నెమ్మదిగా ఎండ తీవ్రత కొనసాగింది. మధ్యాహ్నం 2 గంటల వరకు ఎండ వేడిమితో పాటు ఉక్కపోతతో నగరవాసులు అల్లాడిపోయారు. ఆరుబయట ఉండేవారు ఎండకు తాళలేకపోయారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి మళ్లీ ఒక్కసారిగా నగరంపైకి మేఘాలు ఆవరించి ఈదురుగాలులు వీచాయి. నగర శివార్లలో వర్షం కురిసింది. నగరంలో వాన కురవకపోయినా ఈదురుగాలులతో వాతావరణం చల్లబడింది. ఎక్కువమంది తీరంలో సేదదీరారు.

శిక్షణ శిబిరాల కోచ్‌లకు కిట్లు పంపిణీ



చిన్నారులకు కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, మే 15 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరాల్లోని కోచ్‌లకు వివిధ కిట్లను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద అందించారు. వేసవి శిక్షణా శిబిరాల్లో భాగంగా తూర్పు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తునన వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, జూడో, టైక్వాండో, మలకంబం, ఖో-ఖో తదితర క్రీడలకు సంబంధించిన క్రీడా సామగ్రిని ప్రభుత్వం తరఫున ఎమ్మెల్యే కోచ్‌లకు అందించారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, తెలుగుదేశం నాయకులు గొలగాని పోలరావు, గేదెల నాగరాజు, బుగత సత్యనారాయణ, ఏడువాక సన్యాసిరావు, నవాబ్ తదితరులు పాల్గొన్నారు.

పాత వెంకోజీపాలెం జంక్షన్‌లో యూజీడీ సమస్యకు శాశ్వత పరిష్కారం

- కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య చొరవతో చురుగ్గా మరమ్మతు పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పనులు పర్యవేక్షిస్తున్న ఏఈ రహీమ్

వెంకోజీపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు పాత వెంకోజీపాలెం జంక్షన్‌లో ఎప్పటికప్పుడు అతి పెద్ద సమస్యగా ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యకు ఎట్టకేలకు వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య పరిష్కారం కల్పిస్తున్నారు. కొండవాలు ప్రాంతం నుంచి వస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఈ జంక్షన్‌కు వచ్చేసరికి మలుపు ఉండడంతో కొండ మీద నుంచి జోరుగా మురుకునీరు మలుపు ద్వారా వెళ్లలేక ఇక్కడి మ్యాన్‌హోల్ పొంగి మురుగు నీరంతా రోడ్డుపైన, దిగువ ప్రాంతంలోని ఇళ్లకు చేరేది. దీంతో స్థానికులు, వాహనచోదకులు, పాదచారులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనే వారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' పలుమార్లు ప్రచురించడం కూడా జరిగింది. గత వైసీపీ ప్రభుత్వంలో దీని గురించి కనీసం శ్రద్ధ చూపలేదు. అనంతరం వచ్చిన టీడీపీ ప్రభుత్వం కాస్త శ్రద్ధ చూపి నూతన పైపులైను మలుపు లేకుండా నేరుగా దిగువ ప్రాంతానికి వేసేందుకు వర్క్ శాంక్షన్ చేయించింది. అయితే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో వర్క్ వాయిదా పడింది. ఇప్పుడు మళ్లీ కార్పొరేటర్ చొరవతో నూతన పైపులైన్‌ను ప్రారంభించారు. యూసీడీ ఏఈ రహీమ్ ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో వాడ బలిజకు న్యాయం చేయాలి

- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు సంఘ నేతల వినతి



ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న వాడ బలిజ సంఘం నాయకులు

సిరిపురం, మే 15 (ఆంధ్రజ్యోతి) : మెజారిటీ మత్స్యకార జనాభా కలిగిన వాడ బలిజ ఉప కులానికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యమివ్వాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును గురువారం ఎంవీపీ కాలనీలోని ఆయన నివాసంలో కలిసి ఆ సంఘం నాయకులు కోరారు. మత్స్యకారుల్లోని 12 ఉప కులాల్లో వాడ బలిజలు 31 శాతంగా ఉన్నప్పటికీ.. రాజకీయంగా తగిన గుర్తింపు ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ వెన్నంటి ఉన్న వాడ బలిజ కంటే తక్కువ జనాభా ఉన్న ఉప కులాలకు ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేస్తానని గంటా హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఏపీ మెకనైజ్డ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పీసీ అప్పారావు, ఇతర వాడ బలిక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.25 లక్షలతో రహదారుల నిర్మాణం

- 18వ వార్డు కార్పొరేటర్ మంగవేణి



రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ గొలగాని మంగవేణి

ఎంవీపీ కాలనీ, మే 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పద్దెనిమిదో వార్డు పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి గురువారం శంకుస్థాపన చేశారు. ఎంవీపీ పదో సెక్టరులోని పలు వీధుల్లో అంతర్గత రహదారుల నిర్మాణానికి రూ.25 లక్షల జీవీఎంసి నిధులు మంజూరు చేసింది. రెండు నెలల్లో నిర్మాణం పూర్తి చేయనున్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

12వ వార్డులో దోమల నివారణకు ఫాగింగ్

ఆరిలోవ, మే 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. పెదగదిలి, సాలిపేట, ఈశ్వరదేవీ నగర్ కొండవాలు ప్రాంతాల్లో వీధుల్లో ఫాగింగ్ నిర్వహించారు. కొండవాలు ప్రాంతాల్లో పొదలు, చిత్తడి అధికంగా ఉండంతో దోమలు కూడా అధికంగా ఉంటాయని, ఫాగింగ్ వల్ల దోమల బెడద చాలా వరకు తగ్గుతుందని మలేరియా సిబ్బంది తెలిపారు.

భౌతిక శాస్త్రంలో త్రినాథ్‌కు డాక్టరేట్



త్రినాథ్‌కు డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖపట్నం,మే 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాల యం భౌతిక శాస్త్ర విభాగ పరిశోధక విద్యార్థి బల్ల త్రినాథ్‌కు ఏయూ డాక్టరేట్ లభించింది. ఈ మేరకు వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. ఇన్వెస్టిగేషన్ ఆఫ్ ది మైక్రో స్ట్రక్చరల్, ఎలక్ట్రికల్ అండ్ మాగ్నెటిక్ ప్రాపర్టీస్ ఆఫ్ జింక్, క్రోమియం అండ్ అల్యూమినియం సబ్‌స్టిట్యూటెడ్ కోబాల్ట్-కాపర్ ఫెర్రైట్ అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను ఈ డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్ కె.సమత పర్యవేక్షణలో పరిశోధనను త్రినాథ్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా త్రినాథ్‌కు పలువురు ప్రొఫెసర్లు, పరిశోధకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

జర్నలిజంలో షణ్ముఖకు..




ఏయూ వీసీ రాజశేఖర్ నుంచి డాక్టరేట్ డిగ్రీ అందుకుంటున్న షణ్ముఖ

వెంకోజీపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఏయూ జర్నలిజం విభాగ పరిశోధక విద్యార్థి రేగాన షణ్ముఖకు డాక్టరేట్ లభించింది. ప్రస్తుతం ఆంధ్రకేశరి విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతి డీవీఆర్ మూర్తి పర్యవేక్షణలో 'డిఫ్యూజన్ ఆఫ్ ఇన్నోవేషన్ అమోంగ్ షెడ్యూల్ క్యాస్ట్ పాపులేషన్ ఏ స్టడీ ఆఫ్ మైసూర్‌విలేజ్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై నిర్వహించిన పరిశోధనకు షణ్ముఖకు డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ గురువారం షణ్ముఖకు డాక్టరేట్ డిగ్రీని అందజేశారు.

లైమ్‌స్టోన్ దిగుమతిలో కొత్త రికార్డు

విశాఖపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టుకు నౌకలో వచ్చిన లైమ్‌స్టోన్‌ను రికార్డు సమయంలో దిగుమతి చేసి ఇంటిగ్రల్ ట్రేడింగ్ అండ్ లాజిస్టిక్స్ సంస్థ కొత్త రికార్డును నెలకొల్పింది. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్)కు చెందిన 28,353 టన్నుల లైమ్‌స్టోన్‌ను ఈ నెల 14న మధ్యాహ్నం 3.30 గంటలకు దిగుమతి ప్రారంభించి 15వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంటకు పూర్తి చేసింది. డబ్ల్యూక్యూ-3 బెర్త్‌పై ఎంవీ విశ్వదక్ష నౌక ద్వారా వచ్చిన ఈ లైమ్‌స్టోన్‌ను అతి తక్కువ సమయంలో దిగుమతి చేశామని సంస్థ ఎండీ గ్రంధి రాజేశ్ పేర్కొన్నారు. ఈ రికార్డుకు సహకరించిన సెయిల్, పోర్టు ట్రాఫిక్ విభాగానికి కృతజ్ఞతలు తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా ఈ రంగంలో ఉన్న తమ సంస్థ ఏడాదికి రెండు మిలియన్ టన్నుల కార్గోను హ్యాండ్లింగ్ చేస్తుందన్నారు.

హెచ్‌పీసీఎల్‌లో మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్‌లో భాగంగా తీవ్రవాదులను అడ్డుకుంటున్న సైనికులు

మల్కాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) విశాఖ రిఫైనరీలో గురువారం సాయంత్రం ఒక్కసారిగా తీవ్రమైన హడావిడి. ఫైర్ అండ్ సేఫ్టీ, సెక్యూరిటీగార్డులు, రక్షణకు సంబంధించిన సూచనలు చేస్తు అటు ఇటు పరుగులు. ఈ దృశ్యాలు పలువురు ఏమైందని ఆందోళ చెందారు. ఆ తరువాత సిందూర్ యుద్ధం కారణంగా తీవ్రవాదులు హెచ్‌పీసీఎల్‌లోకి ప్రవేశిస్తే ఎలా ఎదుర్కొవాలో, మనల్ని మనం ఎలా కాపాడుకోవాలనే అంశాలపై ఆక్టోపస్ బృందం మాక్‌డ్రిల్ నిర్వహించిందని హెచ్‌పీసీఎల్ యాజమాన్యం చెప్పింది. ఈ కార్యక్రమంలో హార్బర్ సర్కిల్ ఏసీపీ కాళీదాస్, మల్కాపురం పోలీసులు, రెవెన్యూ అధికారులు, ఫైర్ అండ్ సేఫ్టీ, నేవీ, ఆర్మీ, కోస్టుగార్డులు, బీడీ టీమ్, హెచ్‌పీసీఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల గుర్తింపునకు సర్వే



ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తున్న కో-ఆర్డినేటర్ గీత

అక్కయ్యపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 26వ వార్డు లలితానగర్‌లో విభిన్న ప్రతిభావంతులను గుర్తించే సర్వేను జిల్లా కో-ఆర్డినేటర్ గీత గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతమ్మధార మండలంలోని విభిన్న ప్రతిభావంతులను గుర్తించే సర్వే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గుర్తించిన విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన మౌలిక వసతులు, ఇతర సదుపాయాలు కల్పించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం లలితానగర్‌లో నివసిస్తున్న దివ్యాంగ బాలికను గుర్తించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి అప్పలనాయుడు, ఐఆర్‌టీలు జగదాంబ, శారద తదితరులు పాల్గొన్నారు

పేదలకు ఆహార ప్యాకెట్ల పంపిణీ



ఆహార ప్యాకెట్లు అందిస్తున్న శేషగిరిరావు

అక్కయ్యపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 42వ వార్డు రైల్వే ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయిధ్యాన మందిరం ఆవరణలో గురువారం పేదలకు ఆహార ప్యాకెట్లను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 ఏళ్ళుగా సాయిబాబా నిత్యాన్న ప్రసాదం వితరణ చేస్తున్నట్టు చెప్పారు.

అలాగే ఐవీఎఫ్ సహకారంతో ఇచ్చిన కమ్యూనిటీ ఫ్రిజ్‌లలో గత మూడేళ్ళ నుంచి ఆహారం 24 గంటల పాటు అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. గత నాలుగేళ్ళ నుంచి మాల ధరించిన స్వాములకు కూడా భిక్ష నిర్వహిస్తున్నామన్నారు.

నేడు జోన్-5 కార్యాలయంలో సమావేశం

» పశ్చిమ నియోజకవర్గ పునః రూపకల్పనపై సలహాల స్వీకరణ

జ్ఞానాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి) జీవీఎంసీ ఎనిమిది జోన్ల పరిధిలోని పరిపాలనా సౌలభ్యం కోసం అసెంబ్లీ నియోజకవర్గాల పునఃరూపకల్పన ప్రతిపాదనలో భాగంగా అధికారులు శుక్రవారం సమావేశా ఏర్పాటు చేశారు. ఉదయం పదకొండు గంటలకు జోన్-5 కార్యాలయంలో పశ్చిమ నియోజకవర్గం పునః రూపకల్పన విషయమై ప్రజాప్రతినిధులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, అనుభవజ్ఞులైన పౌరుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించనున్నట్లు జోనల్ కమిషనర్ బి.రాము తెలిపారు.

తెలుగు ఉపాధ్యాయుడికి సాహితీ రత్న పురస్కారం



ధర్మారావును సత్కరిస్తున్న ప్రముఖులు

అక్కయ్యపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, కవిశ్రేష్ఠ బిరుదాంకితులు ఎంవీ ధర్మారావుకు సాహితీ రత్న జాతీయ పురస్కారం లభించింది. ఈ మేరకు కళావేదిక సాహితీ పట్టాభిషేక మహోత్సవాల్లో భాగంగా ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల పేరిట ఏలూరు పట్టణంలో మహలక్ష్మి గోపాలస్వామి కల్యాణమండపంలో జరిగిన సాహితీ సమావేశంలో దర్మారావుకు కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు.

28న దుకాణాల బహిరంగ వేలం

మహారాణిపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ జోన్-4 పరిధిలోని పలు వాణిజ్య సముదాయాలు, దుకాణాలు, కల్యాణ మండపం, మార్కెట్‌లకు ఈ నెల 28న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం జరుగుతుందని జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు తెలిపారు. 35వ వార్డు స్ప్రింగ్ రోడ్డులో డైస్‌ట్యాంక్ వాణిజ్య సముదాయంలో షాపులు, గదులు, జగదాంబ వాణిజ్య సముదాయంలో దుకాణాలు, గదులు, పాత బస్టాండ్, పద్మానగర్ వాణిజ్య సముదాయం, సూర్యాబాగ్ వాణిజ్య సముదాయం, రెల్లివీధి చేపల మార్కెట్, కనకల దిబ్బ వాణిజ్య సముదాయం, టీఎస్ఆర్ వాణిజ్య సముదాయం, లక్ష్మిటాకీస్ వద్ద దుకాణాలు బహిరంగ వేలం వేస్తామన్నారు. ధరావత్తు సొమ్ము చెల్లించడానికి, ఇతర వివరాల కోసం జోన్-4 కార్యా లయంలో పర్యవేక్షకుడ్ని సంప్రదించాలని జోనల్ కమిషనర్ సూచించారు.

రక్షణ గోడ నిర్మాణంతో తీరనున్న కామాక్షినగర్ వాసుల సమస్య

మురళీనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 49వ వార్డు రైల్వే సొసైటీ నివాసాల్ని ఆనుకొని ఉన్న కామాక్షినగర్ నివాసాల ఎదుట రోడ్డు ఎత్తుకు సమానంగా ప్రహరీ గోడ నిర్మిస్తుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బర్మా క్యాంపు వెళ్లే ప్రధాన రహదారికి దిగువగా ఉన్న ప్రాంతంలో ఇళ్లకు రక్షణగా రూ.19 లక్షల జీవీఎంసీ నిధులతో ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారు. దిగువ పైప్ లైన్స్ ఉన్న కారణంగా ఆ మేరకు స్థలం విడిచి దాదాపు 100 మీటర్ల మేర ప్రహరీ నిర్మిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా సమస్యాత్మకంగా ఉన్న ఇక్కడి నివాసితులకు ప్రహరీ నిర్మిస్తుండడంతో భరోసా చేకూరుతోంది. దీంతో ఇన్నాళ్లకు తమ సమస్య తీరుతోందని స్థానికులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రహరీ పనులు జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణలో జోరుగా సాగుతున్నాయి. పొడవైన ప్రహరీ మధ్య కాంక్రీట్ పిల్లర్స్ వేసి, వాటి మధ్యగా ఇటుకల గోడ నిర్మాణం చేస్తున్నారు.



నివాసాలకు సమీపంలో నిర్మిస్తున్న రక్షణ గోడ

వేసవి శిబిరాల్లో క్రీడా సామగ్రి అందజేత

విశాఖపట్నం, స్పోర్ట్సు, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరాల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు క్రీడా సామగ్రి పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా నగరంలోని కొన్ని కేంద్రాల్లో నిర్వహిస్తున్న క్రీడా శిబిరాల్లో పాల్గొంటున్న చిన్నారులకు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు గురువారం తన కార్యాలయం వద్ద క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. అథ్లెటిక్స్ ఫుట్‌బాల్, వాలీబాల్, జూడో, తైక్వాండో, ఖో-ఖో వంటి పలు క్రీడాంశాలకు చెందిన క్రీడా సామగ్రిని అందజేసి క్రమశిక్షణ, చిత్తశుద్ధితో శిక్షణ పొంది ఉత్తమ క్రీడాకారులుగా రూపొందాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో జూన్ గ్యాలియట్, డీఎస్ఏ కోచ్‌లు పాల్గొన్నారు.



క్రీడా సామగ్రిని పంపిణీ చేసిన తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి

వరల్డ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో లింగేశ్వరరావుకు స్వర్ణం

విశాఖపట్నం, స్పోర్ట్సు, మే 15 (ఆంధ్రజ్యోతి) : వరల్డ్ ఓపెన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన లింగేశ్వరరావు పతకం సాధించారు. చైనా తైవాన్‌లో జరిగిన ఈ టోర్నీలో 55 ప్లస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రాతినిధ్యం వహించిన లింగేశ్వరరావు తన పార్టనర్‌తో అద్భుతంగా రాణించి స్వర్ణ పతకం కైవసం చేసుకున్నారు. ఇప్పటి వరకు అనేక అంతర్జాతీయ, జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీల్లో పతకాలు సాధించిన లింగేశ్వరరావు...ప్రతిష్టాత్మక వరల్డ్ ఓపెన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో పసిడి పతకం సాధించిన నేపథ్యంలో పలువురు హర్షం వ్యక్తం చేశారు.



మిక్స్‌డ్ డబుల్స్ పార్టనర్‌తో లింగేశ్వరరావు

అర్హులకు ఇళ్లు ఇప్పించండి

» తాతయ్యబాబుకు సత్యాడ అప్పారావు వినతి



తాతయ్యబాబుకు అభినందనలు తెలుపుతున్న అప్పారావు

కంచరపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబును.. జీవీఎంసీ 48వ వార్డు టీడీపీ సీనియర్ నాయకుడు సత్యాడ అప్పారావు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అర్హులైన నిరుపేదలందరికీ చంద్రబాబు హయాంలో పక్కా ఇళ్లు మంజూరుకు కృషి చేయాలని తాతయ్యబాబుకు అప్పారావు విజ్ఞప్తి చేశారు. పేదలకు పక్కా ఇళ్లు అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తాతయ్యబాబు తెలిపారు. చైర్మన్‌ను కలిసిన వారిలో టీడీపీ 48 వార్డు కార్యకర్తలు ఉన్నారు.

ఎర్నిమాంబకు వెయ్యి కలశాలతో జలాభిషేకం

» భారీగా తరలి వచ్చిన భక్తజనం » పట్టువస్త్రాలు సమర్పించిన ప్రజాప్రతినిధులు



అమ్మవారిని దర్శించుకుంటున్న సీతంరాజు సుధాకర్ తదితరులు



కలశ బిందెలతో ర్యాలీగా అమ్మవారి ఆలయానికి తరలి వస్తున్న భక్తజనం

జ్ఞానాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి) : కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా గురువారం ఉదయం అమ్మవారికి జలాభిషేకాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జ్ఞానాపురం, అచ్చియ్యమ్మపేట తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు సుమారు వెయ్యి కలశ బిందెలతో విచ్చేశారు. తొలుత అచ్చియ్యమ్మపేట ప్రజలు మనోరమ ప్రాంతం నుంచి, జ్ఞానాపురం ప్రజలు జేఎస్ఎన్ఎంయూఆర్ఎం కాలనీ నుంచి బయల్దేరారు. అమ్మవారి ఆలయం వరకు మేళ తాళాల నడుమ ఊరేగింపుగా విచ్చేసి ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి అభిషేకం చేశారు. సౌత్ టీడీపీ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.

అనంత రం వారు స్వయంగా పుసుపు నీళ్లతో అభి షేకిం చారు. అలాగే 41వ వార్డు, 34వార్డు టీడీపీ అధ్య క్షులు ఐతి మధుబాబు, వాసుపల్లి రామ్ కుమార్, కార్పొరేటర్లు తోట పద్మావతి, వెంకట స్వాతిదాస్, రెయ్యి వెంకటరమణ ప్రత్యేక పూజలు జరిపారు. వీరందరికీ ఆలయ ఈవో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీతంరాజు సుధాకర్ మట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ ఆలయానికి అవసరమైన ఎకరం రైల్వే భూమి కేటాయింపు జరిగేలా కూటమి ప్రభుత్వం చొరవచూపాలని కోరారు.

కార్పొరేటర్ పూర్ణిమా మాట్లాడుతూ ఆలయం ముందు భక్తుల సౌకర్యార్థం షెడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కోడిగుడ్ల శ్రీధర్, అంథోని శేఖర్, ఐతి రవిబాబు, ఆలయ ధర్మకర్తల కమిటీ సభ్యులు లండా రమణ, చుక్కా శ్యామ్,నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పిస్టల్, ఎయిర్ రైఫిల్ పోటీల్లో విజేతలకు సత్కారం

డాబాగార్డెన్స్, మే 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించాలని వైఎంసీ జాతీయ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు రోలాండ్ విలియమ్స్ అన్నారు. ఇటీవల ట్రూ షాట్, రైఫిల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఎయిర్‌పిస్టల్, ఎయిర్ రైఫిల్ పోటీల్లో విజేతలను గురువారం సత్కరించారు. జూనియర్ మెన్ విభాగంలో బంగారు పతకం సాధించిన కోనా రోహిత్, సీనియర్ విభాగంలోని కృష్ణప్రసాద్, కె.ఎలీషా, కేవీఎస్ఎన్ మూర్తి, గోవర్ధన్, బి.లినిషాలను సత్కరించి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.కృపాదాన్‌కుమార్, స్టీవెన్, ఇజ్రాయిల్, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న మాజీ అధ్యక్షుడు రోలాండ్ విలియమ్స్

రెల్లివీధికి చెందిన రౌడీషీటర్ అరెస్టు

» బార్‌లో మద్యం బాటిల్‌తో వ్యక్తిపై దాడి
» తీవ్ర గాయాలు కావడంతో కేజీహెచ్‌కు తరలింపు

మహారాణిపేట, మే 15 (ఆంధ్రజ్యోతి) : బార్‌లో మద్యం బాటిల్‌తో ఓ వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరచిన రౌడీషీటర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. రెల్లివీధి ప్రాంతానికి కంబాల అశోక్‌కుమార్ రౌడీషీటర్ . ఇతడిపై నాలుగు హత్యాయత్నం కేసులు ఉన్నాయి. వన్‌టౌన్ ఘోషా ఆసుపత్రి సమీపంలో నివశిస్తున్న తిమ్మిరి బ్రహ్మాజీని కొద్దిరోజులుగా ఇతడు వేధిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి బీచ్‌రోడ్డులో ఉన్న బార్‌లో బ్రహ్మాజీ, అతని స్నేహితుడు కలిసి మద్యం సేవిస్తున్నారు. ఇంతలో అశోక్‌కుమార్ అక్కడికు వచ్చి వారితో గొడవపడ్డాడు. ఈ క్రమంలో బీర్‌బాటిల్ బద్దలుగొట్టి బ్రహ్మాజీపై కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. చావుబతుకుల మధ్య కొట్టిమిట్టాడుతున్న అతనిని వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనలో అశోక్ కుమార్‌ను పోలీసులు రిమాండ్‌కు తీసుకెళ్లారు.

డీఎస్సీ ఉచిత శిక్షణ ప్రారంభం

సీతమ్మధార, మే 15, (ఆంధ్రజ్యోతి) : రామాటాకీస్ రోడ్డు ప్రాంతీయ ప్రభుత్వ నేత్ర వైద్యశాల ఎదురుగా గల అంబేడ్కర్ భవన్‌లో అంబేడ్కర్ మెమోరియాల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఏఎంసీ అధ్యక్షుడు కల్యాణ్‌రావు, ప్రధాన కార్యదర్శి జేవీ ప్రభాకరరావు, విజ్ఞాన కేంద్రం వైస్ ఛైర్మన్ డి.అచ్చంనాయుడు, డైరెక్టర్ ఆర్.శంకర్ తదితరులు ఈ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ శిక్షణ వారం రోజుల పాటు కొనసాగుతుందని విద్యార్థులు ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జేవీ ప్రభాకర్ కోరారు.

రెండు పంచాయతీలకు స్పెషల్ గ్రేడ్ హోదా

... 5వ పేజీ తరువాయి

విడుదలచేయలేదు. దీంతో పంచాయతీలు ఆదాయం కోల్పోడంతో మామిడిలోవ, గండిగుండం, గిడిజాల, శొంఠ్యాం, తర్లువాడ, కుసులవాడ, పెద్దిపాలెం, రాంపురం, వాలిమెరక, ఎస్ఆర్ పురం పంచాయతీలు గ్రేడ్-1 నుంచి గ్రేడ్-2గా మారాయి. అయితే మామిడిలోవ పంచాయతీలో దబ్బందలో 1,900 టిడ్కో ఇళ్లను నిర్మించారు. దీంతో జనాభా ఐదు వేలకు చేరుకునే అవకాశం ఉన్నందున తిరిగి గ్రేడ్-1 హోదా అధికారులు అంచనా వేస్తున్నారు. స్టాంపు డ్యూటీ విడుదలైతే గిడిజాల, గండిగుండం, పెద్దిపాలెం, వాలిమెరక, ఎస్ఆర్ పురం, రాంపురం పంచాయతీలు గ్రేడ్-1 హోదాను నిలబెట్టుకుంటాయని అంటున్నారు. మండల కేంద్రాలను గ్రేడ్-1 పంచాయతీలుగా పరిగణించాలన్న ఆదేశాలతో పద్మనాభం పంచాయతీకి హోదా గ్రేడ్-1 దక్కనున్నది. కాగా పెందుర్తి కేంద్రం జీవీఎంసీలో ఉన్నందున మండల పరిషత్ కార్యాలయాన్ని సరిపల్లి కేంద్రంగా నిర్వహించాలని ప్రతిపాదించడంతో సరిపల్లి కూడా గ్రేడ్-1గా కొనసాగే అవకాశం ఉంది. కొత్తగా పెదనాగమయ్యపాలెం పంచాయతీ గ్రేడ్-1 హోదాకు అప్‌గ్రేడ్ అయింది. పలు పంచాయతీల ఆదాయం పెరిగే అవకాశం ఉన్నందున గ్రేడింగ్‌ను తిరిగి పునరుద్ధరించాలన్న దానిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని జిల్లా పంచాయతీ అధికారి ఎంఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు.

అగనంపూడి హౌసింగ్ కాలనీపై విచారణ

» గాజువాక ఎమ్మెల్యే ఫిర్యాదుతో విచారణకు 11 బృందాలు

విశాఖపట్నం/గాజువాక, మే 15 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి శివారు ప్రాంతం కొండకు ఆనుకుని పుష్కరకాలం క్రితం నిర్మించిన ఇళ్లను అనధికార వ్యక్తులు ఆక్రమించున్న వ్యవహారంపై సమగ్ర విచారణకు జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. మొత్తం 113 బ్లాకుల్లో ఉన్న 3,616 ఇళ్లలో చాలావరకు అనధికార వ్యక్తులు ఆధీనంలో ఉన్నాయని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఇటీవల కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో అన్ని బ్లాకుల్లోని ప్రతి ఇంటిని తనిఖీ చేసి అసలైన లబ్ధిదారులే ఉన్నారా? లేదా అనధికార వ్యక్తులు ఉంటున్నారా? అనే అంశంపై విచారణ జరపాలని కలెక్టర్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ నిమిత్తం మొత్తం 11 బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి బృందంలో రెవెన్యూ, జీవీఎంసీ యూసీడీ, గృహనిర్మాణ సంస్థ నుంచి ఒక్కొక్కరు ఉంటారు.

రాష్ట్ర విభజనకు ముందు నిర్మాణాలు ప్రారంభించిన ఈ కాలనీ పనులను పూర్తి చేయడంలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. ఇళ్లు నిర్మించిన తరువాత మౌలిక వసతులు లేకపోవడం, హైవే నుంచి సరైన రహదారి లేకపోవడంతో అప్పట్లో లబ్ధిదారులు చాలామంది అక్కడకు వెళ్లలేదు. దీంతో ఇళ్లలో లేని లబ్ధిదారులకు హౌసింగ్ అధికారులు నోటీసులు కూడా ఇచ్చారు. చాలామంది నగరంలో అంతుకుముందు ఉండే అద్దె ఇళ్ల నుంచి మరోచోటకు వెళ్లిపోవడంతో వారికి ఆ నోటీసుల సంగతే తెలియదు. గడువు ముగిశాక లబ్ధిదారుల నుంచి స్పందన లేకపోవడంతో కొన్ని ఇళ్లను అధికారులు రద్దు చేసి కొత్తగా లబ్ధిదారులకు కేటాయించారు. అదే సమయంలో ముఠా ఒకటి.. కాలనీలో ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి వాటిని ఆక్రమించుకుని తరువాత విక్రయించారు. ఆ తరువాత ఒరిజినల్ లబ్ధిదారులు తమ ఇళ్ల వద్దకు వెళితే కొత్త వ్యక్తులు ఉండడంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తూ తొలుత హౌసింగ్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. ఈ దందా వెనక హౌసింగ్ అధికారులు, సిబ్బంది పాత్ర ఉందనే ఆరోపణలున్నాయి. కొందరు జిల్లా హౌసింగ్ కార్యాలయానికి వచ్చి సిబ్బందితో గొడవ పడిన సందర్భాలున్నాయి. అయినా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఈలోగా గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి ఈ సమస్యను పలువురు తీసుకువచ్చారు. ఆయన స్పందించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడంతో తాజాగా విచారణకు ఆదేశించారు. విచారణ తరువాత వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పలువురు ఒరిజినల్ లబ్ధిదారులు అభిప్రాయ పడుతున్నారు.

2.5 లక్షల మందితో అంతర్జాతీయ యోగా దినోత్సవం

... 5వ పేజీ తరువాయి

ఏర్పాట్లు పక్కాగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఒకవేళ వర్షం కురిస్తే ఆర్కే బీచ్ నుంచి తీరంలోని ఏయూ కన్వెన్షన్ హాల్, ఏయూ ఇంజనీరింగ్ మైదానం నుంచి మద్దిలపాలెంలో కాకతీయ కన్వెన్షన్ హాల్ లేదా స్వర్ణభారతి స్టేడియంను ప్రత్యామ్నాయ వేదికగా గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అంతేకాక వేడుకలకు గుర్తించిన ప్రాంతాల్లో పార్కింగ్, తాగునీటి వసతి, విద్యుత్ సదుపాయం ఉండేలా చూసుకోవాలని, అందరూ వీక్షించేందుకు అనుగుణంగా స్క్రీన్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి వేదిక వద్ద శిక్షకుడు అందరికీ కనిపించేలా చిన్నపాటి స్టేజీలు, మైకులను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు సమన్వయంతో వ్యవహరించి కార్యక్రమానికి సంబంధించి విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. సమావేశంలో జేసీ కె.మయూర్ అశోక్, డీసీపీ మేరి ప్రశాంతి, డీఆర్వో బీహెచ్ భవానీనిశంకర్, ఏడీసీపీ రాజ్‌కమల్, ప్రత్యేకాధికారులు దయానిధి, మాధవి, మధుసూదనరావు, డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, ఇంటర్ ఆర్ఐవో మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఏఐ ట్రాఫిక్ సిగ్నల్స్ ఏవీ?

... 5వ పేజీ తరువాయి

ఉంటుందని, తద్వారా వాహనచోదకులు సిగ్నల్స్ వద్ద ఆగాల్సిన పని ఉండదని తెలియజేశారు. దీనివల్ల రోడ్లపై ట్రాఫిక్ సమస్య తగ్గడంతో పాటు సిగ్నల్స్ జంపింగ్ చేయాల్సిన అవసరం వాహనచోదకులకు ఉండదు. అలాగే ఎవరైనా వాహనం నడుపుతున్నప్పుడు సెల్ ఫోన్ మాట్లాడుతున్నా, హెల్మెట్ ధరించకపోయినా, ట్రిపుల్ రైడింగ్ చేసినా, ప్రమాదకరంగా వాహనాన్ని నడిపినా సరే సీసీ కెమెరాలు ఆటోమెటిక్‌గా ఉల్లంఘనను గుర్తించి సదరు వాహనం నంబర్ ప్లేట్ ఆధారంగా దాని యజమానికి ఈ-చలానా జారీ అయిపోతోంది. ఎక్కడైనా ట్రాఫిక్ జామ్ అయినట్టయితే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు లేదా సిబ్బందికి సమాచారం వెంటనే చేరిపోతుంది. దీనివల్ల వారు అక్కడకు చేరుకుని సమస్యను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుంది. ఎక్కువ పెండింగ్ చలానాలు ఉన్న వాహనం రోడ్డుపై వెళుతున్నా సరే.. ఆ వివరాలను ఆ కూడలిలోని సిబ్బందికి తెలిసిపోతుంది. ఏఐ టెక్నాలజీ కలిగిన సీసీ కెమెరాలు అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ పోలీసులకు పెద్దగా పని ఉండదు. ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి ఉల్లంఘనలను ఏఐ టెక్నాలజీ కలిగిన సీసీ కెమెరాలే పసిగట్టి ఆటోమెటిక్‌గా చలానాలను జారీ చేస్తుంది. పోలీసులు కేవలం డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు చేయడం, పెండింగ్ చలానాలను వసూలు చేయడం వంటి పనులు చేయాల్సి ఉంటుంది. అలాంటప్పుడు ట్రాఫిక్‌లో పనిచేసే సిబ్బందిని తగ్గించి ఇతర విధులకు కేటాయించేందుకు అవకాశం ఉంటుంది.మరోవైపు ఏఐ టెక్నాలజీ కలిగిన సీసీ కెమెరాలు పాత నేరస్థులు, రౌడీషీటర్లు, ఎక్కడైనా నేరం చేసి పరారైపోయేవారిని గుర్తించడం పోలీసులకు సులభతరమవుతుంది. పాత నేరస్థులు, రౌడీషీటర్ల వివరాలు, చిరునామా, ఫొటోలను ఆన్‌లైన్ చేసి ఏఐ టెక్నాలజీ కలిగిన సీసీ కెమెరాలకు అనుసంధానం చేసినట్టయితే అలాంటివారు ఎక్కడైనా సీసీ కెమెరాకు చిక్కితే వారి వివరాలను తక్షణమే సమీపంలోని పోలీసులకు తెలియజేస్తుంది. అప్పుడు పోలీసులు అప్రమత్తమై అలాంటివారిని అదుపులోకి తీసుకోవడం ద్వారా నేరం జరగకుండా చూసేందుకు అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో నగరంలో 110 కూడళ్లలో ఏఐతో కూడిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సీపీ శంఖబ్రత బాగ్చి ప్రతిపాదనలు తయారుచేశారు. ఒక్కో జంక్షన్‌లో ఎన్ని కెమెరాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది, ఇందుకోసం ఎంత ఖర్చు అవుతుందనే దానిపై అంచనాలను తయారుచేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు పలు ప్రైవేటు సంస్థలు ఆసక్తి చూపడంతో వారిలో మెరుగైన ప్రతిపాదనతో వచ్చే వారిని ఎంపిక చేసి వారితో పనులు చేయించేలా జీవీఎంసీసి సిఫారసు చేస్తామని గత ఏడాది నవంబరులో సీపీ తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా పదిచోట్ల వీటిని ఏర్పాటు చేయాలని జీవీఎంసీని కోరగా, సంబంధిత అధికారులు కౌన్సిల్‌లో ఈ అంశాన్ని చర్చించి ఆమోదించారు. అయితే ఆ తరువాత దీనిపై అతీగతీ లేకపోవడంతో ఆ ప్రతిపాదనలు అక్కడితోనే నిలిచిపోయాయి. దీంతో సీపీ ప్రతిపాదనలు ఆగిపోయినట్టేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

డిప్యూటీ మేయర్ ఎన్నికకు వైసీపీ దూరం!

... 5వ పేజీ తరువాయి

విధితమే. డిప్యూటీ మేయర్ ఎన్నిక కోసం సభ్యులందరికీ ఎన్నికల అధికారి హోదాలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఇప్పటికే నోటీసులు అందజేశారు. డిప్యూటీ మేయర్‌ను ఎన్నుకోవాలంటే కనీసం 56 ఓట్లు అవసరం. అయితే కూటమికి 74 మంది కార్పొరేటర్లు/ఎక్స్‌అఫీషియో సభ్యుల బలం ఉండడంతో కూటమి అభ్యర్థి డిప్యూటీ మేయర్‌గా ఎన్నికవ్వడం లాంఛనమేనని చెప్పుకోవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఎన్నికకు హాజరవ్వకూడదని వైసీపీ నేతలు తమ కార్పొరేటర్లను ఆదేశించినట్టు సమాచారం.

ప్రాజెక్టుల పరుగు..

... 5వ పేజీ తరువాయి

పూర్తి చేస్తాం. చీకటి పడ్డాక వెలుగులు విరజిమ్మడం దీని ప్రత్యేకత.

- మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం (ది డెక్)లో 4, 5 అంతస్థులు ఐటీ కార్యాలయాలకు ఇచ్చేశాం. మూడో అంతస్థులో రెస్టారెంట్, ఫైన్ డైనింగ్ పెడుతున్నాం. అలాగే టెర్రస్‌పై కెఫే ఏర్పాటు చేస్తున్నాం. ఈ భవనంలో స్పేస్ కోసం చాలా సంస్థలు పోటీ పడుతున్నాయి.
- కొత్తగా చేపట్టబోయే ఐదు మాస్టర్ ప్లాన్ రహదారులకు టెండర్లు పిలుస్తున్నాం. వీటిని వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నాం. ఈ రహదారులకు భూములు ఇచ్చే రైతులు, గృహస్థులకు వీఎంఆర్డీఏ పరిధి అయితే మేము టీడీఆర్‌లు ఇస్తాం. జీవీఎంసీ పరిధి అయితే వారు ఇస్తారు. ముందు టీడీఆర్‌లు ఇచ్చాకే పనులను ప్రారంభించాలనుకుంటున్నాం.
- విశాఖపట్నం విమానాశ్రయం సమీపాన కాకాని నగర్ వద్ద రూ.12 కోట్ల వ్యయంతో సబ్‌వే నిర్మాణం చేపడుతున్నాం.
- ఎన్ఏడీ వద్ద రైలు ఓవర్ బ్రిడ్జి పనులను మరో రెండు నెలల్లో పూర్తి చేస్తాం.
- అనకాపల్లిలో కొత్తగా వీఎంఆర్డీఏ జోనల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నాం. విజయనగరంలోని జోనల్ కార్యాలయాన్ని ఆధునీకరిస్తున్నాం.
- మధ్యతరగతి ప్రజల కోసం అపార్ట్‌మెంట్లు నిర్మించాలని చేసిన ప్రతిపాదనకు మంచి స్పందన వస్తోంది. మిథిలాపురి వుడా కాలనీ, మధురవాడ, వేపగుంట ప్రాంతాల్లో అనువైన భూములు ఉన్నాయి. అన్ని రకాల సదుపాయాలతో వీటిని నిర్మించి, మార్కెట్ రేటు కంటే తక్కువకు ఇవ్వాలని యోచిస్తున్నాం.
- వీఎంఆర్డీఏ సిటీ సెంట్రల్ పార్కులో గ్లో గార్డెన్‌కు కొన్ని మార్పులు చేసి పనులు చేపట్టాలని అనుకుంటున్నాం. అదేవిధంగా చైర్మన్ ప్రణవ్‌గోపాల్ సూచన మేరకు మాదక ద్రవ్యాలకు బానిసలైన వారికి కోసం ఓ కేంద్రాన్ని నిర్మించి కౌన్సెలింగ్ నిర్వహించే ఏర్పాటు కూడా చేస్తాం.
- కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జి పనులు కొంచెం నెమ్మదిగా జరుగుతున్నాయి. దానిని వేగవంతం చేస్తాం.

తుప్పలతో నిండిన ఖాళీ ప్రదేశాలు

పాముల సంచారంతో నివాసితుల్లో భయం

కూర్మన్నపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న స్థలాలు ప్రజలకు తీవ్ర అసౌకర్యానికి, ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఖాళీ స్థలాల్లో తుప్పలు, చెత్త, వ్యర్థాలు గుట్ట గుట్టలుగా పేరుకుపోతున్నాయి. ఏపుగా బలిసిన తుప్పల్లో పాములు, క్రిమి కీటకాలు కాలనీల్లోని ఇళ్లల్లోకి వస్తుండడంతో ప్రజలు భయపడుతున్నారు. 86వ వార్డులో పలుచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఉడా కాలనీలోని పలు ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి మురుగు నీరు ఏరులై పారుతోంది. పందులకు ఇవి ఆవాసాలుగా మారుతుండడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వ్యాప్తి చెందుతోంది. అలాగే ఖాళీ స్థలాల్లో వర్షం నీరు, మురుగు చేరి దోమలు, దుర్గంధం వ్యాప్తి చెందుతుండడంతో దీర్ఘకాల వ్యాధులు ప్రబలుతున్నాయని ఆయా కాలనీల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై జీవీఎంసీ పారిశుధ్యం సిబ్బందికి స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా... ఎవరూ పట్టించుకోవడం లేదు.



ఉడా నగర్ కాలనీలో ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోయిన తుప్పలు

పాతకర్నవానిపాలెంలో దుర్గమ్మ పండగ



పుష్పాలంకరణలో అమ్మవారు

గాజువాక, మే 15 (ఆంధ్రజ్యోతి) : పాతకర్నవానిపాలెం గ్రామ దేవత దుర్గమాంబ పండుగ గురువారం వైభవంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. మధ్యాహ్నం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు అప్పారావు, కనకారావు, మణి, వరహాలరావు పాల్గొన్నారు.

అగనంపూడి : జీవీఎంసీ 85వ వార్డు ఏడుమెట్ల మర్రిపాలెం, పరిసర గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ జాతర వైభవంగా జరిగింది. తెల్లవారుజామున 5 గంటల నుంచి భక్తులకు దర్శనాలు ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిక్కిరిసింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపు, కుంకుమ, పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను గ్రామంలో ఊరేగించి, అనంతరం ఆలయం వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

'బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి'

పెదగంట్యాడ, మే 15 (ఆంధ్రజ్యోతి) : బడిఈడు పిల్లలను విధిగా పాఠశాలల్లో చేర్పించాలని సమగ్ర శిక్ష అభి యాన్ అధికారి జి. శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన పెదగంట్యాడ, నెల్లిముక్కు, గొడ్డువానిపాలెంలోని అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నెల్లిముక్కు కేంద్రంలో మాట్లాడుతూ 3 నుంచి 5 ఏళ్లలోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లోను, 6 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోను చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూ, బెల్ట్, బ్యాగ్ తదితర సామగ్రి అందజేయడంతో పాటు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఓలు ఈ. శ్రీనివాసరావు, కె. రమణాజీ, అంగన్వాడీ కార్యకర్త వేణుశ్రీ, సీఆర్‌పీలు రామలక్ష్మి, ఝాన్సీరాణి, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ విశ్వనాథన్

పెదగంట్యాడ, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు ప్రాంతాల్లో వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అభివృద్ధి పనులను పరిశీలించారు. తొలుత పెదగంట్యాడ రహదారి పరిధిలో చేపడుతున్న క్రీడా సంబంధిత పనులను జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీతో కలిసి పరిశీలించారు. ఏయే స్పోర్ట్స్‌కు సంబంధించిన కోర్టులు ఏర్పాటు చేయాలో చర్చించారు. అనంతరం ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో జరుగుతున్న పనులను సాంకేతిక విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు.నెల రోజుల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అనకాపల్లి జిల్లా కోడూరు -2, నంగినారపాడు, కుంచంగి 1,1ఏలో జరుగుతున్న బీటీ రహదారులు, సీసీ కాలువల నిర్మాణాలను చూశారు. తుమ్మపాల కన్వెన్షన్ సెంటర్, రావు గోపాలరావు ఆడిటోరియంలో చేపట్టిన జోనల్ కార్యాలయం నిర్మాణాలు కూడా పరిశీలించారు.

లైమ్‌స్టోన్ దిగుమతిలో కొత్త రికార్డు

విశాఖపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టుకు నౌకలో వచ్చిన లైమ్‌స్టోన్‌ను రికార్డు సమయంలో దిగుమతి చేసి ఇంటిగ్రల్ ట్రేడింగ్ అండ్ లాజిస్టిక్స్ సంస్థ కొత్త రికార్డును నెలకొల్పింది. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్)కు చెందిన 28,353 టన్నుల లైమ్‌స్టోన్‌ను ఈ నెల 14న మధ్యాహ్నం 3.30 గంటలకు దిగుమతి ప్రారంభించి 15వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు పూర్తి చేసింది. డబ్ల్యూక్యూ-3 బెర్త్‌పై ఎంవీ విశ్వదక్ష నౌక ద్వారా వచ్చిన ఈ లైమ్‌స్టోన్‌ను అతి తక్కువ సమయంలో దిగుమతి చేశామని సంస్థ ఎండీ గ్రంధి రాజేశ్ పేర్కొన్నారు. ఈ రికార్డుకు సహకరించిన సెయిల్, పోర్టు ట్రాఫిక్ విభాగానికి కృతజ్ఞతలు తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా ఈ రంగంలో ఉన్న తమ సంస్థ ఏడాదికి రెండు మిలియన్ టన్నుల కార్గోను హ్యాండ్లింగ్ చేస్తుందన్నారు.

'చేనేత కార్మికులను ఆదుకోండి'

శ్రీనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత పరిశ్రమకు చేయూతనివ్వాలని 71వ వార్డు శ్రీనగర్‌కు చెందిన రాష్ట్ర చేనేత కులాల ప్రధాన కార్యదర్శి, టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు పప్పు రాజారావు అన్నారు. బుధవారం రాత్రి విజయవాడలో జరిగిన ఏపీ చేనేత ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో కేటాయించిన రూ.200 కోట్లు చాలవని, బడుగు, బలహీన వర్గాలను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్ పెంచాలని కోరారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్న ఎంఎస్‌ఎంఈ పార్క్‌లో స్థానిక చేనేత కార్మికులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.జిల్లా పారిశ్రామిక ప్రాంతంలో చేనేత యువతకు కుల వృత్తిలో నూతన టెక్నాలజీతో శిక్షణ, ఉపాధి కల్పించేలా క్లస్టర్లు ఏర్పాటు చేయాలని, వృద్ధాశ్రమం, కల్యాణ మండపాలు, సామాజిక భవనాలు ఏర్పాటుకు సహాయ సహకారాలు అందించాలన్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలో 2,50,000 మంది చేనేత కార్మికులు ఉన్నారని, కులవృత్తి గిట్టుబాటు కాక అంతరించిపోతుందని, ఈ క్రమంలో చేనేత యువతకు వృత్తిలో నూతన టెక్నాలజీతో శిక్షణ ఇప్పించి, ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మంత్రి సవితకు ఆయన వినతిపత్రం ఇచ్చారు.



సీఎం చంద్రబాబుతో రతన్‌కాంత్

చంద్రబాబును కలిసిన టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు

గాజువాక, మే 15 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్. రతన్ కాంత్ గురువారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పలు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వడం ఆనందంగా ఉందని తెలిపారు. నామినేటెడ్ పోస్టుల్లో యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎంను కోరారు.

గెడ్డలో పూడికలు తీయించాలని వినతి

పెదగంట్యాడ, మే 15 (ఆంధ్రజ్యోతి) : గంగవరం పోర్టు రోడ్డును ఆనుకుని ఉన్న ప్రధాన గెడ్డలో పూడిక తీయించాలని జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను కోరారు. గురువారం ఆయన కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గెడ్డ పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయిందని, ఏమాత్రం వర్షం పడినా.. ఇరువైపులా ఉన్న కాలనీలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని చెప్పారు.అలాగే రామచంద్రానగర్ పక్కనున్న డంపింగ్ యార్డు నుంచి విపరీతమైన దుర్వాసన వస్తుండడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. డంపింగ్ యార్డును ఆధునీకీకరించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

డీపీఎస్‌లో శత శాతం ఉత్తీర్ణత

ఉక్కుటౌన్‌షిప్, మే 15 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో పదో తరగతి సీబీఎస్‌ఈ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించామని ప్రిన్సిపాల్ సమీర్‌కుమార్ పాండే తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్షలకు 167 మంది విద్యార్థులు హాజరుకాగా అందరూ పాసయ్యారని, 12వ తరగతిలో కూడా నూరు శాతం ఉత్తీర్ణత సాధించామని చెప్పారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



ద్వారకాబస్‌స్టేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ద్వారకాబస్‌స్టేషన్‌లో భారత్ వికాస్ పరిషత్ ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి. అప్పలనాయుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)

● **శుభం**: శారద, శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

● **హిట్** : జగదాంబ, సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 14, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 18, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 42, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 38 దొండకాయలు 22, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)50, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 44, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 94, కీరదోస 34, క్యాప్సికమ్ 44, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 34, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45 ,నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర 3, పాలకూర 3, తోటకూర (3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

'పుస్తకాలపై దృష్టిపెట్టండి'

మల్కాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): పిల్లలు సెల్‌ఫోన్లపై కాకుండా పుస్తకాలపై దృష్టి పెట్టాలని 61వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి సోమేశ్ అన్నారు. మల్కాపురం శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో గురువారం ఆయన మాట్లాడుతూ చిన్న వయసు నుంచే పుస్తకాలను చదవడం ద్వారా భవిష్యత్‌లో మేధావులుగా ఎదుగుతారని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయ్ కుమార్ , స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ పండుగ

పెందుర్తి రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 95వ వార్డులో గొల్లవిల్లిపాలెం ప్రజల ఆరాధ్య దేవత బంగారమ్మ అమ్మవారి పండుగ గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే మహిళలు ఆలయానికి చేరుకుని అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్పొరేటర్ ముమ్మన దేవుడు, తదితరులు అమ్మవారికి పూజలు చేశారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి.

సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలు అందజేత

గోపాలపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనగర్‌కు చెందిన ఎన్. సింహాచలంకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1.44 లక్షల చెక్‌ను పశ్చిమ ఎమ్మెల్యే పి. గణబాబు గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పెంటమాంబ అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం

మల్కాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): హిమాచల్‌నగర్‌లో పెంటమాంబ అమ్మవారి ఉత్సవాలు గురువారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు అమ్మవారి పండగను ఆలయ నిర్వహకులు భక్తి శ్రద్ధలతో నిర్వహించబోతున్నారు. గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ తగిన ఏర్పాట్లు చేసింది.

మహిళలకు కుట్టు శిక్షణ

పెందుర్తి, మే 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్ద పీట వేస్తోంది. 'సెంటర్ ఫర్ రూరల్, అర్బన్ డెవలప్‌మెంట్ సంస్థ' ద్వారా కుట్టు శిక్షణ ఇప్పించి వారి కాళ్లమీద వారే నిలబడేలా ప్రోత్సహిస్తోంది. సరిపల్లి, గుర్రమ్మపాలెం, వేపగుంట ప్రాంతాల్లో సుమారు 150 మంది మహిళలు శిక్షణ తీసుకుంటున్నారు. శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టు మిషన్ అందిస్తామని నిర్వాహకులు చెప్పారు.

చిత్రలేఖన పోటీల్లో మెరిసిన విద్యార్థులు



జీవ వైవిధ్య సంరక్షణ చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గోపాలపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): జీవన వైవిధ్యాన్ని కాపాడటానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ అన్నారు. గురువారం అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం పురస్కరించుకుని ఉత్తరాంధ్ర జిల్లాల విద్యార్థులకు స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన జోనల్ స్థాయి చిత్రలేఖన పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడంతో పాటు జీవవైవిధ్యంపై వారికి అవగాహన కల్పించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఎన్జీసీ జిల్లా కో-ఆర్డినేటర్ బాబూరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్యం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ పోటీల్లో విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఈ నెల 22న అమరావతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలకు బహుమతులు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్జీసి విజయనగరం జిల్లా కో ఆర్డినేటర్ వేణుగోపాల్, అనకాపల్లి జిల్లా కో-ఆర్డినేటర్ ఖగేశ్,ప్రాంతీయ కో-ఆర్డినేటర్ జానకిరావు, జెడ్పీ హెచ్‌ఎం వైవీఎస్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో తనిఖీలు



క్యాంటీన్‌కు వచ్చినవారితో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ రాము

మల్కాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్ 5 కమిషనర్ రాము శ్రీహరిపురం అన్న క్యాంటీన్‌లో గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఉదయం ఏడుగంటలకే ఆయన క్యాంటీన్‌కు చేరుకుని, క్యాంటీన్ మొత్తాన్ని పరిశీలించారు. 'టిఫిన్, భోజనం రుచిగా ఉన్నాయా? లేదా?' అని క్యాంటీన్‌కు వచ్చినవారిని అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి సంతృప్తికరమైన జవాబు రావడంతో ఆయన సరే అన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఏమన్నా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ తనిఖీలో జీవీఎంసీ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

హెచ్‌పీసీఎల్‌లో మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్‌లో భాగంగా తీవ్రవాదులను అడ్డుకుంటున్న సైనికులు

మల్కాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) విశాఖ రిఫైనరీలో గురువారం సాయంత్రం ఒక్కసారిగా తీవ్రమైన హడావిడి. ఫైర్ అండ్ సేఫ్టీ, సెక్యూరిటీగార్డులు, రక్షణకు సంబంధించిన సూచనలు చేస్తు అటు ఇటు పరుగులు. ఈదృశ్యాలు పలువురు ఏమైందని ఆందోళ చెందారు. ఆ తరువాత సిందూర్ యుద్ధం కారణంగా తీవ్రవాదులు హెచ్‌పీసీఎల్‌లోకి ప్రవేశిస్తే ఎలా ఎదుర్కోవాలో, మనల్ని మనం ఎలా కాపాడుకోవాలనే అంశాలపై ఆక్టోపస్ బృందం మాక్‌డ్రిల్ నిర్వహించిందని హెచ్‌పీసీఎల్ యాజమాన్యం చెప్పింది. ఈ కార్యక్రమంలో హార్బర్ సర్కిల్ ఏసీపీ కాళీదాస్, మల్కాపురం పోలీసులు, రెవెన్యూ అధికారులు, ఫైర్ అండ్ సేఫ్టీ, నేవీ, ఆర్మీ, కోస్టుగార్డుల్బు, బీడీ టీమ్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవన నిర్మాణ పనులు పరిశీలన

ఎన్.ఎ.డి. జంక్షన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్‌లో విమాన్‌నగర్ అసోసియేషన్ సామాజిక భవనం అదనపు అంతస్తు స్లాబ్ నిర్మాణాన్ని వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ గురువారం పరిశరీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో మౌలిక వసతులు కల్పనకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ప్రతఇ కాలనీలో అసోసియేషన్ భవన నిర్మాణానికి జీవీఎంసీ నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ అదనపు అంతస్తు నిర్మాణాన్ని రూ.41.50లక్షతో చేపడతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈ వెంకటలక్ష్మి వర్క్ సూపర్‌వైజర్ రామకృష్ణ, సోమేశ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన

వేపగుంట, మే 15 (ఆంధ్రజ్యోతి) : వేపగుంట జోనల్ కార్యలయంలోని ఏఎమ్‌హెచ్‌ఓ కార్యాలయంలో గురువారం మలెరియా సిబ్బంది, సూపర్‌వైజర్‌కు సీజనల్ వ్యాధులు,పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఏఎమ్‌హెచ్‌ఓ బండారు అప్పలనాయుడు మాట్లాడుతూ వచ్చేది వర్షాకాలమని, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, దీనిపై సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా విభాగ సిబ్బంది పాల్గొన్నాది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వేపగుంట, మే 15(ఆంధ్రజ్యోతి): అప్పన్నపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో విద్యుతు ఫీడర్‌పై నిర్వాహణ, చెట్లకొమ్మలు తొలగింపు పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామని జోన్ 3 ఈఈ, పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ పనులు కారణంగా పద్మావతినగర్, షిప్‌యార్డ్ లేఅవుట్, మైత్రినగర్, జంగాలకాలనీ, అప్పన్నపాలెం, శ్రీనివాసనగర్, సింహపురికాలనీ, గొల్లనారాయణపురం ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు.



సీఐ పార్థసారధికి వినతిపత్రం ఇస్తున్న హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు

డీడీ నెక్స్ట్ లెవెల్ సినిమా ప్రదర్శన ఆపాలని వినతి

గాజువాక, మే 15 (ఆంధ్రజ్యోతి) : తమిళ డబ్బింగ్ సినిమా డీడీ నెక్స్ట్ లెవెల్ సినిమాలో కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి గోవింద నామాల పాటను వక్రీకరించి చూపించారని, తక్షణమే ఆ సినిమా ప్రదర్శనలను ఆపాలని హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం వారు గాజువాక సీఐ పార్థసారధికి వినతిపత్రం ఇచ్చారు. అంతకముందు గాజువాకలో ఓ మల్టీప్లెక్స్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఒక పాటను అర్థం మార్చి హేళన చేశారన్నారు. సినిమా ప్రదర్శన తక్షణమే ఆపకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ధార్మిక సెల్ అధ్యక్షుడు విజయశంకర్, ప్రతినిధులు పొలిమేర శ్రీనివాసరావు, నరసింగరావు, అభిరామ్, శేషలత పాల్గొన్నారు.

కళాకారులకు సత్కారం

అగనంపూడి, మే 15 (ఆంధ్రజ్యోతి) : అగనంపూడి కళారంగ సమైక్య ఆధ్వర్యంలో పౌరాణిక కళాకారులను గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం పౌరాణిక నాటకాలు కనుమరుగుతున్నాయన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను పౌరాణిక నాటకాల ద్వారా నేటి తరానికి తెలియజేస్తున్న కళాకారుల సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు చొప్పా నాగరాజు, విందుల వరహాలు, మొటూరి వెంకటరమణ, బి. సత్యనారాయణ, అన్నాజీరావు, పోలారావు తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులపై సస్పెన్షన్లు ఎత్తివేయాలి'

ఉక్కుటౌన్‌షిప్, మే 15 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ కార్మికులపై తప్పుడు సస్పెన్షన్‌లను యాజమాన్యం తక్షణమే ఎత్తివేయాలని, లేకపోతే ప్లాంట్‌ను స్తంభింపజేస్తామని ఉక్కు అఖిలపక్ష కార్మిక నాయకులు హెచ్చరించారు. ప్లాంట్‌లో గురువారం జరిగిన అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అనేక విధాలుగా పోరాటాలు చేస్తున్నా.. ప్లాంట్ ఉత్పత్తికి ఆటంకం లేకుండా చూశామన్నారు. కానీ యాజమాన్యం కార్మికులను భయభ్రాంతులకు గురిచేసే విధంగా ప్రవర్తిస్తుందన్నారు. కార్మిక హక్కులను హరించే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. యాజమాన్యంపై పోరాటాలు చేసే విధంగా యాజమాన్యమే సృష్టిస్తుందని ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పోరాటాలు చేయకపోతే యాజమాన్యం ఇదే అలుసుగా కార్మిక వర్గాన్ని అణిచివేస్తుందని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ వంటి భారీ ఉక్కు పరిశ్రమల్లో కార్మికులను భయపెట్టి పనిచేయించుకోవాని యాజమాన్యం చూస్తుందన్నారు. కార్మికులపై దాడి చేస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామన్నారు. 20న జరిగే సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని కోరారు.

నేటి నుంచి నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు

ఉక్కుటౌన్‌షిప్, మే 15 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్‌లో కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని, కార్మికులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని, సస్పెన్షన్‌లు ఎత్తివేయాలని, కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ఆపాలని తదితర డిమాండ్లతో ఈనెల 20న సమ్మె చేస్తున్నామని నాయకులు తెలిపారు. ఈమేరకు శుక్రవారం నుంచి 19వ తేదీ వరకు కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతారని చెప్పారు. అలాగే 16న బీసీ గేటు వద్ద నిరసన, 17న ప్లాంట్ ప్రధాన గేటు వద్ద నిరసన, 18న ఉక్కునగరం, నిర్వాసిత కాలనీల్లో ప్రచారాలు, ర్యాలీలు, 19న సాయంత్రం అఖిలపక్ష కార్మిక నాయకుల ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించనున్నామని అఖిలపక్ష కార్మిక నాయకులు తెలిపారు.

కార్మిక సమ్మెను విజయవంతం చేయండి

» జిల్లా ఇంటక్ ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం



సమావేశంలో మాట్లాడుతున్న నాగభూషణం


మల్కాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించే చట్టాలను తీసుకొస్తు అన్యాయం చేస్తోందని జిల్లా ఇంటక్ ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం అన్నారు. హెచ్‌పీసీఎల్ పాత గేటు ఎదురుగా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులతో గురువారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలన్ని కార్పొరేట్‌కు కొమ్ముకాసే విధంగా ఉన్నాయని, కార్మిక చట్టాలను అణగదొక్కడమే ధ్యేయంగా కేంద్రం అడుగులు వేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మే 20న దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు కలిసి సమ్మె నిర్వహిస్తున్నాయని, ఈ సమ్మెలో ద్వారా కార్మికుల సత్తా ఎంటో కేంద్రానికి తెలియజేయాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైఎస్ఆర్‌టీయుసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పైడిరాజు, లక్ష్మణమూర్తి, ఏఐటీయూసీ నాయకుడు కసిరెడ్డి సత్యనారాయణ, ఇంటక్ నాయకుడు ఎస్.తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

'సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

మల్కాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల అందరు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా మలేరియా విభాగంలో పనిచేసే సిబ్బందికి ఈ వ్యాధుల పట్ల అవగాహన ఉండాలని జోన్ 5 ప్రధాన వైద్యాధికారి (ఎంహెచ్‌వో) సునీల్ అన్నారు. డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా తదితర వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై శ్రీహరిపురం జీవీఎంసీ కార్యాలయల ప్రాంగణంలో మలేరియా విభాగ కార్మికులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా విభాగ కార్మికులు విధులు నిర్వహించే సమయంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సతీశ్, పాల్గొన్నారు.



డెంగీతో జాగ్రత్త సుమా!



పగటి పూట కుట్టే దోమ వల్ల వ్యాధి

- రెండు నుంచి ఏడు రోజుల వరకు తగ్గని జ్వరం
- ఒళ్లంతా తీవ్ర నొప్పులు, కండరాళ్లు, కీళ్ల బాధలు
- తీవ్రమైన తలనొప్పి, చర్మంపై ఎర్రటి మచ్చలు
- ప్లేట్‌లెట్లు పడిపోయే ప్రమాదం
- అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణుల సూచన

నేడు జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా..

విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

డెంగీ.. భయపెట్టే వ్యాధి. ఏడిస్ ఈజిప్టై అనే ఓ రకం ఆడదోమ పగటిపూట కుట్టడం ద్వారా వ్యాధి సోకుతుంది. రెండు నుంచి ఏడు రోజుల వరకు జ్వరం తగ్గదు. ఒళ్లంతా తీవ్ర నొప్పులు ఉంటాయి. కండరాళ్లు, కీళ్లు బాధిస్తాయి. తట్టుకోలేని విధంగా తలనొప్పి వస్తుంది. చర్మంపై ఎర్రటి మచ్చలు ర్యాస్‌లాగా కనిపిస్తాయి. రక్తంలో ఉన్న ప్లేట్‌లెట్స్ (రక్తకణాలు) పడిపోతాయి. మానవ శరీరంలో ప్లేట్‌లెట్స్ నాలుగు లక్షల వరకు ఉంటాయి. ఇవి వేలల్లోకి పడిపోతాయి పది వేల లోపునకు ప్లేట్‌లెట్స్ పడిపోతే ప్రాణాంతకమవుతుంది. ప్లేట్‌లెట్స్ అనేవి రక్తస్రావం జరగకుండా ఆపే కణాలు. ఇవి తగ్గడం వల్ల శరీరం లోపల భాగాల్లో రక్తస్రావం జరిగి ప్రమాదకర పరిస్థితికి దారితీస్తుంది. అందుకే ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ నెల 16న జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



డెంగీ బారిన పడి జ్వరం వచ్చిన వారిని పర్యవేక్షిస్తూ వైద్య సహాయం అందించాలి. శిశువులు, చిన్నపిల్లల్లో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. పురుషుల కంటే మహిళలు ఎక్కువ ప్రమాదకర స్థితికి చేరుకుంటారు. మధుమేహం, ఆస్తమా, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి మరీ ప్రాణాంతకం. రోగికి బాగా విశ్రాంతి ఇవ్వాలి. ఐవీ ఫ్లూయిడ్స్ ఇచ్చి బీపీ పడిపోకుండా చూడాలి. వైద్యుల సూచనల మేరకు పారాసిటమల్ మాత్రలు అందించాలి. ఎటువంటి పత్యం అవసం లేదు. తాజాగా, వేడిగా ఉన్న ఆహార పదార్థాలు అందించాలి. జ్వరం రెండు రోజుల నుంచి ఏడు రోజులలోపు తగ్గిపోతుంది. జ్వరం తగ్గినా తీవ్రమైన కడుపునొప్పి, మలం నల్లగా రావడం, చర్మంలో ఎర్రటి మచ్చలు, ముక్కు నుంచి రక్తస్రావం, ఒళ్లు చల్లబడడం, చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. వీటిని ప్రమాద సూచికలుగా గుర్తించి వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లాలి.

డెంగీషాక్ సిండ్రోమ్

డెంగీలో ఇది మరో రకమైన జ్వరం. శరీరంలో ఫ్లూయిడ్స్ పడిపోవడం, శరీరం లోపల అవయ వాల్లో రక్తస్రావం జరగడం ద్వారా నాడి బలహీనపడుతుంది. దీంతో బీపీ పడిపోవడం, కాళ్లు, చేతులు చల్లబడడం, తీవ్రమైన దాహం వంటి లక్షణాలు కనిపిస్తాయి. డెంగీ హేమరేజిక్ ఫీవర్, డెంగీ షాక్ సిండ్రోమ్‌లు వచ్చినప్పుడు ఆస్పత్రిలో అత్యవసర చికిత్స అందించాలి. జ్వరం వచ్చిన వెంటనే సొంత వైద్యం కాకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. చల్లని నీటితో శరీరాన్ని తుడవాలి. చల్లని ప్రదేశంలో పడుకోబెట్టాలి. తగ్గిన ప్లేట్‌లెట్స్‌ను వైద్యుని సలహా మేరకు ఎక్కించాలి.

డెంగీ హేమరేజిక్ ఫీవర్

డెంగీలో మరోరకం డెంగీ హేమరేజిక్ ఫీవర్. ఇది ప్రమాదకరమైన జ్వరం. శరీరంలో ఏ భాగంలోనైనా అంతర్గత రక్తస్రావం జరుగుతుంది. చర్మంపై ఎర్రటి మచ్చలు కనిపిస్తాయి. ముక్కు నుంచి రక్తస్రావం, రక్తవాంతులు, మెదడు, పొట్ట, ఊపిరి తిత్తుల్లో రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తాయి. రక్తాన్ని గడ్డకట్టించే ప్లేట్‌లెట్స్ బాగా తగ్గిపోవడంతో ఈ సమస్య వస్తుంది.

ఆహార నియమాలు

చికిత్సతో పాటు ఆహార నియమాలు పాటించాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలను అందించాలి. ఫ్లూయిడ్స్ ఎక్కువగా ఇవ్వాలి. ఓఆర్ఎస్ ద్రావకం తాగించాలి. మజ్జిగ, కొబ్బరి బొండాం నీళ్లు పట్టించాలి. పండ్ల రసాలు తీసుకోవాలి.

పరిశుభ్రతతోనే నివారణ

చెత్తా, చెదారం, మురుగునీరు దోమల ఆవాసాలు. గుట్టలుగా పోసే కొబ్బరి బొండాలు, పాత టైర్లు పడేస్తారు. వర్షాలు కురిసినప్పుడు వీటిలో నీరు నిల్వ ఉంటుంది. దోమలు గుడ్లు పెట్టేందుకు ఇవి అనువుగా ఉంటాయి. ఏడిస్ దోమలు కూలర్‌లు, ఫ్రిజ్ వద్ద పెరుగుతాయి. గృహాల సమీపంలో పరిశుభ్రత లేకపోయినా దోమలు పెరిగేందుకు అవకాశం ఇచ్చినట్టే. వర్షాలు ప్రారంభంకాక ముందే ఇంటాబయటా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.

ఇవీ కొన్ని ప్రాథమిక చర్యలు

- పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు రాకుండా నివారించాలి. కాయిల్స్, లిక్విడ్ లాంటివి వాడాలి. దోమతెరలు వాడితే ఇంకా మంచిది.
- తరచూ జ్వరం వచ్చినంత మాత్రాన డెంగీగా నిర్ధారించలేం. మలేరియా, టైఫాయిడ్ లక్షణాలు ఇలాగే ఉంటాయి. వ్యాధి నిర్ధారణతోనే చర్యలు తీసుకోవాలి.

స్టాఫ్‌నర్స్ ఎంపిక జాబితా విడుదల

సీతంపేట, మే 15, (ఆంధ్రజ్యోతి) : స్టాఫ్ నర్స్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో గురువారం స్టాఫ్ నర్స్ ఎంపిక జాబితా విడుదల చేసినట్టు రీజనల్ డైరెక్టర్ డాక్టర్ పి.రాధరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికేట్‌తో వారికి కేటాయించిన తేదీల్లో ఈ నెల 22, 23న రీజనల్ డైరెక్టర్ ఆఫీస్‌లో హాజరు కావాలని రీజన్ డైరెక్టర్ తెలిపారు.

గురుదేవ్ ఎక్స్‌ప్రెస్ స్లీపర్ కోచ్‌లో విద్యుదాఘాతంతో పొగలు

- భయాందోళనకు గురైన ప్రయాణికులు
- హుటాహుటిన చర్యలు చేపట్టిన రైల్వే సిబ్బంది
- ప్రయాణికులు సురక్షితం...
- యథావిధిగా గమ్యానికి బయలుదేరిన రైలు

విశాఖపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వే స్టేషన్‌లో గురుదేవ్ ఎక్స్‌ప్రెస్‌కు (12660) జరిగిన స్వల్ప ప్రమాదం ప్రయాణికులను భయభ్రాంతులను చేసింది. స్లీపర్ క్లాసు కోచ్‌లో జరిగిన విద్యుదాఘాతంతో ప్రయాణికులు కోచ్ నుంచి బయటకు పరుగులు తీశారు. హుటాహుటిన చేరుకున్న రైల్వే సిబ్బంది ప్రమాదాన్ని గుర్తించి నివారణ చర్యలు చేపట్టడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకుని తిరిగి గమ్యస్థానానికి బయలుదేరారు. ఇందుకు సంబంధించిన వివాలిలా ఉన్నాయి. షాలిమార్ నుంచి నాగర్ కోయిల్ జంక్షన్ వెళుతున్న గురుదేవ్ ఎక్స్‌ప్రెస్ (12660) గురువారం సాయంత్రం 4.10 గంటలకు విశాఖ రైల్వే స్టేషన్‌కు చేరుకొంది. స్లీపర్ క్లాసు కోచ్‌లో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన కొందరు వేసవి వేడిమిని దృష్టిలో ఉంచుకుని తమ సౌలభ్యం కోసం వ్యక్తిగత ఫ్యాన్‌ను కోచ్‌లోని ప్లగ్ పాయింట్ ద్వారా ఉపయోగించారు. అయితే రైలు విశాఖ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న వెంటనే ప్లగ్ పాయింట్ విద్యుదాఘాతానికి గురై కోచ్ నుంచి స్వల్పంగా మంట వచ్చింది. దీంతో ఫ్యాన్ ఉపయోగించిన ప్రయాణికులు భయపడి ప్లగ్ పాయింట్‌లో నీరు చల్లి మంటను ఆర్పే ప్రయత్నం చేయగా, ఒక్కసారిగా స్వల్పంగా పొగ వ్యాపించింది. ఇది గమనించిన కోచ్‌లో ఉన్న కొందరు ప్రయాణికులు భయపడి ప్లాట్‌ఫామ్ మీదకు పరుగుతీశారు. సమాచారం తెలుసుకున్న రైల్వే సిబ్బంది హుటాహుటిన రైలు వద్దకు చేరి ఘటన స్థలాన్ని పరిశీలించారు. అయితే అప్పటికే పొగ తగ్గిపోవడంతో విద్యుదాఘాతమైన ప్లగ్ పాయింట్‌ను రైల్వే సిబ్బంది పరిశీలించి పునరుద్ధరించడంతో రైలు ప్లాట్‌ఫామ్ నుంచి నిర్ణీత సమయానికి బయలుదేరింది. సమయాభావంతో విద్యుదాఘాతమైన బెర్తు వద్ద వ్యక్తిగత ఫ్యాన్‌ను ఉపయోగించిన వారిని పూర్తిస్థాయిలో విచారించలేకపోయారు. అంతేకాకుండా కోచ్‌లోని ప్రయాణికుల లగేజీని పూర్తి స్థాయి తనిఖీలు చేపట్టలేక పోయారు. దీంతో ఘటనకు కారణమైన వారితో పాటు కోచ్‌లో ప్రయాణికులను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేయాల్సిన నేపథ్యంలో కొందరు ఆర్పీఎఫ్ సిబ్బంది అదే రైలులో సామర్లకోట ప్రయాణించి పూర్తిస్థాయి దర్యాప్తు చేసే విధంగా ఆర్పీఎఫ్ అధికారులు చర్యలు చేపట్టారు.



పది లక్షల మొక్కలు నాటాలి

- జిల్లాలో పచ్చదనాన్ని పెంచాలి
- కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ విశాఖ మిషన్‌లో భాగంగా జిల్లాలో పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ కోసం పది లక్షల మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం తన చాంబర్‌లో వీఎంఆర్డీఏ, జీవీఎంసీ, డ్వామా, అటవీ, పరిశ్రమల శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంస్థలు, విద్యా సంస్థలు భాగస్వాములు కావాలన్నారు. వీఎంఆర్డీఏ లక్ష మొక్కలు, జీవీఎంసీ 2.5 లక్షలు, అటవీశాఖ 84,000, డ్వామా అరవై వేలు, పరిశ్రమల శాఖ ద్వారా 50 వేలు, పోర్టు అథారిటీ 25 వేలు, విద్యాశాఖ ద్వారా 12 వేలు, ఇతర శాఖలు, స్వచ్ఛంద సంస్థలు 4.28 లక్షల మొక్కలు మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వచ్చేనెల ఐదో తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఎఫ్‌వో మంగమ్మ, డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవి, వీఎంఆర్డీ డీఎఫ్‌వో శివాని, పరిశ్రమల శాఖ జీఎం ఆదిశేషు, విశాఖ పోర్టు అథారిటీ ఉద్యానవన శాఖాధికారి రాధిక, జీవీఎంసీ ఉద్యానవన శాఖాధికారి దామోదరరావు, తదితరులు పాల్గొన్నారు.

జూలై 5న జాతీయ లోక్ అదాలత్

విశాఖపట్నం, మే 15(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో జూలై 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయస్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటారు ప్రమాదాల నష్టపరిహారం కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇనిస్ట్రుమెంట్ చట్టం కేసులు, బ్యాంక్, మనీ రికవరీ, భూ సేకరణ కేసులు, కార్మిక, కుటుంబ తగాదా కేసులు, పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను ఈ జాతీయ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చునన్నారు. కక్షిదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా న్యాయ సేవా సదన్, న్యాయసేవాధికార సంస్థను గానీ 0891-2560414, 2575046 ఫోన్ నంబర్లను కానీ కాని సంప్రదించాలని పేర్కొన్నారు. అలాగే భీమిలి, గాజువాక, అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, చోడవరం, మాడుగుల, అరకు, చింతపల్లి, పాడేరుల్లో గల మండల న్యాయసేవా సంఘాలను సంప్రదించవచ్చన్నారు.

ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు

ద్వారకాబస్‌స్టేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి): ద్వారకా బస్‌స్టేషన్ రెండో ఫ్లోర్‌లో ఉన్న తమ సంస్థలో హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా యువతకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్, హోటల్ మేనేజ్‌మెంట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ (నర్సింగ్), ప్రొడక్షన్ మెషిన్ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. డిగ్రీ, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, పదో తరగతి పూర్తి చేసిన 18 నుంచి 28 ఏళ్లలోపు వయసు కలిగిన వారు ఆయా కోర్సుల్లో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు యూనిఫామ్, పుస్తకాలను ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు పూర్తి వివరాల కోసం 7337076665, 720 7953920 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడికి గాయాలు

ఉక్కుటౌన్‌షిప్, మే 15 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్-3 విభాగం వద్ద రైల్వే ట్రాక్‌లో షూ ఇరుక్కొని కాంట్రాక్టు కార్మికుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలవి.. గురువారం విధులకు హాజరైన కార్మికుడు పి.నూకరాజు ఎస్ఎంఎస్ విభాగానికి వెళ్లే మార్గంలో రైల్వే ట్రాక్ దాటుతుండగా కాళ్ల బూట్లు ట్రాక్ మధ్యలో ఇరుక్కుపోవడంతో కింద పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అధికారులు అతన్ని తక్షణమే ఆస్పత్రికి తరలించారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన బి.రాంబాబు (43)

ఆటోనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఆటోనగర్ జంక్షన్లో రహదారిపై నిలుచున్న వ్యక్తిని ప్రైవేటు బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం.. పెందుర్తి దరి వేపగుంటకు చెందిన బొజ్జా రాంబాబు (40) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. గురువారం ఉదయం విధులకు వెళ్లేందుకు ఆటోనగర్ జంక్షన్ వద్ద రహదారిపై నిలుచున్నాడు. అతివేగంగా వచ్చిన బస్సు అతన్ని ఢీకొన డంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అతనికి భార్య సత్య వతి, యామిని, సాయి తేజ ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మతి స్థిమితం లేని వ్యక్తి హల్‌చల్


డాబా ఎక్కి హల్‌చల్ చేస్తున్న వ్యక్తి


అదుపులోకి తీసుకున్న పోలీసులు

కూర్మన్నపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడిలో మతిస్థిమితం లేని వ్యక్తి ఎత్తైయిన భవనం పైకి ఎక్కి దూకేస్తానని గురువారం హల్‌చల్ చేశాడు. దీంతో స్థానికులు దువ్వాడ పోలీసులకు, పెదగంట్యాడ ఫైర్ స్టేషన్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఆ వ్యక్తిని కాపాడేందుకు ఎవరు దగ్గరకు వెళ్లినా తన దగ్గర ఉన్న కర్రతో కొట్టేందుకు యత్నించటంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. సంఘటనా స్థలానికి చేరుకొన్న దువ్వాడ పోలీసులు, ఫైర్ సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి భవనం పై నుంచి ఆ వ్యక్తిని కిందకు దించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించారు. ఆ వ్యక్తికి మతి స్థిమితం లేకపోవడంతో అలా ప్రవర్తించాడని, అతను ఒడిశాలోని కొరాపూట్ జిల్లా రతన్‌పూర్ దరి టిగర్‌పడా గ్రామానికి చెందిన సుమరి ఒండాలి శ్యామ్ సుందర్ (28)గా గుర్తించారు. శ్యామ్ సుందర్ ఎవరికీ చెప్పకుండా ఏదో రైలు ఎక్కి ఇక్కడకు వచ్చినట్టు పోలీసులు తెలిపారు. అతని శరీరంపై స్వల్ప గాయాలు ఉండడంతో చికిత్స నిమిత్తం అగనంపూడి ఆసుపత్రికి తరలించారు.



ANDHRA JYOTHI CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, DUDI SATYANNARAYANA (Old Name), S/o. Dudi Suribabu, resident of 1-86E, B.C.Colony, Kona Masivanipalem, Lakkavarapukota, Vizianagaram. Change my name from DUDI SATYANNARAYANA (Old Name) to DUDI SATYANARAYANA (New Name). Henceforth I am being called as DUDI SATYANARAYANA (New Name) for all purposes.

AJV_242230

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176, 9966165093



క్రైం... crime news

లారీని ఢీకొని ఆటో డ్రైవర్ మృతి


ప్రమాదానికి గురైన ఆటో


మృతి చెందిన రమణ (ఫైల్‌ఫొటో)

ఎండాడ, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ జాతీయ రహదారిపై లారీని ఢీకొని ఆటో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆనందపురం మండలం వెంకటాపురం పంచాయతీ గొట్టిపల్లి గ్రామానికి చెందిన బంగారు రమణ (46) ఆటో డ్రైవర్. గురువారం ఉదయం ఆనందపురం నుంచి కూరగాయల లోడ్‌తో పెదవాల్తేరు వెళ్తుండగా ఎండాడ మహిళా స్టేషన్ సమీపంలో అదే మార్గంలో వెళ్తున్న లారీ ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేయడంతో లారీ వెనుక భాగాన్ని బలంగా ఢీకొన్నాడు. దీంతో రమణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు పీఎంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

కల్యాణ మండపం శ్లాబ్ పెచ్చులూడి ఐదుగురికి గాయాలు


పెచ్చులూడిన కల్యాణమండపం శ్లాబ్


తలకు గాయాలైన వ్యక్తి

అక్కయ్యపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 27వ వార్డు దొండపర్తి మండా వారిపేటలోని జీవీఎంసీ కల్యాణమండపం శ్లాబ్ పెచ్చులూడిన ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. వీరిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం రాత్రి ఓ శుభ కార్యక్రమం విందు జరుగుతుండగా ఫ్యాన్ ఉన్న శ్లాబ్ పెచ్చు ఊడి బాలకృష్ణ, శంకర్ అనే వ్యక్తుల తలపై పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాలకృష్ణకు తల, మెడ భాగానికి తీవ్ర గాయాలయ్యాయి. బాలరాజు అనే వ్యక్తి చేతి వేళ్లకు గాయాలయ్యాయి. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ సత్యనారాయణ వెళ్లి పరిశీలించారు. ప్రస్తుతం వారంతా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

జీవీఎంసీ కల్యాణ మండపం సీజ్

ఈ నేపథ్యంలో గ్రేటర్ 27వ వార్డు దొండపర్తి మండావారిపేటలోని జీవీఎంసీ కల్యాణ మండపాన్ని జోనల్ కమిషనర్ శివప్రసాద్ సందర్శించారు. శ్లాబ్ పెచ్చులూడిన ఘటన ఎలా జరిగిందో అక్కడ ఉన్న వారిని అడిగి తెలుసుకున్నారు. అలాగే కల్యాణమండపాన్ని సీజ్ చేస్తున్నట్టు ప్రకటించారు. జీవీఎంసీకి ఆదాయం కాకుండా ప్రజల ప్రాణాలే ముఖ్యమన్నారు. అందుకోసం ఈ కల్యాణ మండపాన్ని సీజ్ చేసి, మరమ్మతులు చేసిన తర్వాత తెరుస్తామని తెలిపారు. ఘటనకు సంబంధించి జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు నివేదిక పంపించినట్టు చెప్పారు.

దిగంబర దొంగ

- దొరికితే మతిస్థిమితం లేని వ్యక్తిగా భావించి వదిలేస్తారన్నది వ్యూహం
- నిందితుడు విజయనగరం జల్లా కొత్తవలస వాసిగా గుర్తింపు


సీసీ ఫుటేజీలో కనిపించిన ఒంటిపై దుస్తులు లేకుండా దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడు

ఎంవీపీ కాలనీ, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఒంటిపై దుస్తులు లేకుండా అర్ధరాత్రి వేళలో ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగను ఎంవీపీ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి ద్వారకా జోన్ నేర విభాగం సీఐ చక్రధరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ఎంవీపీ ఆరో సెక్టరులోని ఓ ఇంట్లో రెండు రోజుల క్రితం చోరీ జరిగింది. రూ. 3,500లు పోయింది. అదే నిందితుడు మరో ఇంట్లోకి వెళ్లడానికి ప్రయత్నించినా, తలుపులు తెరుచుకోకపోవడంతో చోరీ యత్నం ఫలించలేదు. అయితే ఈ రెండు నివాసాల ముందు సీసీ కెమెరాలు ఉండడంతో, ఆ ఫుటేజీలను పరిశీలించగా అర్ధరాత్రి తర్వాత ఒంటిపై ఎలాంటి వస్త్రాలు లేకుండా ఇంటి ముందు ఓ వ్యక్తి తిరుగాడుతూ కనిపించాడు. ఈ విషయాన్ని ఎంవీపీ పోలీసులకు సమాచారం అందించడంతో వారు రంగంలోకి దిగారు. విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన వడ్డాది విజయ్ అలియాస్ పొట్టి విజయ్ అలియాస్ విజయ్ అధికారిగా గుర్తించి, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడడు పాత నేరస్తుడిగా గుర్తించారు. ఎంవీపీ స్టేషన్‌లోనే అతడిపై సస్పెక్ట్ షీటు కూడా ఉంది. అయితే ఈ విధంగా దుస్తులు లేకుండా చోరీలకు పాల్పడడం గురించి పోలీసులు ప్రశ్నించగా.. ఒంటిపై దుస్తులు లేకపోతే, తాను ఎవరికైనా దొరికినా మతిస్థిమితం లేని వ్యక్తిగా భావించి వదిలేస్తారని పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో.. ఎవరైనా నగ్నంగా లేదా చిన్నపాటి తువ్వాలు వంటివి కట్టుకుని అర్ధరాత్రి సమయంలో అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. ఎస్ఐ అప్పలరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురి అరెస్టు

గోపాలపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనచోదకుడ్ని అడ్డగించి దారి దోపిడీకి పాల్పడిన ఘటనలో ఇద్దరు యువకులతో పాటు ఓ బాలుడ్ని గోపాలపట్నం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మర్రిపాలెం ప్రాంతానికి చెందిన ఎం. అశోక్‌కుమార్ (23) ఈనెల 1న రాత్రి 8.30 గంటల సమయంలో విమాన్‌నగర్ మీదుగా ఎల్లపువానిపాలెం గ్రామం వైపు వస్తున్నాడు. ఈమేరకు ఎల్లపువానిపాలెం గ్రామానికి చెందిన రావాడ ప్రసాద్‌బాబు (32), చంద్రనగర్‌కు చెందిన దానూరి సాయికుమార్ (25)తో పాటు ఓ బా లుడు ఎల్లపువానిపాలెం అండర్‌పాస్‌వే వద్ద అశోక్‌కుమార్‌ను అడ్డగించారు. అతనిపై దాడి చేసి డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. దీంతో భీతిల్లిన అశోక్ తన అకౌంట్‌లో ఉన్న రూ.4 వేలను వారి అకౌంట్‌కు బదిలీ చేశాడు. అంతటితో ఆగకుండా సెల్‌ఫోన్ కూడా లాక్కుని పరారయ్యారు. ఈ ఘటనపై అశోక్ పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేయలేదు. మిత్రులు ఒత్తిడి చేయడంతో ఈనెల 10న దోపిడీ జరిగిన విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన గోపాలపట్నం క్రైం ఎస్ఐ తేజేశ్వరరావు బుధవారం రాత్రి నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. దారి దోపిడీకి పాల్పడిన ఇద్దరు యువకుల్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాలుడ్ని జువైనల్ హోమ్‌కు తరలించారు.

భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్య

మహారాణిపేట, మే 15 (ఆంధ్రజ్యోతి) : భర్త వేధింపులు భరించలేక ఓ వివాహిత గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇందుకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం వివరాలివి. టూ టౌన్ స్టేషన్ పరిధిలోని కొబ్బరితోట ప్రాంతానికి చెందిన గండిబో యిన సాయి (29), సతీష్ భార్యాభర్తలు. వీరిద్దరూ ఎనిమిదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లిచేసుకున్నారు. భర్త సతీష్ కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. సాయి ఆర్పీగా పనిచేస్తుంది. వీరికి కుమారుడు ఉన్నాడు. సతీష్‌కు వివాహేతర సంబంధం ఉందని తెలిసిన భార్య అతనిని నిలదీసింది. దీంతో ఆమెను వేధించసాగాడు. ఈ క్రమంలో భార్యభర్త ఇద్దరూ గత కొన్ని రోజులుగా గొడవలు పడుతుండేవారు. ఇదిలావుంటే, గురువారం సాయంత్రం సాయికి ఫోన్ వచ్చింది. ఏం జరిగిందో తెలియదుకానీ ఆమె తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లోని గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.